సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+20+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 12
సంచిక: 312

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | KARIMNAGAR | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ఆదివారం 2-2-2020




'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'



## మార్కెట్‌కు నచ్చలే!

ప్రత్యేక ట్రేడింగ్‌లో భారీ నష్టాలు

40,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్

988 పాయింట్ల పతనంతో 39,736కు సెన్సెక్స్

ఇంట్రాడేలో 1,092 పాయింట్లు క్షీణత

11,700 పాయింట్ల దిగువకు నిఫ్టీ

300 పాయింట్లు నష్టంతో 11,662 వద్ద ముగింపు..


- బిజినెస్‌లో

### ఐటీ శ్లాబులు ఇలా..

| ఆదాయ పరిమితి | పాత రేట్లు | కొత్త రేట్లు |
|---|---|---|
| 0- 2.5 లక్షలు | లేదు | లేదు |
| 2.5- 5 లక్షలు | 5% | 5% |
| 5- 7.5 లక్షలు | 20% | 10% |
| 7.5- 10 లక్షలు | 20% | 15% |
| 10- 12.5 లక్షలు | 30% | 20% |
| 12.5- 15 లక్షలు | 30% | 25% |
| 15 లక్షలు దాటితే | 30% | 30% |

(అరవై ఏళ్ల లోపు వారికి వర్తిస్తుంది..) ఈ రెండు విధానాల్లో రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి సెక్షన్ 87ఏ కింద గరిష్ఠంగా రూ.12,500 వరకు పన్ను రిబేటు రూపంలో లభిస్తుంది. అంటే ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.

### రాక రూపాయి.. పోక




### బడ్జెట్ స్వరూపం..(రూ.కోట్లలో)

| | |
|---|---|
| రెవెన్యూ వసూళ్లు | 20,20,926 |
| మూలధన వసూళ్లు | 10,21,304 |
| మొత్తం వసూళ్లు | 30,42,230 |
| రెవెన్యూ ఖాతా | 26,30,145 |
| మూలధన ఖాతా | 4,12,085 |
| మొత్తం వ్యయం | 30,42,230 |
| రెవెన్యూ లోటు | 6,09,219 |
| ద్రవ్య లోటు | 7,96,337 |
| ప్రాథమిక లోటు | 88,134 |

## పన్ను పోటు తగ్గినట్టేనా?

- ఆదాయపు పన్ను రేట్లు తగ్గించిన ఆర్థికమంత్రి.. నాలుగు శ్లాబుల స్థానంలో కొత్తగా ఏడు శ్లాబులు
- కానీ కొత్త విధానంలో 70 రకాల మినహాయింపులు తొలగింపు
- దీంతో పన్ను రేటు తగ్గినా భారం మాత్రం తగ్గడంటున్న నిపుణులు
- పాత విధానమా? కొత్త విధానమా? అనేది చెల్లింపుదారు ఇష్టం
- రెండు విధానాల్లోనూ రూ.5 లక్షల లోపు ఆదాయానికి పన్ను లేదు

పన్ను చెల్లింపుదారులకు ప్రస్తుతం ఉన్న 4 శ్లాబులను 7 శ్లాబులుగా మారుస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్లో ప్రతిపాదించారు. కొత్తగా ప్రతిపాదించిన 7 శ్లాబుల విధానంలో పన్ను రేట్లు మునుపటికన్నా తగ్గుతాయి. కాకపోతే మునుపటి మాదిరి ట్యూషన్ ఫీజు, హెచ్ఆర్ఏ, గృహ రుణంపై వడ్డీ, స్టాండర్డ్ డిడక్షన్, బీమా పాలసీలకు చెల్లించే మొత్తం, పీఎఫ్ వంటి మినహాయింపులేవీ ఈ విధానంలో ఉండవు. తగ్గించిన రేట్ల ప్రకారం నేరుగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే పాత విధానం ప్రకారం పన్ను చెల్లించాలా? కొత్త విధానానికి మారాలా? అన్నది పూర్తిగా పన్ను చెల్లింపుదారు ఇష్టంపైనే ఆధారపడి ఉంటుంది. నిజానికి కొత్త విధానం వల్ల పెద్దగా ఒరిగేదేమీ లేదన్నది పన్ను నిపుణులు చెబుతున్న మాట!!.

అన్నం లేదు.. ఆవకాయే.. -5లో




బడ్జెట్ 2020-21 ప్రత్యేక కథనాలు, వివరాలు..

2,5,6,7,8,9 10,11,12,13లో

# ఆర్థిక భారతం.. ఓ పద్మవ్యూహం

# మోదీ..అర్జునుడేనా?



దారుణంగా పడిపోయిన వృద్ధిరేటు.. నన్నెలా ఛేదిస్తారో చూస్తానంటూ సైంధవుడిలా సవాలు విసురుతోంది!!. ఎన్ని చర్యలు తీసుకున్నా దారికి రాని మందగమనం.. అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ లాంటి కురువీరులను గుర్తుకుతెస్తోంది. ఎంత ప్రయత్నించినా కట్టడికాని ద్రవ్యలోటు... ద్రోణుడు, కర్ణుడు, దుర్యోధనుడు, దుశ్శాసనుడి వంటి చక్రవ్యూహ సూత్రధారుల్ని స్ఫురణకు తెస్తోంది. వెరసి.. అభేద్యమైన పద్మవ్యూహం లాంటి బంధంలో భారత ఆర్థిక వ్యవస్థ ఇరుక్కు పోయింది. 5 శాతానికి పతనమైన వృద్ధిరేటు.. 7శాతానికి ఎగసిన ద్రవ్యోల్బణం.. మందగించిన అమ్మకాలు.. ఊడిపోతున్న ఉద్యోగాలు.. ఎత్తిపోతున్న బ్యాంకులు.. 10 లక్షల కోట్ల మేర పేరుకున్న బకాయిలు.. దివాలా తీస్తున్న కార్పొరేట్లు.. విస్తరిస్తున్న కరోనా వైరస్... వీటిలో ఏవీ చిన్న సమస్యలు కావు. పద్మవ్యూహానికి కాపుకాసిన రథ, గజ, తురగ, పదాతి దళాల్లాంటివే. బడ్జెట్ సాక్షిగా ఈ వ్యూహాన్ని ఛేదించ బోయారు మోదీ. కానీ!! వినియోగం పెంచాలంటే పన్నులు తగ్గాలి. అలా చేస్తే రాబడి తగ్గి లోటు పెరుగుతుంది. లోటు పెరిగితే రేటింగ్ తగ్గి అప్పులు పుట్టవు. ద్రవ్యోల్బణం పెరిగి ఆర్థికవ్యవస్థ అతలాకుతలం. మరెలా? అందుకే ఎల్ఐసీపై ఎనలేని నమ్మకం పెట్టుకున్నారు మోదీ. దాన్లో వాటా విక్రయించి.. లోటు పెరగకుండా ఖజానా నింపి.. ఈ బంధం నుంచి భారత్‌ను బయటకు తేవాలనుకుంటున్నారు. గతేడాది కూడా ఇలాంటి లక్ష్యాలు పెట్టుకున్నా.. సాధించలేకపోయారు. ఈ సారి అనుకున్నవి అర్జునుడిలా ఛేదిస్తే.. ఎకానమీ గాడిన పడుతుంది. అభిమన్యుడిలా విఫలమైతే మాత్రం.. మరిన్ని విపరిణామాలు చూడాల్సిందే!!.

### బడ్జెట్ హైలైట్స్..

- ఆదాయపు పన్ను రేట్లు, శ్లాబుల్లో భారీ మార్పులు.
- బ్యాంకులు దివాలాతీస్తే డిపాజిట్లపై బీమా కవరేజీ ఇప్పుడున్న రూ.1 లక్ష – రూ.5 లక్షల వరకూ పెంపు.
- ఆధార్ ప్రాతిపదికన పాన్ నంబరు కేటాయింపు.
- పబ్లిక్ ఇష్యూతో ఎల్ఐసీలో వాటా విక్రయానికి ఓకే.
- డిజిన్వెస్ట్‌మెంట్(ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటా అమ్మకం) ద్వారా 2020–21లో నిధుల సమీకరణ లక్ష్యం రూ.1.2 లక్షల కోట్లు. 2019–20లో ఈ లక్ష్యం రూ.65,000 కోట్లు మాత్రమే.
- రక్షణ రంగానికి కేటాయింపులు గతేడాది రూ.3.16 లక్షల కోట్ల నుంచి రూ.3.23 లక్షల కోట్లకు పెంపు.
- వ్యవసాయం, సంబంధిత రంగాలకు రూ.2.83 లక్షల కోట్ల నిధుల కేటాయింపు. నాబార్డ్ ద్వారా రీఫైనాన్స్ స్కీమ్‌ను మరింత విస్తృతంగా అమలు చేయాలని నిర్ణయం.
- మహిళలకు సరైన పెళ్లి వయస్సును సూచించేందుకు వీలుగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదన.
- షెడ్యూల్డ్ కులాలు, ఇతర వెనుకబడిన వర్గాలకు రూ.85,000 కోట్ల కేటాయింపు. షెడ్యూల్డ్ తెగలకు కేటాయింపు రూ.53,700 కోట్లు.
- ప్రస్తుత ద్రవ్యలోటును గత అంచనా 3.3%–3.8 శాతానికి సవరణ. వచ్చే ఏడాదికి 3.5 శాతానికి పెంపు.
- ఆరోగ్య రంగానికి రూ.69,000 కోట్లు, స్వచ్ఛ భారత్‌కు రూ.12,300 కోట్ల చొప్పున నిధుల కేటాయింపు.
- త్వరలో కొత్తగా జాతీయ విద్యా విధానానికి రూపకల్పన.

## మోదీ సర్కారు 'వృద్ధి' మంత్రం!

'వికసించిన షాలిమార్ వనం మన దేశం.. దాల్ సరస్సులో పుష్పించిన కమలం మన దేశం.. యువత నరాల్లో ప్రజ్వరిల్లుతున్న రుధిరం మన దేశం.. నా దేశం.. నీ దేశం.. మన దేశం.. విశ్వంలోనే ప్రియమైన దేశం'

(బడ్జెట్ ప్రసంగంలో సాహిత్య అకాడెమీ పురస్కార విజేత పండిట్ దీనానాథ్ కౌల్ కవితను ఉటంకించిన నిర్మల)

- బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- ఇటు వేతనజీవులు అటు కార్పొరేట్లను మెప్పించే తంత్రం
- రాబడులు తగ్గడంతో ద్రవ్యలోటు అదుపుతప్పినా వెరవని వైనం...

2లో



### పన్నుల వాటాలో తెలంగాణకు అన్యాయం..

2011 జనాభా లెక్కల ప్రాతిపదికన తీసుకున్న ఫలితం

### అంతా భ్రాంతియేనా!

కాళేశ్వరం, పసుపు బోర్డుల ఊసే లేదు

పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రస్తావనే కరువు

### ఐటీ, పారిశ్రామిక రంగాలకు నిరాశే!

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను పట్టించుకోని కేంద్ర బడ్జెట్

పారిశ్రామికవాడలు, ఫార్మాసిటీ, స్టీల్ ప్లాంటు ఊసేలేదు..

11లో

### కూత పెట్టని రైల్వే..

రాష్ట్ర లైన్ల ప్రస్తావనే లేని బడ్జెట్

-14లో

### కేంద్రాన్ని నమ్మితే అంతే: కేసీఆర్

## శంకరగిరి మాన్యాలే..

నిధుల్లో భారీ కోత ద్వారా తెలంగాణపై కేంద్రం వివక్ష

కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా నిష్పత్తిని తగ్గించడం దారుణం

జీఎస్టీ విషయంలో రాష్ట్రాలను మోసం చేస్తున్న కేంద్రం

కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలపై సీఎం సమీక్ష



సాక్షి, హైదరాబాద్: కేంద్ర పన్నుల్లో వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, ఇచ్చే నిధులకు సంబంధం లేకుండా పోతున్నదని, కేంద్రం మాట నమ్మితే శంకరగిరి మాన్యాలే దిక్కయ్యే పరిస్థితి ఏర్పడిందని సీఎం కేసీఆర్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం శనివారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2020–21 బడ్జెట్ ప్రతిపాదనలు పూర్తి నిరాశాజనకంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనల్లో రాష్ట్రానికి సంబంధించిన, రాష్ట్రంపై ప్రభావం చూపే అంశాలపై కేసీఆర్ ప్రగతిభవన్‌లో సీనియర్ అధికారులతో నాలుగు గంటల పాటు సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, కార్యదర్శి స్మితా సభర్వాల్, ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి సమీక్షలో పాల్గొన్నారు.

#### పురోగతికి శరాఘాతం..

రాష్ట్రానికి రావాల్సిన నిధుల్లో భారీ కోత విధించడం ద్వారా తెలంగాణపై కేంద్రం వివక్ష చూపిందని ఆరోపించారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి రావాల్సిన వాటా నిష్పత్తిని తగ్గించడం దారుణమని, నిధుల్లో భారీ కోత విధించడంతో రాష్ట్రంలో అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధుల కొరత ఎదురయ్యే ప్రమాదం ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న అనేక ప్రజోపయోగ కార్యక్రమాలకు ఆర్థిక చేయూత అందివ్వాలని కేంద్రాన్ని కోరినా, బడ్జెట్లో తగిన కేటాయింపులు చేయలేదన్నారు. అన్ని ప్రధాన రంగాలతో పాటు రాష్ట్రాలకు న్యాయంగా రావాల్సిన నిధుల్లో కేంద్రం భారీగా కోతలు విధించడం రాష్ట్రాల

మిగతా 11వ పేజీలో ▶






### ఇదండీ సంగతి



ఏదో అన్నాం కానీ.. నీకసలు ఆదాయమే లేదు.. ఇంకెలా రెట్టింపు చేస్తాం.. సారీ!




# మోదీ సర్కారు 'వృద్ధి' మంత్రం!

- బడ్జెట్‌లో ఇటు వేతనజీవులు అటు కార్పొరేట్లను మెప్పించే తంత్రం
- వ్యక్తిగత ఆదాయపు పన్ను రేట్లు, శ్లాబుల్లో భారీ మార్పులు
- కంపెనీలపై డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ పన్ను పూర్తిగా తొలగింపు
- పడిపోతున్న వృద్ధిరేటుకు ఊతమిచ్చేలా వ్యయాన్ని పెంచాలని నిర్ణయం
- రాబడులు తగ్గడంతో ద్రవ్యలోటు అదుపుతప్పినా వెరవని వైనం

న్యూఢిల్లీ

భయపెడుతున్న ద్రవ్యలోటు ఒకవైపు... అంతకంతకూ దిగజారుతున్న ఆర్థిక వ్యవస్థ మరోవైపు... ఇలాంటి సంకట పరిస్థితుల్లో కీలకమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మోదీ సర్కారు వృద్ధిరేటుకే తన ఓటు వేసింది. ఆదాయపు పన్ను(ఐటీ) రేట్లలో కోత ద్వారా వేతనజీవులకు ఊరటతో పాటు డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్(డీడీటీ) భారం నుంచి కంపెనీలకు పూర్తిగా ఉపశమనం కల్పించి అటు కార్పొరేట్లను మెప్పించే ప్రయత్నం చేశారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. దశాబ్దకాలంలోనే ఎన్నడూ లేనంత తీవ్రమైన మందగమనాన్ని ఎదుర్కొంటున్న ఆర్థిక వ్యవస్థను మళ్లీ పట్టాలెక్కించేందుకు ప్రభుత్వ వ్యయాన్ని కూడా భారీగానే పెంచుతూ ఎడాపెడా కేటాయింపులు చేశారు. ముఖ్యంగా వ్యవసాయం, మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేశారు. ఇందుకోసం ద్రవ్యలోటు లక్ష్యాలను కూడా పెంచేశారు. లోటును పూడ్చుకోవడానికి 'ఎల్ఐసీ'ని తురుపు ముక్కగా ఆమె ప్రయోగించారు. మొత్తం మీద 2020–21 ఆర్థిక సంవత్సరానికిగాను శనివారం సీతా రామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో భారీస్థాయిలో మెరుపులేవీలేనప్పటికీ... అత్యంత తీవ్రంగా నిరాశపరిచే అంశాలు కూడా లేవనేది విశ్లేషకుల మాట!!

### వేతనజీవులకు ఊరట...

మధ్య, ఎగువ మధ్య తరగతి వేతనజీవులకు ఊరటనిచ్చేందుకు ఐటీ రేట్లు, శ్లాబుల్లో కీలక మార్పులకు మోదీ సర్కారు శ్రీకారం చుట్టింది. రూ.10 లక్షల పైబడి వార్షిక ఆదాయం ఉన్న వ్యక్తి గత పన్ను చెల్లింపుదారులకు దీనివల్ల సుమారుగా ఒక ఏడాదిలో రూ.1,820 నుంచి రూ.20,300 ఆదా అవుతుందని అంచనా. అయితే, ఇప్పుడున్న రూ.50,000 స్టాండర్డ్ డిడక్షన్‌తో పాటు బీమా ప్రీమియం, భవిష్య నిధి, పిల్లల స్కూలు ఫీజులు, ఇతరత్రా అనేక మినహాయింపులన్నింటినీ వదులుకుంటేనే ఈ కొత్త రేట్ల ప్రకారం పన్ను ప్రయోజనం లభిస్తుంది. కొత్త విధానం వద్దనుకునేవారికి పాత శ్లాబులు, రేట్లను కొనసాగించుకునే వెసులుబాటును కూడా బడ్జెట్లో సీతారామన్ కల్పించడం విశేషం. అయితే, పన్ను విధానాన్ని సరళీకరిస్తున్నామంటూనే.. మరింత గందరగోళంగా మార్చారంటూ పలు వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ద్రవ్యలోటు లక్ష్యానికి తిలోదకాలు...

వృద్ధికి ఊతమిచ్చేందుకు వీలుగా పలు రంగాలకు భారీగా కేటాయింపులు జరపాల్సిన తరుణంలో ద్రవ్యలోటు(ప్రభుత్వ ఆదాయ, వ్యయాల మధ్య వ్యత్యాసం) లక్ష్యాలకు కేంద్రం పూర్తిగా నీళ్లొదిలేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు లక్ష్యాన్ని జీడీపీలో 3.3 శాతంగా నిర్దేశించిన ప్రభుత్వం... ఇప్పుడు దీన్ని 3.8 శాతానికి సడలించింది. అదేవిధంగా వచ్చే ఆర్థిక సంవత్సరం(2020–21) ద్రవ్యలోటు లక్ష్యాన్ని కూడా గతంలో 3 శాతంగా అంచనావేయగా... దీన్ని ఇప్పుడు 3.5 శాతానికి పెంచేసింది. దీనివల్ల మార్కెట్ నుంచి 2020–21లో ఏకంగా రూ.5.36 లక్షల కోట్ల రుణాలను సమీకరించాలని కేంద్రం నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019–20) రుణ సమీకరణను కూడా రూ.4.99 లక్షల కోట్లకు పెంచుతున్నట్లు సీతారామన్ ప్రకటించారు.

### ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ..

భారత్ ఇప్పుడు ప్రపంచంలో అయిదో ఆర్థిక వ్యవస్థగా(దాదాపు 2.5 ట్రిలియన్ డాలర్లు) ఎదిగిందని బడ్జెట్ ప్రసంగంలో సీతారామన్ పేర్కొన్నారు. 2014 మార్చి నాటికి స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో 52.2 శాతంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ రుణాలు... 2019 మార్చినాటికి 48.7 శాతానికి దిగొచ్చాయని చెప్పారు. అంతేకాదు... 2014–19 మధ్యలో సగటు జీడీపీ వృద్ధి రేటు 7.4 శాతంగా నమోదైందని... ద్రవ్యోల్బణాన్ని సగటున 4.5 శాతానికి కట్టడి చేశామని కూడా ఆర్థిక మంత్రి వివరించారు. కాగా, 2024 నాటికి భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే.

### మార్కెట్లు 'బేర్'...

ద్రవ్యలోటు లక్ష్యాలను పూర్తిగా గాలికొదిలేయడం.. ఇన్వెస్టర్లను మెప్పించే చర్యలను(దీర్ఘకాల మూలధన లాభాలపై పన్ను–ఎల్‌టీసీజీ తొలగించాలన్నది మార్కెట్ వర్గాల ప్రధాన డిమాండ్) విస్మరించడం... వృద్ధికి ఊతమిచ్చేలా నిర్దుష్ట చర్యలేవీ ప్రకటించకపోవడం వంటి కారణాలతో స్టాక్ మార్కెట్లు బడ్జెట్ పట్ల తీవ్రంగా స్పందించాయి. సెన్సెక్స్ ఏకంగా 988 పాయింట్లు కుప్ప కూలింది. దాదాపు దశాబ్దకాలంలో ఒక్క రోజులో ఇంత భారీ నష్టాన్ని చవిచూడటం గమనార్హం. ఇక ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 300 పాయింట్లు క్షీణించింది.



బడ్జెట్ సందర్భంగా పార్లమెంటుకు వచ్చిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తండ్రి నారాయణన్ సీతారామన్, కూతురు పరకాల వాఙ్మయి

### బ్యాంకు డిపాజిట్లపై ఇకపై రూ.5 లక్షల బీమా రక్షణ!

బ్యాంకులేవైనా దివాలాతీస్తే ఇప్పటి వరకూ డిపాజిట్‌దారులకు రూ.లక్ష వరకూ మాత్రమే బీమా రక్షణ ఉంది. దీన్ని ఇప్పుడు ఏకంగా ఐదు రెట్లకు.. అంటే రూ.5 లక్షలకు పెంచుతూ బడ్జెట్‌లో కేంద్రం నిర్ణయం తీసుకుంది. గతేడాది మహారాష్ట్రకు చెందిన పీఎంసీ బ్యాంకు స్కామ్ వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో డిపాజిటర్లు గగ్గోలు పెట్టడం తెలిసిందే. ఈ పరిణామం నేపథ్యంలోనే డిపాజిట్లపై బీమా రక్షణను భారీగా పెంచుతున్నట్లు మోదీ సర్కారు ప్రకటించడం గమనార్హం.

### ఆదాయాలు, కొనుగోలు శక్తి పెంపే లక్ష్యం

వరుసగా రెండో ఏడాది పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్... దేశ ఆర్థిక వ్యవస్థ మూలాలు చాలా బలంగానే ఉన్నాయని ఉద్ఘాటించారు. ద్రవ్యోల్బణాన్ని కట్టడిలోనే ఉంచుతున్నామని పేర్కొన్నారు. ప్రధానంగా ప్రజల ఆదాయాలు, కొనుగోలు శక్తిని పెంచడమే లక్ష్యంగా 2020–21 బడ్జెట్‌లో కీలక చర్యలను ప్రకటిం చామని ఆమె స్పష్టం చేశారు. దేశీయంగా తయారీని ప్రోత్స హించేందుకు వీలుగా వంట సామగ్రి నుంచి ఎలక్ట్రికల్ పరికరాలు, ఫర్నిచర్, స్టేషనరీ, ఆటబొమ్మలు ఇలా అనేక ఉత్పత్తుల దిగుమతులపై సుంకాన్ని పెంచారు. మరోపక్క, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే లక్ష్యంతో వ్యవసాయం... గ్రామీణాభివృద్ధికి ఏకంగా రూ.2.83 లక్షల కోట్ల ను కేటాయించారు. రైతు రుణాల లక్ష్యాన్ని 2020–21లో రూ.15 లక్షల కోట్లకు పెంచారు. రూ.1.7 లక్షల కోట్లను రవాణా మౌలిక సదుపా యాల కల్పనకు వెచ్చిస్తున్నట్లు సీతారామన్ ప్రకటించారు. కీలకమైన ఇంధన రంగానికి కూడా రూ.40,750 కోట్లు కుమ్మరించడం విశేషం. విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో కొన్ని స్కీములకు కేటాయింపుల పెంపు ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని 2020–21లో 13 శాతం మేర పెంచేలా సీతారామన్ చర్యలు చేపట్టారు. అయితే, ప్రస్తుతం ఉన్న తీవ్ర మందగమనానికి ఐటీ ఊరట, వ్యయాల పెంపు వంటి ఈ అరకొర చర్యలు సరిపోవని.. భారీ ఉద్దీపనలు అత్యవసరమని నిపుణులు పేర్కొంటున్నారు.

### కార్పొరేట్లకు రూ.25,000 కోట్ల తాయిలం

గతేడాది సెప్టెంబర్‌లో కార్పొరేట్ పన్నును 30 శాతం స్థాయి నుంచి ఏకంగా 22 శాతానికి తగ్గిస్తూ.. కీలక నిర్ణయాన్ని మోదీ ప్రభుత్వం తీసుకుంది. కొత్తగా ప్లాంట్లు నెలకొల్పే కంపెనీలకైతే 15 శాతం పన్నునే వర్తింపజేస్తామని కూడా ప్రకటించారు. ఇప్పుడు డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ (డీడీటీ) భారం నుంచి కూడా కార్పొరేట్లకు ఉపశమనం కలిగించి.. మందగమనంలో ఉన్న పరిశ్రమలకు ఊరటనిచ్చే చర్యలను కేంద్రం తీసుకుంది. డీడీటీని ఇకపై నిర్దేశిత శ్లాబులను అనుసరించి డివిడెండ్ పొందినవారే చెల్లించాల్సి ఉంటుంది. ఈ తాజా ప్రతిపాదనతో ప్రభుత్వ ఖజానాకు రూ.25,000 కోట్లు చిల్లుపడుతుందని కూడా ఆమె పేర్కొన్నారు. మరోపక్క, ప్రభుత్వ రంగ బ్యాంకులకు 'ఇంద్రధనుష్' పథకంలో భాగంగా ఇప్పటికే దండిగా మూలధనం అందించడం.. పలు బ్యాంకులను విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో బడ్జెట్‌లో ప్రత్యేకంగా వీటికి సంబంధించి ఎలాంటి ప్రకటనలూ చేయలేదు.

### స్టార్టప్‌లకు దన్ను...


స్టార్టప్‌లకు ఊతమిచ్చేలా సీతారామన్ కీలక చర్యలు తీసుకున్నారు. ఎంప్లాయీ స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్ (ఎసాప్స్)పై అయిదేళ్ల పాటు ట్యాక్స్ హాలిడే ప్రకటించారు. 'ఎసాప్స్‌కి సంబంధించి ఉద్యోగులపై తక్షణ పన్ను భారం పడకుండా అయిదేళ్ల పాటు లేదా వారు సంస్థ నుంచి తప్పుకునే దాకా లేదా విక్రయించే దాకా (ఏది ముందైతే అది) ట్యాక్స్ హాలిడే వర్తిస్తుంది' అని మంత్రి పేర్కొన్నారు. శైశవ దశలో ఉన్న స్టార్టప్ సంస్థలు నిపుణులైన సిబ్బందిని ఆకర్షించేందుకు, సంస్థను విడిచిపెట్టి వెళ్లిపోకుండా అట్టే పెట్టుకునేందుకు ఈ ఎసాప్స్ ఉపయోగపడతాయి.

### ఆర్థిక క్రమశిక్షణకు సవాళ్లు: మూడీస్

భారత్‌లో జీడీపీ వృద్ధి మందగమనం ప్రభుత్వం చెబుతున్నదానికంటే చాలా ఎక్కువ కాలమే కొనసాగే అవకాశం ఉందని... దీనివల్ల ఆర్థిక క్రమశిక్షణ(ద్రవ్యలోటు కట్టడి)కు తీవ్రమైన సవాళ్లు పొంచిఉన్నాయని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ పేర్కొంది. ప్రస్తుతం భారత్ సార్వభౌమ (సావరీన్) రేటింగ్‌పై తమ ప్రతికూల దృక్పథాన్ని (నెగటివ్ అవుట్‌లుక్) ఈ రిస్కులు ప్రతిబింబిస్తున్నాయని కూడా అభిప్రాయపడింది. ప్రస్తుతం భారత్‌కు మూడీస్ 'బీఏఏ2 (ప్రతికూల అవుట్‌లుక్)ను కొనసాగిస్తోంది. ఈ స్థాయి రేటింగ్ ఉన్న దేశాలతో పోలిస్తే.. భారత్ రుణ భారం చాలా ఎక్కువగా ఉందని కూడా మూడీస్ స్పష్టం చేసింది. 'బడ్జెట్‌లో ద్రవ్యలోటు లక్ష్యాలను 3.8 శాతం(2019–20 ఏడాదికి), 3.5 శాతాలకు(2020–21 సంవత్సరానికి) సడలించడం, బలహీన వృద్ధి, పన్నుల కోతలను పరిగణనలోకి తీసుకుంటే ప్రభుత్వం స్థూల ఆదాయ లక్ష్యాలను సాధించడం కష్ట సాధ్యమే' అని రేటింగ్ దిగ్గజం కుండబద్దలు కొట్టింది.

### బంగారుబాతు.. ఎల్ఐసీ!

ద్రవ్యలోటును పూడ్చుకోవడానికి మోదీ ప్రభుత్వం ఎన్నాళ్లుగానో ప్రతిపాదనల్లోనే ఉన్న 'ఎల్ఐసీ' వాటా విక్రయం అంశాన్ని తెరపైకి తీసుకొచ్చింది. ప్రస్తుతం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ)లో ప్రభుత్వానికి 100 శాతం వాటా ఉంది. దీనిలో కొంత వాటాను పబ్లిక్ ఆఫర్(ఐపీఓ) ద్వారా విక్రయించడం ద్వారా స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ చేయాలని నిర్ణయించినట్లు ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. ఇప్పటిదాకా ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)ల్లో వాటా విక్రయం(డిజిన్వెస్ట్‌మెంట్) ప్రక్రియలో ఎల్ఐసీ నుంచే (షేర్లను కొనిపించడం ద్వారా) ప్రభుత్వం నిధులను లాగేస్తూ వస్తోంది. ఇప్పుడు నేరుగా ఎల్ఐసీలోనే వాటాను అమ్మడం అంటే... 'బంగారు బాతు' సామెతను తలపిస్తోందని కొందరు నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.



బడ్జెట్ ప్రసంగం సందర్భంగా షుగర్ లెవెల్స్ పడిపోవడంతో ఇబ్బంది పడుతున్న నిర్మలకు జాగ్రత్తలు చెబుతున్న రాజ్‌నాథ్, మోదీ

## సీతారామన్... సుదీర్ఘ ప్రసంగం!

- అలసటతో చివర్లో త్వరగా ముగింపు

న్యూఢిల్లీ: కశ్మీరీ కవిత, తమిళ కవుల పలుకులు ఉటంకిస్తూ, సింధు నాగరికతను గుర్తు చేసుకుంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేశారు. దీంతో రికార్డు బడ్జెట్ ప్రసంగం చేసిన ఆర్థిక మంత్రిగా చరిత్ర సృష్టించారు. శనివారం పార్లమెంట్‌లో నిర్మల దాదాపు 2 గంటల 42 నిమిషాల మేర బడ్జెట్ ప్రసంగం చేశారు. దీంతో గతంలో ఆమె పేరునే ఉన్న సుదీర్ఘ ప్రసంగం రికార్డును బద్దలు కొట్టారు. చివరలో కొంచెం అస్థత్వత కలగడంతో చివరి పేజీలను చదవకుండా వదిలేశారు. లేదంటే నిర్మలమ్మ ప్రసంగం మూడు గంటలు దాటి ఉండేదే! గతేడాది జూలైలో నిర్మల తన తొలి బడ్జెట్ ప్రసంగం చేశారు. ఆ సమయంలో ఆమె 2 గంటల 17 నిమిషాల పాటు బడ్జెట్ ప్రసంగం చేసి రికార్డు సృష్టించారు. తిరిగి ఈ రోజు ఆమే తన రికార్డు బ్రేక్ చేశారు. గతంలో 2003లో అప్పటి ఆర్థిక మంత్రి జస్వంత్ సింగ్ దాదాపు 2గంటల 13 నిమిషాల ప్రసంగం చేశారు. అంతకుముందు 1991లో అప్పటి ఆర్థిక మంత్రి మన్మోహన్ చేసిన ప్రసంగం కూడా సుదీర్ఘమైనదే! తాజా ప్రసంగంలో కశ్మీర్‌కు చెందిన కవితను అటు కశ్మీరీ, ఇటు హిందీలో ఆమె ఉటంకించారు. దీనికితోడు కాళిదాస విరచిత రఘువంశంలోని శ్లోకాన్ని, ప్రముఖ తమిళకవి తిరువళ్లువర్ రచనలను ఆమె తన ప్రసంగంలో గుర్తు చేసుకున్నారు. పలు సందర్భాల్లో ప్రధాని మోదీ సహా అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచి ఆమెను ప్రశంసించారు. బేటీ బచావో పథకం ప్రస్తావనతో పాటు పలు అంశాల వద్ద ప్రతిపక్షాలు ఆమె ప్రసంగానికి అడ్డుతగిలాయి. సుదీర్ఘ ప్రసంగం చివరలో అలసిన ఆమె తన మిగతా ప్రసంగం పూర్తయినట్లు భావించాలని స్పీకర్‌ను కోరి కూర్చుండిపోయారు. సీతారామన్ షుగర్ లెవల్స్ పడిపోవడంతో పక్కనే కూర్చున్న మంత్రి గడ్కరీ ఆమెకు చాక్లెట్ ఇచ్చారు. కాగా, ఆరోగ్యం, సంతోషం, సంపద, ఉత్పత్తి, భద్రత.. ఈ ఐదు ఒక దేశ అందమైన ఆభరణాలు' అని ప్రఖ్యాత తమిళ కవి తిరువళ్లువార్ కవితా పంక్తులను ఆమె ఉటంకించారు. ప్రసంగం అనంతరం మోదీ నిర్మలను ప్రశంసించడం కనిపించింది.




హోం ఫర్నిచర్ అండ్ స్టోరేజెస్ | మాడ్యులర్ కిచెన్స్ | మ్యాట్రెసెస్
INDIA'S LARGEST FURNITURE BRAND | GREEN ASSURANCE | GODREJ WARRANTY
/godrejinterio | /godrejinterio4u | /godrejinterio | www.godrejinterio.com Toll Free Number: 1-800-267-1122
Paytm Cashback | The Exchange Offer | Gift Card | EMI Finance
GODREJ INTERIO STORE: HYDERABAD: RETHIBOWLI – 9154976217, 7032565979 GACHIBOWLI – 9346440306, 9440638415. KUKATPALLY – 6300992232, 8555027408. NACHARAM: 42212096, 8374811491. L.B.NAGAR – 24124744, 7799306529. ABID ROAD – 23201027, 23204810. SECUNDERABAD: MG ROAD – 27721346, 7731975089. VIKRAMPURI – 27890538, 27890438. FURNITURE AND STOREWEL DEALERS: HYDERABAD: KOMPALLY: Nice & New furniture – 9963449901, 9040344953. HANMAKONDA: Laxmi Mahesh Traders – 8247323689, 8099839966. NIZAMABAD: Laxmi Ganapathi Enterprises – 9393936930, 9652002424. KHAMMAM: Sree Enterprises – 9030410034, 9866410034. STORWEL DEALERS: HYDERABAD: Srinivasa Marketing – 9849872413, MAHBUBNAGAR: Sree Prasanna Laxmi Enterprises – 9440656018. Southern Agencies: WARANGAL: 0870 – 2565412, 8374336369. KHAMMAM: 08742 – 224285, 9866957701. KOTHAGUDEM: 08744 – 242428, 7981235265. KITCHEN GALLERY: HYDERABAD: BANJARA HILLS – Technocrats – 9966180706, GACHIBOWLI – V Green Furnitures & Fixtures – 9440638415, 8099740306, K.P.H.B – Dhanvika Galleria – 48531336, 9100021336. L.B.NAGAR – P. Square Enterprises – 7799885325 , 7799306529 SECUNDERABAD: R.K. PURAM: Hasini Modular Systems – 040 – 40042694, 9246117442. NACHARAM – Balaji Furniture – 9963121960 Warangal: Laxmi Mahesh Traders – 0870 – 2980000, 8247323689. MATTRESS DISTRIBUTORS: HYDERABAD: Thirumala Electronics: 9440678750, 9581043366. Balaji Furniture: 48517438, 9246217365. HANMAKONDA: Laxmi Mahesh Traders – 8247323689, 8099839966. NIZAMABAD: Laxmi Ganapathi Enterprises – 9393936930, 9652002424, NALGODNA: 7B Enterprises: 9494970043. MATTRESS EBO's: Alwal: Bheema Enterprises – 9848296162, Miryalguda: Sri Bhavana Traders – 9885293500. Dealers / Distributors required for Godrej Interio Furniture / Mattress across Telangana and Andhra Pradesh. Pls contact Mr. Brahma Chary – 9704336222, For Modular kitchen dealership, please contact Mr. Sumanth – 9739796217.
*T&C Apply

## మరోసారి

# మొండిచేయి

### కేంద్ర పన్నుల వాటా నుంచి ఈ ఆర్థిక ఏడాది రూ.34,833 కోట్ల కేటాయింపులు

- సవరించిన అంచనాల్లో అది రూ.28,242 కోట్లకు తగ్గింపు
- ఫలితంగా రూ.6,590 కోట్ల మేర కోత
- వచ్చే ఆర్థిక ఏడాదికీ నిధుల శాతం తగ్గుదల
- రూ.32,237 కోట్ల మాత్రమే కేటాయించిన కేంద్రం
- ప్రత్యేక హోదాతో పాటు వెనుకబడిన జిల్లాల గ్రాంటు ఊసేలేదు



**సాక్షి, అమరావతి/న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వ తాజా బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ నిరాశే ఎదురైంది. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరంను తీవ్ర నిరుత్సాహపర్చింది. కేంద్ర పన్నుల వాటా నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల్లో భారీ కోత పడింది. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్ర పన్నుల వాటాలో రాష్ట్రాలకు 42 శాతం ఇవ్వాలని ఉండగా ఆ ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పూర్తిస్థాయి బడ్జెట్‌లో రూ.34,833.18 కోట్లు కేటాయించింది. కానీ, ఇప్పుడు సవరించిన అంచనా మేరకు కేంద్ర పన్నుల వాటా నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులు కేవలం 28,242.39 కోట్లేనని కేంద్రం పేర్కొంది. అంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర పన్నుల వాటా నుంచి వస్తాయనుకున్న నిధుల్లో రూ.6,590.79 కోట్ల మేర కోత పడింది. మరోపక్క.. వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కేంద్ర పన్నుల వాటా నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులను 4.111 శాతానికి తగ్గించేయడం విచిత్రంగా ఉంది. ఇందులో భాగంగా వచ్చే ఆర్థిక రాష్ట్రానికి రూ.32,227.68 కోట్లు వస్తాయని కేంద్రం పేర్కొంది.

#### రెవెన్యూ లోటు భర్తీ కూడా లేదు

రాష్ట్ర విభజన అనంతరం ఏపీ వరుసగా ప్రతీ ఏడాది రెవెన్యూ లోటులో ఉంటున్న నేపథ్యంలో వచ్చే ఐదేళ్లపాటు కూడా రెవెన్యూ లోటులోనే ఉంటుందని.. ఇందుకు గ్రాంటును సిఫార్సు చేయాల్సిందిగా 15వ ఆర్థిక సంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీంతో 2020–21 ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ లోటు భర్తీ కింద రూ.5,897 కోట్లు మంజూరు చేయాలని 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. కానీ, బడ్జెట్‌లో ఇందుకు ఎలాంటి కేటాయింపులు చేయలేదు.

పలు సందర్భాల్లో ప్రత్యేక హోదాతో పాటు వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతూ వస్తున్నా ఈసారి బడ్జెట్‌లో కూడా రాష్ట్రానికి కేంద్రం తీవ్ర నిరాశే మిగిల్చింది.

#### జాతీయ విద్యా సంస్థలకు అరకొరగా..

పునర్విభజన చట్టంలో పొందుపరిచిన జాతీయ విద్యా సంస్థలకు మాత్రం కేంద్రం అరకొరగా నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా.. కేంద్రీయ, గిరిజన విశ్వవిద్యాలయానికి స్వల్పంగా కేటాయింపులు పెరిగాయి. ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ వర్సిటీకి రూ.60.35 కోట్లు, గిరిజన విశ్వవిద్యాలయానికి రూ.26.90 కోట్లు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) కి రూ.31.82 కోట్లు కేటాయించారు. దేశవ్యాప్తంగా నూతన ఐఐటీలకు రూ. 7,182 కోట్లు, ఐఐఎంలకు రూ. 476 కోట్లు, ఎన్‌ఐటీలకు రూ. 3,885 కోట్లు, ఐఐఎస్‌ఈఆర్ సంస్థలకు రూ. 896 కోట్లు, ఐఐఐటీలకు రూ. 226.35 కోట్లు కేటాయించారు. వీటిల్లోనే ఏపీలోని సంస్థలకు కూడా కలిసి ఉన్నాయని బడ్జెట్ అంచనాల్లో ప్రస్తావించారు. ఇక ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ, ఐఐఎస్‌ఈఆర్, ఐఐఐటీ తదితర జాతీయ విద్యా సంస్థలకూ నిర్దిష్ట కేటాయింపులు చేయలేదు. అలాగే, మౌలిక వసతుల ప్రాజెక్టుల గురించి.. పారిశ్రామికాభివృద్ధికి ఇవ్వాల్సిన రాయితీలను ఎక్కడా ప్రస్తావించలేదు. విశాఖలో పెట్రో కెమికల్ కాంప్లెక్స్ నిర్మాణం.. విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు, ఎయిమ్స్‌కు నిర్దిష్ట కేటాయింపుల్లేవు.

మరిన్ని ఏపీ వార్తలు, వివరాల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగలరు.

#### పోలవరం, రాజధానికి కేటాయింపుల్లేవు

పోలవరం జాతీయ ప్రాజెక్టుకు గత ఆర్థిక సంవత్సరం (2018–19), ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019–20) బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేయలేదు. ఈ బడ్జెట్‌లోనూ మొండిచెయ్యే చూపింది. అలాగే..

- రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.1,500 కోట్లు ఇవ్వగా ఇంకా రూ.వెయ్యి కోట్లు ఇస్తామని కేంద్రం ప్రకటించింది. అయితే, ఆ మొత్తాన్నీ బడ్జెట్‌లో పొందపర్చలేదు.
- రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలోని ఏడు జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ కింద కేంద్రం నిధులు ఇవ్వాల్సి ఉండగా ఆ విషయాన్నీ బడ్జెట్‌లో అస్సలు ప్రస్తావించలేదు.
- దుగ్గరాజపట్నం పోర్టుకు యోగ్యత లేని పక్షంలో ప్రత్యామ్నాయంగా రామాయపట్నం పోర్టు అభివృద్ధి, వైఎస్సార్ కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, విశాఖ–చెన్నై కారిడార్, బెంగళూరు–చెన్నై కారిడార్‌ను కూడా కేంద్రం ఉసూరుమనిపించింది.

#### మౌలిక ప్రాజెక్టులు రాష్ట్రానికి చేరేనా?

దేశవ్యాప్తంగా మౌలిక వసతుల ప్రాజెక్టుల అమలు లక్ష్యంగా రూ.103 లక్షల కోట్ల వ్యయం కాగల ప్రాజెక్టులు ప్రారంభ దశలో ఉన్నాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బడ్జెట్‌లో ప్రకటించారు. వీటిలో రాష్ట్రాల వారీగా నిర్దిష్ట వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. అలాగే, తాజా బడ్జెట్‌లో రూ.1.72 లక్షల కోట్ల మేర రవాణా మౌలిక వసతుల స్థాపనకు వెచ్చిస్తామని ఆమె తెలిపారు. వీటిలో కూడా రాష్ట్రానికి ఏ మేరకు ప్రాజెక్టులు రానున్నాయో అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు.. దేశవ్యాప్తంగా 200 లక్షల టన్నుల మత్స్య సంపద ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర ఆర్థికమంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. సుదీర్ఘ కోస్తా తీరం ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఇది మేలు చేసే అవకాశం ఉంది. ఇలా మొత్తం మీద ఏ విధంగా చూసినా రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో తీరని అన్యాయం జరిగిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.



ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ, వార్డు వలంటీరే స్వయంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను డబ్బులు ఇచ్చే సరికొత్త పాలనకు రాష్ట్ర ప్రభుత్వం నాంది పలికింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన 'గడప వద్దకే పెన్షన్'కార్యక్రమం 13 జిల్లాల్లో శనివారం ఉదయం ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగాఒక్క పూటలో 42,81291 మంది లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పింఛన్లను వలంటీర్లు అందజేశారు.
-సాక్షి, అమరావతి

కృష్ణా జిల్లా మచిలీపట్నంలో లబ్ధిదారులకు గ్రామ వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## రాష్ట్రానికి నిరాశ మిగిల్చింది

- ప్రత్యేక హోదాపై కేంద్రం నుంచి హామీ రాలేదు
- 2020–కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన తీవ్ర అసంతృప్తి



**సాక్షి, హైదరాబాద్ :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2020–బడ్జెట్ రాష్ట్రానికి తీవ్ర నిరాశ కలిగించిందని, అన్యాయం జరిగిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశ పెట్టాక ఆయన శనివారం హైదరాబాద్‌లోని లేక్‌వ్యూ అతిథి గృహంలో మీడియాతో మాట్లా డారు. ప్రత్యేక హోదాపై కేంద్రం నుంచి ఎలాంటి హామీ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన చెల్లింపుల్లోనూ జాప్యం జరుగుతోందన్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

**స్థూల ఉత్పత్తి 10%అంటే ప్రశ్నార్థకం**

రాబడి అంతా స్థూల ఉత్పత్తిపైనే ఆధారపడి ఉంటుంది.. స్థూల ఉత్పత్తి 10 % అంటున్నారంటే అది ప్రశ్నార్థకంగా ఉందని తప్పుబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.2 లక్షల కోట్ల ఆదాయం వస్తుందనడం అనుమానాస్పదమేనన్నారు. జీఎస్టీ చట్టం ప్రకారం రాష్ట్రాలకు కేంద్రం వాటా ఇవ్వాల్సిందేనని, ఏడెనిమిది రాష్ట్రాలకు తప్పితే మిగిలిన రాష్ట్రాలన్నింటికీ రీయింబర్స్ చేయాలన్నారు. 2018–19లో రాష్ట్రానికి ఇవ్వాల్సిన పన్నుల వాటాను రూ.2,500 కోట్లకు తగ్గించారని, ఇది రాష్ట్రానికి పెద్ద దెబ్బని బుగ్గని ఆందోళన వ్యక్తం చేశారు.

**డబ్బు ఆదా చేస్తే యనమలకు బాధ ఎందుకు?**

కేంద్ర బడ్జెట్‌పై యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ తమది అవినీతి, అసమర్థ పాలన అంటున్నారని, 7 నెలల్లోనే తమది అసమర్థ పాలనా? అని బుగ్గన ప్రశ్నించారు. ఐదేళ్లలో టీడీపీ చేసిన అవినీతిపై విచారణ జరిపిస్తున్నట్టు చెప్పారు. టీడీపీ ప్రభుత్వ అవినీతిపై రివర్స్ టెండరింగ్ చేసి రూ.1,900 కోట్లు మిగల్చడం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన తప్పా? అంటూ నిలదీశారు. చంద్రబాబు ప్రభుత్వ నిర్వాకం వల్లే వినియోగదారులపై విద్యుత్ బిల్లుల భారం పడిందని.. ఆయన చేసిన పనికి ఇప్పుడు సింగపూర్‌లో అల్లకల్లోలం జరుగుతోందని, అక్కడ ఓ ఆర్థిక మంత్రి పదవి కూడా ఊడబోతోందన్నారు.

## వివక్ష చూపడం తగదు

- ప్రత్యేక హోదా ప్రస్తావన లేకపోవడం బాధాకరం
- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి



**సాక్షి, అమరావతి:** కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఏపీకి మొండిచెయ్యి చూపిందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాధారిత రాష్ట్రంపై వివక్ష చూపడం సరైందికాదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తారని ఎదురు చూశామని అయితే ఆ ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. శనివారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ బడ్జెట్ ప్రసంగం అనంతరం న్యూఢిల్లీలోని పార్లమెంట్ ఆవర ణలో పార్టీ ఎంపీలతో కలిసి మీడియాతో మాట్లాడారు. వెనుకబడిన ఏడు జిల్లాలకు రావాల్సిన రూ.24,350 కోట్ల గురించి ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరమ న్నారు. బడ్జెట్‌లో రూ.15 లక్షల కోట్ల వ్యవసాయ రుణాలను ప్రకటించారని.. ఇందులో వివక్ష లేకుండా ఏపీ వాటా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నాన్ కెమికల్ ఫర్టిలైజర్స్, ఆర్గానిక్ ఫర్టిలైజర్స్‌ను ప్రోత్సహిం చాల న్నారు. జల్ జీవన్ మిషన్‌కు రూ.3.6 లక్షల కోట్లు కేటాయించడం మంచి విషయమన్నారు. పోలవరం చెల్లింపులను త్వరితగతిన విడుదల చేయాలని కోరారు. ఒక్క రైల్వే ప్రాజెక్టు కూడా రాష్ట్రానికి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి జరి గిన అన్యాయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర హక్కులు, వాటాను సాధించుకుంటామని విజయసాయిరెడ్డి వివరించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్షనాయకుడు పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీలు వంగా గీత, తలారి రంగయ్య, బీవీ సత్యవతి, లావు కృష్ణదేవ రాయలు, మార్గాని భరత్, కోట గిరి శ్రీధర్, చింతా అనూరాధ, గొడ్డేటి మాధవి, బెల్లాన చంద్ర శేఖర్, పోచ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## టెన్త్ థర్డ్ లాంగ్వేజ్ ప్రీ ఫైనల్ పరీక్ష వాయిదా

**సాక్షి, హైదరాబాద్:** పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షల్లో భాగంగా నిర్వహిస్తున్న థర్డ్ లాంగ్వేజ్ పేపర్–1,పేపర్–2 పరీక్షల తేదీల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నెల 11 నుంచి 25 తేదీల మధ్య ఈ పరీక్షలను నిర్వహించనున్నట్లు గతంలోనే ప్రకటించారు. సహకార సంఘాల ఎన్నికల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఫిబ్రవరి 14న జరపాల్సిన థర్డ్‌పేపర్–1ను 26 తేదీకి, ఫిబ్రవరి 15న నిర్వహించాల్సిన థర్డ్‌పేపర్–2ను 27కు వాయిదా వేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్, ముఖ్య కార్యదర్శి కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ తెలిపారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలో సిద్దిపేట టీచర్ ఫస్టు

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శనలో సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని చిన్నకిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి రూపొందించిన టీచర్ ఎగ్జిబిట్ మొదటి బహుమతికి ఎంపికైంది. చెన్నైలోని సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జరిగిన దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శనలో భాస్కర్‌రెడ్డి అభ్యసనం ఆనందంగా జరగడానికి తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ప్రదర్శించారు.

## పింఛన్ల పంపిణీలో అక్రమాలు

### చనిపోయిన వారి పేరిట పింఛన్లు డ్రా చేసుకున్న పంచాయతీ కార్యదర్శులు

**సాక్షి, హైదరాబాద్:** ఆసరా పింఛన్ల పంపిణీలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయి. చనిపోయిన వారి పేరుతో కూడా పంచాయతీ కార్యదర్శులు పింఛన్లు తీసేసుకుని ఆపై సెర్ప్ చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిపోయారు. ఆసరా పింఛన్ల పంపిణీ పరిశీలన కోసం గతేడాది డిసెం బర్ 21 నుంచి 30 వరకు నిర్వహించిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 91,442 మందికి సంబంధించిన పింఛన్ల పంపిణీని పరిశీలించారు. అందులో 1,792 మంది చనిపోయినట్టు నిర్ధారించారు. చనిపోయిన తర్వాత కూడా పింఛన్లు తీసుకున్నవారు రాష్ట్రవ్యాప్తంగా 522 మంది ఉన్నారని, వారి పేరుతో మొత్తం రూ.94.96 లక్షలు పంచాయతీ కార్యదర్శులు విత్ డ్రా చేసినట్లు గుర్తించారు. దీంతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో పౌసోమీ బసు రంగంలోకి దిగారు. ఈ ఘటనపై విచారణ జరిపిం చి సదరు మొత్తాన్ని డ్రా చేసిన పంచాయతీ కార్యదర్శుల నుంచి రికవరీ చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్లకు లేఖ రాశారు.

రాష్ట్రీయం

## రేపటి నుంచి ఇక్కడే

# కరోనా పరీక్షలు

### అనుమానాల నివృత్తికి కాల్ సెంటర్ ఏర్పాటు: మంత్రి ఈటల



**సాక్షి, హైదరాబాద్/తాండూరు:** కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలను సోమవారం నుంచి హైదరాబాద్‌లోనే నిర్వహించనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. కరోనా పరీక్షల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం కిట్లు పంపించిందని, ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహించినట్టు పేర్కొన్నారు. వైరస్‌కు సంబంధించిన అనుమానాల నివృత్తి కోసం 24 గంటల కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశామని, ఏవైనా సందేహాలుంటే 040–24651119కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. శనివారం మరో ముగ్గురు కరోనా అనుమానిత లక్షణాలతో ఆస్పత్రిలో చేరారని, దీంతో ఇప్పటివరకు ఆస్పత్రుల్లో చేరిన వారి సంఖ్య 18కు చేరిందని వెల్లడించారు. వీరిలో 11 మందికి కరోనా వైరస్ లేదని పరీక్షల్లో నిర్ధారణ అయిందని, మరో 7 మందికి సంబంధించిన ఫలి తాలు రావాల్సి ఉందన్నారు. వైరస్ వ్యాప్తి చెందకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైరల్ వ్యాధులు సోకినప్పుడు ఉపయోగించే మందును అందుబాటులో ఉంచామన్నారు. కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు కేంద్రం కిట్స్ పంపించిందని, వారి సూచన మేరకు శాంపిల్ టెస్ట్ (ట్రయల్) నిర్వహించామని తెలిపారు. సోమవారం నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. కరోనా వైరస్‌పై ఆందోళన చెందవద్దని ప్రజలకు సూచించారు.

**తాండూరులో కరోనా కలకలం**

తాండూరు వాసికి కరోనా వైరస్ సోకిందన్న వార్త శనివారం కలకలం రేపింది. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన ఓ మహిళ చైనా నుంచి భారత్‌కు తిరిగి వస్తుండగా శంషాబాద్‌లో ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహిస్తే కరోనా వైరస్ లక్షణాలు కనిపించాయని ప్రచారం సాగుతోంది. ఆ మహిళను గాంధీ ఆస్పత్రికి తరలించగా, తనకు ఎలాంటి వైరస్ సోకలేదంటూ ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయిందని పుకారు షికారు చేస్తోంది. ఆస్పత్రి నుంచి వెళ్లిపోయిన ఆ మహిళ ఎవరు? తాండూరులో ఎక్కడ ఉంటారు? అనే విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది. దీనిపై ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోర గా.. తాండూరుకు చెందిన ఓ మహిళ చైనా నుంచి తిరిగి వచ్చిందనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై గాంధీ ఆస్పత్రి నుంచి తమకు ఎలాంటి సమాచారం అందలేదని చెప్పారు.

## వివక్ష చూపలేదు

### రామకృష్ణ ముదిరాజ్ ఆరోపణలపై టీఎస్‌పీఎస్‌సీ స్పష్టీకరణ




**సాక్షి, హైదరాబాద్:** రామకృష్ణ ముదిరాజ్ అనే యువకుడికి దివ్యాంగుల కోటాలో చాలినంత అర్హత లేనందునే టీఆర్టీకి ఎంపిక చేయలేదని టీఎస్‌పీఎస్‌సీ స్పష్టంచేసింది. వికారాబాద్ జిల్లా దోమ మండలం పోతిరెడ్డి పల్లికి చెందిన రామకృష్ణ టీఆర్టీ–2017లో ఉత్తీర్ణత చెందినప్పటికీ ఉద్యోగావకాశం రాలేదంటూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన వార్తలపై స్పందిస్తూ టీఎస్‌పీఎస్‌సీ కార్యదర్శి వాణీప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. టీఎస్‌పీఎస్‌సీపై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు, కమిషన్ కచ్చితంగా నియమ, నిబంధనలకు లోబడి వ్యవహరిస్తుందే తప్ప ఎవరి పట్ల వివక్ష చూపబోదని స్పష్టంచేశారు. సరోజినీ కంటి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డు జారీ చేసిన సర్టిఫికెట్‌లో ఆయనకు వైకల్యం 30 శాతం మాత్రమే ఉన్నట్లు వెల్లడించిందని, కనీసం 40 శాతం ఉండాలన్న ప్రభుత్వ నిబంధన మేరకు ఆయనకు అవకాశం ఇవ్వలేదని తెలిపారు. రాత పరీక్షలో అతడికి 53.209 మార్కులు వచ్చినా కంటిచూపులో 40 శాతం కంటే తక్కువగా వైకల్యం (30 శాతమే ఉందని) ఉందని మెడికల్ బోర్డు ఇచ్చిన నివేదిక మేరకు తిరస్కరించినట్లు వెల్లడించారు. అంతేతప్ప అర్హత ఉన్నా ఉద్యోగావకాశం కల్పించలేదన్న సదరు అభ్యర్థి ఆరోపణలో నిజం లేదన్నారు. ఈ విషయమై సదరు అభ్యర్థి కమిషన్ కార్యాలయాన్ని సంప్రదించినపుడు కూడా అక్కడున్న సిబ్బంది అతనికి అన్ని వాస్తవాలను వివరించారని, తనకు టీఎస్‌పీఎస్‌సీ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లభించలేదని ఆ అభ్యర్థి పేర్కొనడంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టంచేశారు.

## తగ్గుతున్న భూగర్భ జలాలు

**సాక్షి, హైదరాబాద్:** భూగర్భ జల మట్టాల్లో క్రమంగా తగ్గుదల కనిపిస్తోంది. భూగర్భ జల వినియోగం పెరగడంతో నీటి మట్టాలు పడిపోతున్నాయి. గతేడాది డిసెంబర్‌లో రాష్ట్ర సరాసరి భూగర్భ నీటి మట్టం 8.12 మీటర్లు ఉండగా, ఈ ఏడాది జనవరి నాటికి 8.88 మీటర్లకు పడిపోయింది. అంటే 0.76 మీటర్ల మేర ఎక్కువగా మట్టాలు పడిపోయాయి. కామారెడ్డి, కరీంనగ ర్, మహబూబాబాద్, సిరిసిల్ల, వికారాబాద్, వరంగల్ అర్బన్, మెదక్‌లలో 1 మీటర్‌కు పైగా నీటి మట్టాలు పడిపోయినట్లు భూగర్భ జల విభాగం శనివారం ఓ నివేదికలో పేర్కొంది.



## విద్యలో ఎఫ్‌డీఐ అనర్థం:ఎస్‌జేఎం

**న్యూఢిల్లీ:** విద్యారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రోత్సహించడం అనర్థదాయకమని ఆరెస్సెస్ అనుబంధ సంస్థ అయిన స్వదేశీ జాగరణ్ మంచ్(ఎస్‌జేఎం) విమర్శించింది. దీనివల్ల విద్య పాశ్చాత్యీకరణ అయ్యే ప్రమాదముందని హెచ్చరించింది. ఈ ఒక్క విషయం మినహా ప్రతిపాదనలన్నీ బ్రహ్మాండంగా ఉన్నాయని మంచ్ కో కన్వీనర్ అశ్వని మహాజన్ అన్నారు.

SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF A.P.LIMITED
Corporate Office : H.No. 19-13-65/A, Srinivasapuram, Tiruchanoor Road, Tirupati - 517503
NOTIFICATION DATED: 02-02-2020
Applications are Invited from eligible candidates for filling up of the post of DIRECTOR/ Finance on the board of APSPDCL, a Company wholly owned by the Government of Andhra Pradesh.
The details of eligibility criteria, other detailed instructions and prescribed formate may be viewed at APSPDCL website www.apspdcl.in.
Place: Tirupati, Date: 02-02-2020 CHAIRMAN & MANAGING DIRECTOR

తెలంగాణ ప్రభుత్వం
మిషన్ భగీరథ డిపార్ట్‌మెంట్
చీఫ్ ఇంజనీర్ కార్యాలయం, మిషన్ భగీరథ, ఎర్రమంజిల్ కాలనీ, హైదరాబాద్
టెండరు ప్రకటన
టెండరు ప్రకటన నం.02/AEE-I/DEE-II/MB/Tender/Tender Releases/2019-20 తేది: 30.01.2020
పనిపేరు: నాగర్‌కర్నూల్ జిల్లాలో అమ్రాబాద్ (M)లోని దోమలపెంట (GP), శ్రీశైలం ప్రాజెక్ట్ (W) లో ఐసోలేటెడ్ / కవర్ చేయబడని నివాస ప్రాంతాలకు త్రాగునీటి కవరేజ్. అంచనా వ్యయము(రూ.): 685.00 లక్షలు. టెండరు డాక్యుమెంట్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో లభించు తేది: 20/02/2020 నుండి 04/03/2020 మ.3.00 గం. వరకు టెండరు స్వీకరణ తేది: 04.03.2020 మ.3.30 గం. వరకు. టెక్నికల్ బిడ్ తెరుచు తేది: 04.03.2020 సా.4.00 గం. ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది: 10.03.2020, ఉ.11.30 గం. సంప్రదించు నం.7995660208.
సం/- చీఫ్ ఇంజనీర్-VII మిషన్ భగీరథ, మహబూబ్‌నగర్
DIPR Ro.No.14/02-DP/CL/Advt/1/2019-20, Dt: 01.02.2020

తెలంగాణ ప్రభుత్వం
ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయం, మిషన్ భగీరథ డిపార్ట్‌మెంట్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
e-Proc నోటీసు నం. 01/2019-20 తేది : 31-01-2020
పని పేరు : మిషన్ భగీరథ క్రింద ఇంట్రా విలేజ్ నెట్‌వర్క్ కోసం ఫ్లో కంట్రోల్ వాల్వ్స్ తయారీ, సరఫరా, మరియు బట్వాడా. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌లో టెండరు డాక్యుమెంట్లు లభించు తేదీ: 04.02.2020 నుండి 17.02.2020న మ. 3.00 గం.వరకు. టెండర్లు స్వీకరించు తేదీ : 04.02.2020 నుండి 17.02.2020న సా. 5.00 గం.వరకు. టెక్నికల్ బిడ్ తెరుచు తేది : 18.02.2020న మ. 3.00 గం. ఫైనాన్షియల్ బిడ్ తెరుచు తేది : 24.02.2020న ఉ. 11.30 గం. సంబంధిత అధికారి : సూపరింటెండింగ్ ఇంజనీర్, మిషన్ భగీరథ, హైదరాబాద్ (ఉప్పల్).
e-Proc నోటీసు నం. 02/2019-20 తేది : 31-01-2020
పని పేరు : మిషన్ భగీరథ క్రింద ఇంట్రా విలేజ్ నెట్‌వర్క్ కోసం జిఐ పైప్స్ మరియు ట్యాప్స్ తయారీ, సరఫరా. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌లో టెండరు డాక్యుమెంట్లు లభించు తేదీ: 04.02.2020 నుండి 17.02.2020న మ. 3.00 గం.వరకు. టెండర్లు స్వీకరించు తేదీ : 04.02.2020 నుండి 17.02.2020న సా. 5.00 గం.వరకు. టెక్నికల్ బిడ్ తెరుచు తేది : 18.02.2020న మ. 3.00 గం. ఫైనాన్షియల్ బిడ్ తెరుచు తేది : 24.02.2020న ఉ. 11.30 గం. సంబంధిత అధికారి : సూపరింటెండింగ్ ఇంజనీర్, మిషన్ భగీరథ, హైదరాబాద్ (ఉప్పల్). బిడ్డర్లు తమ అనుభవం మరియు ఇతర వివరాలను జిప్ ఫార్మాట్‌లో దాఖలు చేయాల్సిందిగా కోరబడుచున్నారు. వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in నుండి పొందవచ్చును. టెలిఫోన్ నంబర్ : 040-27203063 మరియు 09100122249 / 9100122028.
సం/- ఇంజనీర్-ఇన్-చీఫ్, మిషన్ భగీరథ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్
DIPR RO.No. 13/02-DP/CL/ADVT/1//2019-20, Dt.01.02.2020

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం :: ఖమ్మం
Roc.No.DB/KMC/63/EOI/2020 తేది: 28.01.2020
ఆసక్తి వ్యక్తీకరణ (E.O.I)
ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో బస్టాండ్ వద్ద BOOT ప్రాతిపదికన (i) బస్ షెల్టర్ల నిర్మాణం (ii) ఎలివేటర్ (లిఫ్ట్)తో పాటు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం అర్హత గల ఏజెన్సీలు/ సంస్థలు/ డీలింగ్ కన్సల్టెన్సీల నుండి కమిషనర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ వారు ఆసక్తి వ్యక్తీకరణ (E.O.I) కోరుచున్నారు. E.O.I డాక్యుమెంట్స్ డౌన్‌లోడింగ్ కోసం ప్రారంభ తేది: 31.01.2020 ఉ.10.30 గం., E.O.I డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 10.02.2020 సా.04.00 గం., సీల్డ్ కవర్‌లో E.O.I దాఖలుకు చివరి తేది మరియు సమయం: 10.02.2020 సా.04.30 గం. వరకు. టెక్నికల్ బిడ్లు మరియు ఫైనాన్షియల్ బిడ్‌లను విడి కవర్లలో సీల్ చేసి 10.02.2020న సా.4.30 గం. వరకు కమిషనర్ చాంబర్ వద్ద గల E.O.I బాక్స్‌లో వేయవలెను మరియు అవి 10.02.2020న సా.05.00 గం.కు తెరువబడును. ఐటంల వివరణ మరియు నిబంధనల కోసం లాగాన్ అవండి http://khammamcorporation.telangana.gov.in.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్
నీటి చార్జీలు మరియు ఆస్తి పన్ను చెల్లించండి మరియు జరిమానాను నివారించండి & డిస్ట్రెట్ వారంటీ
DIPR Ro No.12/02 PP/Advt/1/2019-20, Dt:01-02-2020

సెంట్రల్ రైల్వే
మెటీరియల్స్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ A.T. ప్రకటన నం.:e-05/2020, తేది: 30/01/2020

| వివరణ | పరిమాణం | T.O.D |
|---|---|---|
| గ్రావిటీ కాక్ క్రోమ్ ప్లేటెడ్ | 55990 నం.లు | 10-02-20 |
| బఫర్ హైట్ అడ్జస్ట్‌మెంట్ కొరకు ప్యాకింగ్ | 6307 నం.లు | 10-02-20 |
| మినరల్ ఇన్సులేటింగ్ ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ | 269610 లీటర్లు | 10-02-20 |
| ఉపయోగానికి వైట్ మెటల్ గ్రేడ్-84 | 1309 కి.గ్రా. | 10-02-20 |
| కట్ ఆఫ్ యాంగిల్ కాక్ వెంట్‌తో | 2081 నం.లు | 11-02-20 |
| S.S.వైర్ రోప్ | 1720 నం.లు | 12-02-20 |
| Exxon ఆర్పెన్ RB-320 | 3276 కి.గ్రా | 12-02-20 |
| వాటర్ పంప్ రిపేర్ కిట్ | 134 నం.లు | 13-02-20 |
| 3-ఫేజ్ మీనియేచర్ సర్క్యూట్ బ్రేకర్ | 101 సెట్ | 13-02-20 |
| ఫైబర్ ఆప్టిక్ కేబుల్ సెట్ | 100 సెట్ | 13-02-20 |
| డోర్ లాక్స్ కంప్రైజింగ్ సెట్ | 129 సెట్ | 13-02-20 |
| యాక్టివ్ స్పీడ్ సెన్సర్ | 600 నం.లు | 13-02-20 |
| Co-Co బోగీ ఫ్రేమ్ | 14 నం.లు | 13-02-20 |
| పుల్లీ మెషీన్డ్ షాఫ్ట్ | 72 నం.లు | 13-02-20 |
| పాలిమైడ్ గ్లాస్ మౌల్డింగ్ వెడ్జస్ | 54121 నం.లు | 13-02-20 |
| స్పైరల్ ట్యూబ్ | 546 మీటర్లు | 13-02-20 |
| LED బేస్డ్ ఫ్లాషర్ టెయిల్ ల్యాంప్ | 878 నం.లు | 13-02-20 |
| రోలర్ బేరింగ్ కోసం గేర్ కేస్ | 285 నం.లు | 14-02-20 |
| మూవింగ్ కాయిల్ మీటర్స్ సెట్ | 105 సెట్స్ | 14-02-20 |

బయానా, పరిమాణం, పరిమితులు మరియు టెండర్ నిబంధనలు కలిగి ఉన్న సవివరమైన ప్రకటనకు సంబంధించి దర్శించండి వెబ్‌సైట్ www.ireps.gov.in
ఏదేని రైల్-సంబంధిత ఎంక్వైరీ కోసం 139కు డయల్ చేయండి | ఆల్ ఇండియా సెక్యూరిటీ హెల్ప్‌లైన్ 182

# క్రియాశీలకమైన బడ్జెట్

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ
- ఉద్యోగ కల్పనలో కీలకమైన రంగాలకు ప్రాధాన్యం
- రైతు ఆదాయం రెట్టింపు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ
- ఈ బడ్జెట్‌లో పెట్టుబడులు పెరుగుతాయని ప్రధాని ఆశాభావం



**న్యూఢిల్లీ:** కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ దార్శనికమైన, క్రియాశీలకమైన, అద్భుతమైన బడ్జెట్ అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. 'ఉద్యోగ కల్పనలో వ్యవసాయం, నిర్మాణరంగం, జౌళి, సాంకేతికత రంగాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నాలుగు రంగాలకు ఈ బడ్జెట్‌లో సముచిత స్థానం ఇచ్చాం'అని పేర్కొన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు 16 అంశాల కార్యాచరణ తీసుకొచ్చామని, దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగావకాశాలు పెరుగుతాయని వివరించారు. పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశ పెట్టిన అనంతరం మోదీ మీడియాతో మాట్లాడారు. 'వ్యవసాయ రంగంలో సంప్రదాయ పద్ధతులకు సాంకేతికత జోడించడం ద్వారా ఉద్యాన, మత్స్య, పశుపోషణ రంగాల విలువ పెరుగుతుంది. దీంతో పాటు ఉద్యోగిత కూడా పెరుగుతుంది'అని మోదీ వెల్లడించారు. సాంకేతికత రంగంలో ఉద్యోగ కల్పన కోసం తాము ఈ బడ్జెట్‌లో అనేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. వీటితో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ శక్తిమంతంగా తయారవుతుందనే నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని ఆర్థిక సర్వేలో కూడా పేర్కొన్నట్లు గుర్తు చేశారు. డివిడెండ్ పన్ను తొలగించడంతో.. కంపెనీల చేతుల్లో దాదాపు రూ.25 వేల కోట్లు మిగులుతాయని, ఈ మొత్తాన్ని కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నిస్సారమైన బడ్జెట్: రాహుల్



**న్యూఢిల్లీ:** కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ చాలా చప్పగా, నిస్సారంగా ఉందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. అభివృద్ధికి ఊతమిచ్చేలా బడ్జెట్‌లో ఏమీ లేదని పెదవి విరిచారు. దేశంలో ప్రధానమైన నిరుద్యోగ సమస్యను కేంద్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ బడ్జెట్‌ను చూస్తుంటే.. మాటలే తప్ప చేతలు చేతకాని ప్రభుత్వమని స్పష్టమవుతోందని పేర్కొన్నారు. పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. పన్ను శ్లాబుల్లో గారడీ చేశారని, ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించేందుకు అసలైన పరిష్కార మార్గాలు చూపలేదని దుయ్యబట్టారు. ఈ బడ్జెట్‌లో అసలు వాస్తవికతే లేదని, ఉత్తి మాటలే కనిపిస్తున్నాయని విమర్శించారు. 'ఈ బడ్జెట్‌లో యువతకు ఉద్యోగం కల్పించేందుకు ఎలాంటి వాస్తవికత, వ్యూహాత్మకమైన భావన ఏమీ కన్పించట్లేదు'అని పేర్కొన్నారు. 'ఒకే విషయాన్ని తిప్పి తిప్పి చెబుతున్నట్లు.. కొత్త సీసాలో పాత సారాయి పోసినట్లు ఉంది'అని ఆరోపించారు. 'చాలా ఎక్కువ సేపు చదివిన బడ్జెట్ మాత్రమే కాదు.. అత్యంత నిస్తేజమైన బడ్జెట్ ఇది'అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ ఎద్దేవా చేశారు. 'అచ్ఛే దిన్'ను కేంద్రం ఎలా వదిలిపెట్టిందో.. ఇప్పుడు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను కూడా గాలికొదిలేసిందని ట్విట్టర్‌లో దుయ్యబట్టారు. పన్ను చెల్లింపుదారులను ఆరేళ్లుగా పీడించుకుని తిన్న కేంద్ర ప్రభుత్వం.. ఆ ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడిన విషయాన్ని ఇప్పుడు గుర్తించినట్లు అర్థమవుతోందని పేర్కొన్నారు. అసలు బడ్జెట్ మొత్తంలో ఉద్యోగాల గురించి ఎక్కడా ఒక్క పదం కూడా లేకపోవడం గర్హనీయమని కాంగ్రెస్ ప్రధాన అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా మండిపడ్డారు.

# ఈయూకు టాటా..

## యూరోపియన్ యూనియన్‌ను వీడిన బ్రిటన్

- శుక్రవారం రాత్రి నుంచి అమల్లోకి వచ్చిన బ్రెగ్జిట్
- దేశ చరిత్రలో కొత్త శకమన్న ప్రధాని జాన్సన్
- ప్రజలు, మీడియాలో మిశ్రమ స్పందన



సెంట్రల్ లండన్‌లోని పార్లమెంటు స్క్వేర్‌లో బ్రెగ్జిట్‌కు మద్దతుగా జెండాలను ఊపుతూ సంతోషం వ్యక్తం చేస్తున్న పౌరులు

**లండన్:** యూరోపియన్ యూనియన్ (ఈయూ)తో బ్రిటన్ తన 47 ఏళ్ల అనుబంధాన్ని తెంచుకుంది. ఈ చారిత్రక సందర్భం బ్రెగ్జిట్‌ను పురస్కరించుకుని బ్రిటన్ వాసులు సంబరాలు చేసుకుంటున్నారు. స్థానిక కాలమానం ప్రకారం బ్రెగ్జిట్ శుక్రవారం అర్ధరాత్రి 11 గంటల నుంచి అమల్లోకి వచ్చింది. బ్రెగ్జిట్ మరో కొత్త శకానికి నాంది అని ఈ సందర్భంగా ప్రధాని బోరిస్ జాన్సన్ ప్రకటించారు. ఆయన ప్రత్యేకంగా విడుదల చేసిన వీడియోలో.. 'చీకట్లు తొలగిపోతున్న వేళ ఘనమైన మన జాతి కొత్త పాత్ర ఆవిష్కృతం కానుంది. ప్రతి ప్రాంత వాసుల కలలు సాకారం కానున్నాయి. బ్రెగ్జిట్ కేవలం న్యాయపరమైన చర్య కాదు. జాతి పరివర్తన, పునరుత్తేజం పొందే క్షణం'అని పేర్కొన్నారు. 'ఈయూ నుంచి విడిపోవడంతో మన విధానాలను స్వేచ్ఛగా అమలు చేసే అవకాశం వచ్చింది. భారత్ సహా 13 దేశాలతో వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకుంటాం'అనిఅన్నారు. దేశ చరిత్రలో ఇది గొప్ప ఘటన అని బ్రెగ్జిట్ అనుకూల నేత నిగెల్ ఫరాజ్ వ్యాఖ్యానించారు.

### సంబరాలు.. నిరసనలు

ఈ ప్రత్యేక సందర్భంలో లండన్‌లోని పార్లమెంట్ స్క్వేర్‌తోపాటు డౌనింగ్ స్ట్రీట్ వద్ద బ్రెగ్జిట్ కౌంట్‌డౌన్ తెలుపుతూ భారీ డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేశారు.



బ్రస్సెల్స్‌లోని ఈయూ ప్రధాన కార్యాలయం వద్ద బ్రిటన్ జెండాను తీసేస్తున్న అధికారులు

దేశవ్యాప్తంగా పబ్బులు, క్లబ్బుల్లో ప్రజలు బ్రెగ్జిట్ విందులు చేసుకున్నారు. ఈ సందర్భంగా బ్రిటన్ 'అన్ని దేశాలకు శాంతి, శ్రేయస్సు, స్నేహం'నినాదంతో కూడిన 50 పెన్స్(అరపౌండ్) నాణేన్ని విడుదల చేసింది. యూరోపియన్ యూనియన్‌కు చెందిన అన్ని సంస్థలపైనా బ్రిటన్ యూనియన్ జాక్ జెండాను తొలగించారు. కాగా, ఈయూలోనే కొనసాగాలంటూ కొన్ని చోట్ల బ్రెగ్జిట్ వ్యతిరేక ర్యాలీలు కూడా జరిగాయి. బ్రిటన్‌తోపాటు తమను కూడా ఈయూ నుంచి వేరు చేయడాన్ని నిరసిస్తూ స్కాట్లాండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో కొవ్వొత్తులతో ర్యాలీలు చేపట్టారు. మరోసారి బ్రెగ్జిట్‌పై రెఫరెండం పెట్టాలని డిమాండ్ చేశారు. కాగా, బ్రెగ్జిట్‌తో బ్రిటన్, ఈయూ మధ్య ఒక్కసారిగా ఎలాంటి మార్పులు రావు. ఒప్పందం ప్రకారం.. శనివారం నుంచి ఈ ఏడాది డిసెంబర్ కల్లా పూర్తి స్థాయిలో బ్రెగ్జిట్ అమలుకానుంది.


### మిశ్రమ స్పందన

బ్రెగ్జిట్‌పై బ్రిటన్ పత్రికల్లో మిశ్రమ స్పందన కనిపించింది. డైలీ ఎక్స్‌ప్రెస్, ది సన్ వంటి పత్రికలు బ్రిటన్ శక్తివంతమవుతుందని వ్యాఖ్యానించగా, ముందున్నది గతులకు బాట అంటూ స్టాండర్డ్ పత్రిక, ది గార్డియన్ ఆందోళన వ్యక్తం చేశాయి. ఈయూను వీడిన బ్రిటన్ అంటూ బీబీసీ ప్రసారం చేసిన కథనంపై ప్రశంసలతోపాటు విమర్శలు కూడా వచ్చాయి. కాగా, బ్రెగ్జిట్ అమల్లోకి వచ్చే సమయంలోనే.. శుక్రవారం అర్ధరాత్రి ఫ్రాన్సులోని కలైస్ పోర్టు నుంచి బ్రిటన్‌లోని డోవర్‌కు బయలుదేరిన ఓడలో మాత్రం ఎలాంటి సందడి కనిపించలేదు. ఆ ఓడ బయలుదేరిన సమయానికి ఈయూలో 28 సభ్యదేశాలుండగా బ్రిటన్‌లోకి అడుగిడే సమయానికి ఈయూ 27 దేశాల సమాఖ్యగా మారనుంది. కాగా, కోట్ డెస్ డ్యూన్స్ అనే ఆ ఓడలో ప్రయాణికుల్లో చాలామంది అప్పటికే నిద్రలోకి జారుకున్నారు. ఆడ్రే సెంటినెల్లా అనే మహిళ మాత్రం..'ఇది విచారకరమైన రోజు. ఈ రోజుతో ఒక శకం ముగియనుంది. ఏం జరుగుతుందో తెలియని భవిష్యత్తులోకి వెళ్తున్నాం. ఎన్ని లోటుపాట్లున్నా ఈయూతోనే బ్రిటన్ ముందుకు సాగితే బాగుండేది'అని పేర్కొన్నారు. ఈమె స్విట్జర్లాండ్‌లో ఉద్యోగబాధ్యతలు నిర్వహిస్తూ బ్రిటన్‌లో నివాసం ఉంటున్నారు. రేపటి నుంచి ఫెర్రీ క్యాంటిన్‌లో బ్రిటిష్ ఫిష్, చిప్స్ తినే వారు కనిపించరని ఓడ కెప్టెన్ ఆంటోయిన్ పకెట్ అన్నారు. బ్రెగ్జిట్ కారణంగా బ్రిటన్‌కు, ఈయూకు నిత్యం రాకపోకలు సాగించడం పెద్ద తలనొప్పిగా మారబోతోందని మరో ప్రయాణికుడు అలెస్సో బార్టన్ అన్నారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా 27 దేశాల్లో తిరగగలిగే అవకాశాన్ని చాలా మంది కోల్పోనుండటం విచారకరమని ఆయన వ్యాఖ్యానించారు. సరిహద్దులు చెరిగిపోవాల్సిన సమయంలో పెరుగుతున్నాయని పేర్కొన్నారు. బ్రెగ్జిట్ పరిణామం భవిష్యత్తుకు మంచిది కాదని జర్మనీకి చెందిన మొహమ్మద్ మజోకా తెలిపారు.

భారత ప్రభుత్వం
సమాచార మంత్రిత్వ శాఖ
పోస్టల్ విభాగం
పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ బ్యాంక్ కోసం ముఖ్యమైన నోటీసు
ఖాతాదారులు
భారత ప్రభుత్వం యొక్క ఆదేశానుసారం ప్రతి పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ బ్యాంకు ఖాతాలో కనీస బ్యాలెన్స్ రూ.500 /- లతో నిర్వహించాలి. ఈ కనీస బ్యాలెన్స్‌ను నిర్వహించడంలో విఫలమైతే వార్షిక రుసుము రూ. 100 / - చెల్లించవలెను మరియు అటువంటి రుసుమును తీసివేసిన తరువాత బ్యాలెన్స్ నిల్ అయినచో ఖాతా స్వయంచాలకంగా మూసివేయబడుతుంది. అందువలన పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ బ్యాంకు ఖాతాదారులకు మనవి చేయునది ఏమనగా రూ.500 లోపు బ్యాలెన్స్ ఉన్న ఖాతాల డిపాజిటర్లు, కనీస బ్యాలెన్స్ ను రూ.500/- లకు పెంచవలెనని మనవి.
గమనిక: తేదీ: 11.12.2020 నాటికి 500 / - లేదా అంతకంటే ఎక్కువ మీ పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ బ్యాంకు ఖాతాలో ఉంచవలెను. మరిన్ని వివరాల కోసం మీ దగ్గరలోని తపాలా కార్యాలయాన్ని సంప్రదించండి.
Sd/-
చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్,
తెలంగాణ సర్కిల్, హైదరాబాద్- 500 001.

## ఉరి వాయిదాపై హైకోర్టుకు కేంద్రం

- నేడు విచారణ
- వినయ్ క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించిన రాష్ట్రపతి



**న్యూఢిల్లీ:** 'నిర్భయ'దోషుల ఉరి అమలును నిరవధిక వాయిదా వేస్తూ ఢిల్లీలోని ట్రయల్ కోర్టు చెప్పిన తీర్పును కేంద్రం ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. అత్యవసరంగా విచారించాలంటూ శనివారం పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేశ్ కైత్ ఈ పిటిషన్‌ను ఆదివారం విచారిస్తామని చెప్పారు. దీనికి సంబంధించి నలుగురు దోషులకు, జైళ్ల శాఖ డీజీ, తీహార్‌జైలు అధికారులకు కూడా నోటీసులు పంపించారు. ఉరిని వాయిదా వేస్తున్నట్లు ట్రయల్‌కోర్టు శుక్రవారం తీర్పునివ్వగా, శనివారమే కేంద్ర హోంమంత్రిత్వ శాఖ హైకోర్టును చేరింది. ట్రయల్ కోర్టు తమ పరిధిని మించి తీర్పునిచ్చిందని పిటిషన్‌లో పేర్కొంది. కేంద్రం తరఫునవాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా దోషులకు ఉన్న అన్ని చట్టపరమైన అవకాశాలు ఉపయోగించుకొనేందుకు తగిన సమయం ఇచ్చామని, అయితే వారు ఉద్దేశపూర్వకంగానే విచారణ ఆలస్యమయ్యేలా పిటిషన్లు దాఖలు చేస్తున్నారని తెలిపారు. ఇది న్యాయ వ్యవస్థను అవమానపర్చడమేనని పేర్కొన్నారు. దోషులకు ఉరి వాయిదా పడడంపై నిర్భయ తల్లి ఆశా దేవి స్పందిస్తూ.. దోషులకు మరణశిక్ష పడేవరకూ తన పోరాటం ఆగదని చెప్పారు.

### తిరస్కరించిన రాష్ట్రపతి

'నిర్భయ'కేసులో దోషి వినయ్‌కుమార్ శర్మ పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి కోవింద్ తిరస్కరించారు. ఇప్పటికే వినయ్ కుమార్ శర్మ, అక్షయ్‌ల క్యూరేటివ్ పిటిషన్లను సుప్రీకోర్టు కొట్టేసింది.

## షహీన్‌బాగ్‌లో కాల్పులు



నిందితుడు కపిల్

**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని షహీన్ బాగ్‌లో ఓ యువకుడు శనివారం గాల్లోకి కాల్పులు జరుపుతూ హల్ చల్ చేశాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల రోజులుగా పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ)లకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్న షహీన్‌బాగ్‌లో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన వ్యక్తి కపిల్ గుజ్జర్ గాల్లోకి రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. సాయంత్రం 5 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. నిరసనలు తెలుపుతున్న వేదికకు కేవలం 250 మీటర్ల దూరంలోనే ఈ కాల్పులు జరిగాయని వారు తెలిపారు. అనంతరం పోలీసులు కపిల్ గుజ్జర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిరసనకారులకు వ్యతిరేకంగా అతడు నినాదాలు చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## ఆ దేశాలపై అమెరికా ఆంక్షలు

**ఉత్తర్వులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం**

**వాషింగ్టన్:** గతంలో చెప్పినట్టుగానే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భద్రతా నిబంధనలను పాటించడంలో విఫలమైన దేశాల పౌరుల వీసా అనుమతులపై ఆంక్షలు విధించే పత్రంపై సంతకం చేశారు. ఇవి అమెరికా భద్రతకు ప్రమాదకరంగా మారాయని ఆయన వైట్ హౌస్ వెల్లడించింది. ఇరాన్, లిబియా, ఉత్తర కొరియా, సిరియా, వెనెజులా, యెమన్, సోమాలియా పౌరుల అమెరికా ప్రవేశంపై నిషేధాజ్ఞలు కొనసాగిస్తూ ప్రకటన విడుదల చేసింది. మయన్మార్, ఎరిట్రియా, కిర్గిజిస్తాన్, నైజీరియా వలసదారులకు వీసాల అనుమతిపై నిషేధం విధించింది. సూడాన్, టాంజానియా దేశాలు వీసా లాటరీలో పాల్గొనే అవకాశాన్ని రద్దు చేస్తూ వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ స్టెఫానియా గ్రెషమ్ ప్రకటన విడుదల చేశారు. అయితే ఈ ఆంక్షలేవీ పర్యాటకులకు, వ్యాపారస్తులకు, వలసేతర ప్రయాణికులకు వర్తించవనిన్నారు. అంతర్జాతీయ భద్రతా నిబంధనలను పాటించకుంటే ఎలా ఉంటుందో ఆయా దేశాలకు అర్థమయ్యేందుకే ఈ నిషేధమని యాక్టింగ్ సెక్రటరీ చాడ్ ఎఫ్ వోల్ఫ్ వెల్లడించారు. 'దేశ భద్రత, ప్రజల రక్షణే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రథమ బాధ్యత అనీ, ఈ ఆంక్షలు ఆ లక్ష్యాన్ని చేరుకుంటాయని' వోల్ఫ్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం
ఉద్యోగ ప్రకటన
ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో నేరుగా నియామకం ద్వారా ఆఫీస్ సబ్ ఆర్డినేట్స్ మరియు డ్రైవర్ల 111 ఉద్యోగాలకు నియామకం కోసం దరఖాస్తులు కోరబడుచున్నవి.
నిర్ణీత నమూనాలోని దరఖాస్తులు పోస్టు ద్వారా దాఖలు కోసం ఆఖరి తేది: 20.02.2020న సా.5.00 గం.వరకు.
సవివరమైన ప్రకటన మరియు దరఖాస్తు నమూనా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్ hc.ap.nic.in లో ఉంచబడినది.
హెల్ప్‌లైన్ 0863-2372724 (అన్ని పనిరోజులలో ఉ.10.00 గం. నుండి సా.5.00 గం. మధ్య)
ప్రదేశం: అమరావతి
తేది: 30.01.2020 సం/- రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్)
DIPR Ro No.1773/CL/Advt/1/1/2019-20, Dt:31-01-2020

కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్
(ఆర్కిటెక్ట్స్ చట్టం, 1972 క్రింద భారత ప్రభుత్వ చట్టబద్ధమైన అథారిటీ)
ఇండియా హ్యాబిటేట్ సెంటర్, కోర్ 6A, 1వ అంతస్తు,
లోధి రోడ్, న్యూ ఢిల్లీ - 110003
పరీక్ష ప్రకటన: NATA-2020
గమనిక: విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆర్కిటెక్చరల్ సంస్థలు మరియు సంబంధితులందరికీ
నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (NATA) 2020
కౌన్సిల్‌చే ఆమోదించబడిన వివిధ ఆర్కిటెక్చరల్ సంస్థలలో 2020-21 అకడమిక్ సెషన్ కోసం 5 సంవత్సరాల B.Arch డిగ్రీ కోర్సులోని 1వ సంవత్సరంలోనికి ప్రవేశానికి భారతదేశ వ్యాప్తంగా ఉన్న వివిధ డిజిగ్నేటెడ్ సెంటర్ల వద్ద సంవత్సరానికి రెండుసార్లు అంటే 19 ఏప్రిల్, 2020న మొదటి పరీక్ష మరియు 31 మే, 2020న రెండవ పరీక్ష కౌన్సిల్‌చే నిర్వహించబడుతుంది. అభ్యర్థులు సంస్థల అప్రూవల్ స్టేటస్ కోసం కౌన్సిల్ వెబ్‌సైట్ www.coa.gov.in రిఫర్ చేయవలసిందిగా సూచించబడుతున్నారు.

| పరీక్ష కోసం రిజిస్ట్రేషన్ | ప్రారంభ తేది | ముగింపు తేది |
|---|---|---|
| మొదటి పరీక్ష | 01.02.2020 | 16.03.2020 |
| రెండవ పరీక్ష | 01.02.2020 | 04.05.2020 |

వివరమైన బ్రోచర్, సంబంధిత సమాచారం 01.02.2020 నుండి వెబ్‌సైట్ www.nata.in లో లభించును.
న్యూ ఢిల్లీ
తేది: 31.01.2020 రిజిస్ట్రార్

# వుహాన్ నుంచి భారత్‌కు..

- ప్రత్యేక విమానంలో ఢిల్లీ చేరిన 324 మంది
- వారందరికీ ప్రత్యేక పరీక్షలు
- మరికొందరి కోసం వుహాన్‌కు మరో విమానం
- 259 మంది మృతి చెందినట్లు ప్రకటించిన చైనా



వుహాన్ నుంచి ఢిల్లీ వచ్చిన వారిని ఎయిర్‌పోర్టులోనే పరిశీలిస్తున్న వైద్యులు

**బీజింగ్/న్యూఢిల్లీ:** ప్రాణాంతక కరోనా వైరస్ విజృంభిస్తుండటంతో చైనాలోని వుహాన్‌లో ఉన్న 324 మంది భారతీయులను ఎయిరిండియా విమానంలో ప్రభుత్వం స్వదేశానికి తీసుకువచ్చింది. వీరిలో 211 మంది విద్యార్థులు సహా మొత్తం 324 మంది ఉన్నారు. ఆరుగురు విద్యార్థులు తీవ్ర జ్వరంతో బాధపడుతుండటంతో వారిని విమానంలో ఎక్కేందుకు చైనా అధికారులు అనుమతి నిరాకరించారు. ఢిల్లీ చేరుకున్న వారికి ముందుగా ఎయిర్‌పోర్టులోనే స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. వీరిలో 104 మందిని ఐటీబీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 600 పడకల ఆస్పత్రికి రెండో స్క్రీనింగ్ కోసం తరలించారు. ఇలాంటిదే మరో ఆస్పత్రిని మనేసర్‌లో సైన్యం ఆధ్వర్యంలో ఏర్పాటయిందని అధికారులు చెప్పారు.

### వుహాన్‌కు మరో విమానం

ఢిల్లీ నుంచి శనివారం మధ్యాహ్నం మరో విమానం సిబ్బంది, వైద్య నిపుణులతో పాటు వుహాన్‌కు బయలుదేరింది. వుహాన్ నుంచి వచ్చిన మొదటి విమానంలో ఉన్న వైద్య బృందాన్నే కెప్టెన్ అమితాబ్ సింగ్ నేతృత్వంలో రెండో విమానంలో పంపించినట్లు ఎయిరిండియా ఎండీ అశ్వినీ లోహానీ తెలిపారు. ఈ విమానంలోని సిబ్బంది ప్రయాణికులతో మాట్లాడటం, వారికి ఆహారం అందించడం వంటి సేవలు కూడా చేయలేదని ఆయన తెలిపారు. అందరికీ మాస్కులు అందించి, పూర్తి జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

### పెరుగుతున్న మృతులు


ప్రాణాంతక కరోనా వైరస్‌తో మృతుల సంఖ్య ఒకవైపు పెరుగుతుండగా అదే స్థాయిలో బాధితుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇప్పటి వరకు 259 మంది ఈ వైరస్‌తో మృతి చెందినట్లు ప్రకటించిన చైనా, మరో 12వేల మందికి వ్యాధి సోకినట్లు తెలిపింది. దాదాపు 1,795 మంది రోగుల పరిస్థితి విషమంగా ఉందని, మరో 17,988 మందికి వైరస్ సోకినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చైనా నేషనల్ హెల్త్ కమిషన్ శనివారం పేర్కొంది. వుహాన్ నగరంలోని 75వేల మందికి పైగా కరోనా బారిన పడి ఉంటారని హాంకాంగ్ నిపుణులు అంచనా వేశారని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ తెలిపింది. ఇప్పటివరకు భారత్ సహా అమెరికా, రష్యా, బ్రిటన్, స్వీడన్ తదితర 25 దేశాల్లో 124 కేసులు బయటపడ్డాయి.

భారత ప్రభుత్వం
సమాచార మంత్రిత్వ శాఖ
పోస్టల్ విభాగం
ముఖ్యమైన నోటీసు
భారత ప్రభుత్వం యొక్క నియమ నిబంధనల ప్రకారం (సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ ఫండ్ రూల్స్, 2016) అనుసరించి. తపాలా కార్యాలయాలు మరియు బ్యాంకులతో ఉన్న డిపాజిటర్ల యొక్క క్లెయిమ్ చేయని డబ్బు నిర్వహణ కోసం మరియు అటువంటి ఖాతాల వివరాలు క్లెయిమ్ చేయబడనివి (10 సంవత్సరాలకు పైగా పనిచేయనివి మరియు నిష్క్రియాత్మకంగా ఉన్న ఖాతాలు) బహిరంగంగా తెలియజేయబడతాయి. దీని ప్రకారం తపాలా శాఖ విభాగం అటువంటి ఖాతాల వివరాలను తన వెబ్‌సైట్‌లో (www.indiapost.gov.in) ప్రచురించింది. మరిన్ని వివరాల కోసం మీ దగ్గరలోని తపాలా కార్యాలయాన్ని సంప్రదించండి.
Sd/-
చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్,
తెలంగాణ సర్కిల్, హైదరాబాద్- 500 001.



## 2021 మార్చి నాటికి
# 2.62 లక్షల కొత్త ఉద్యోగాలు

వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రభుత్వ రంగంలోని పలు విభాగాల్లో 2.62 లక్షల ఉద్యోగాలు కొత్తగా సృష్టిస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. గతేడాది మార్చి నాటికి ప్రభుత్వ రంగంలో 32,62,908గా ఉన్న ఉద్యోగాల సంఖ్యను 2021 మార్చి 1 నాటికి 35,25,388 పెంచుతామని వెల్లడించారు. విభాగాల వారీగా చూసుకుంటే పోలీసు శాఖలో 79,353 పోస్టులు కొత్తగా రానున్నాయి. రక్షణ విభాగంలో 93,024కు పెంచనున్నారు. సాంస్కృతికంలో 3,886, అంతరిక్ష విభా గంలో 3,903, రెవెన్యూ విభాగంలో 3,243, ఎర్త్ సైన్సెస్‌లో 2,581, విదేశీ వ్యవహారాల శాఖలో 2,167, పర్యావరణ, అటవీ, వాతావరణ శాఖలో 2,136, ఎలక్ట్రానిక్స్, సమాచార శాఖలో 1,347, అటామిక్ ఎనర్జీ విభాగంలో 2,300, అగ్రికల్చర్, సహకార, రైతు సంక్షేమ విభాగంలో 1,766, ఇన్ఫర్మేషన్, బ్రాడ్‌కాస్టింగ్ శాఖలో మరో 1,600 మేర ఉద్యోగాల కల్పన ఉంటుంది.




# అన్నం లేదు.. ఆవకాయే



ఏ బడ్జెట్లో అయినా అందరినీ ఆకర్షించేది ఆదాయపు పన్నే!!. ఎందుకంటే అంతిమంగా తన జేబులో ఎంత మిగులుతుందన్నదే వేతనజీవి వెదుక్కుంటాడు. అలాంటి వేతనజీవికి... పన్ను రేట్లు తగ్గిస్తున్నామంటూ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటన చక్కని విందు భోజనంలా కనిపించింది. ఎంత మమకారమో... అనుకున్నాడు. కానీ... తగ్గింపు రేట్లు కావాలనుకునేవారికి పన్ను మినహాయింపులేవీ ఉండవని ఆమె చెప్పేసరికి.. అన్నం లేకుండా ఆవకాయ వడ్డించినట్లయింది. అమ్మో... కారం!!.

- ఆదాయపు పన్ను రేట్లు తగ్గించిన ఆర్థిక మంత్రి
- నాలుగు శ్లాబుల స్థానంలో కొత్తగా ఏడు శ్లాబులు

పన్ను రేట్లను తగ్గిస్తున్నట్లు ఒక పక్కన ప్రకటిస్తూనే.. మరో పక్క పన్ను మినహాయింపులను భారీగా తొలగించడం ద్వారా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వేతనజీవుల్ని దొంగ దెబ్బ తీశారు. కొన్ని ఆదాయవర్గాలకు సగానికి సగం పన్ను తగ్గినట్లు చూపించినా.. స్టాండర్డ్ డిడక్షన్, ఇంటి అద్దె అలవెన్స్, చాప్టర్ 6 -ఎ కింద లభించే సెక్షన్ 80–సీ వంటి మినహాయింపులు, ఇంటి రుణంపై చెల్లించే వడ్డీ వంటి కీలక మినహాయింపులను తొలగించారు. శనివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్థికమంత్రి ఆదాయ పన్ను శ్లాబుల్లో భారీ మార్పులను ప్రతిపాదించారు. రూ.15 లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి పన్ను రేట్లు తగ్గిస్తూ ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబుల స్థానంలో ఏడు శ్లాబుల విధానాన్ని ప్రవేశపెట్టారు. కొత్తగా ప్రవేశపెట్టిన విధానంలో రూ.2.5 లక్షల ఆదాయం వరకు ఎటువంటి పన్ను ఉండదని, రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్నవారికి గతంలో మాదిరే 5 శాతం పన్ను ఉన్నా దానిపై పూర్తిస్థాయి పన్ను రిబేటు లభిస్తుందని సీతారామన్ తెలిపారు. ఈ కొత్త విధానంలో రిటర్నులు దాఖలు చేసే వారికి... పాత విధానం ప్రకారం వివిధ సెక్షన్ల కింద లభించే మినహాయింపు ప్రయోజనాలు ఉండవని ఆర్థికమంత్రి స్పష్టంచేశారు. అయితే కొత్త విధానానికి మారాలా? లేక పాత విధానంలోనే కొనసాగాలా? అన్నది పన్ను చెల్లింపుదారుల ఇష్టమంటూ... నిర్ణయం తీసుకునే అవకాశాన్ని కూడా వారికే వదిలిపెట్టారు.

ఆదాయపు పన్ను చట్టాన్ని సరళతరం చేసే విధానంలో భాగంగా ప్రస్తుతం ఉన్న సుమారు 100 మినహాయింపుల్లో 70 తొలగించినట్లు మంత్రి ప్రకటించారు. పన్ను రేట్లు తగ్గింపు వల్ల ప్రభుత్వం రూ.40,000 కోట్ల ఆదాయాన్ని నష్టపోతున్నట్లు తెలియజేశారు. ''పన్ను మినహాయంపులు వేటినీ లెక్కించకపోతే రూ.15 లక్షల ఆదాయం ఉన్నవారికి కొత్త పన్ను విధానంలో రూ.78,000 ప్రయోజనం లభిస్తోంది. పాత విధానంలో వారు రూ.2.73 లక్షల పన్ను కట్టాల్సి వస్తే కొత్త విధానంలో రూ.1.95 లక్షలు కడితే సరిపోతుంది''అని నిర్మల చెప్పారు. కానీ వాస్తవంగా పాత విధానంలో మినహాయింపులను పరిగణనలోకి తీసుకుంటే కొత్త విధానంలో అధిక పన్ను చెల్లించాల్సి వస్తుందని ట్యాక్సేషన్ నిపుణులు స్పష్టం చేస్తుండటం గమనార్హం.

### వయసు 60-80 ఏళ్ల మధ్య ఉంటే..

| ఆదాయ పరిమితి | పాత రేట్లు | కొత్త రేట్లు |
|---|---|---|
| 0– 3 లక్షలు | లేదు | లేదు |
| 3– 5 లక్షలు | 5% | 5% |
| 5– 7.5 లక్షలు | 20% | 10% |
| 7.5– 10 లక్షలు | 20% | 15% |
| 10– 12.5 లక్షలు | 30% | 20% |
| 12.5– 15 లక్షలు | 30% | 25% |
| 15 లక్షలు దాటితే | 30% | 30% |

### వయస్సు 80 ఏళ్లు దాటితే..

| ఆదాయ పరిమితి | పాత రేట్లు | కొత్త రేట్లు |
|---|---|---|
| 5 లక్షలు | లేదు | లేదు |
| 5– 7.5 లక్షలు | 20% | 10% |
| 7.5– 10 లక్షలు | 20% | 15% |
| 10– 12.5 లక్షలు | 30% | 20% |
| 12.5– 15 లక్షలు | 30% | 25% |
| 15 లక్షలు దాటితే | 30% | 30% |

(ఈ రెండు విధానాల్లో రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి సెక్షన్ 87ఏ కింద గరిష్ఠంగా రూ.12,500 వరకు పన్ను రిబేటు రూపంలో లభిస్తుంది. అంటే ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.)

### తొలగించిన కొన్ని ముఖ్యమైన మినహాయింపులివే...

ఆదాయ పన్ను తగ్గించుకోవడానికి చట్టంలో సుమారు 100కు పైగా మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు వీటిలో 70 మినహాయింపులను తొలగిస్తున్నట్లు ఆర్థికమంత్రి తెలిపారు. క్రమేపీ మిగిలిన మినహాయింపులను కూడా పూర్తిగా తొలగించే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. ఇలా తొలగించిన మినహాయింపుల్లో ముఖ్యమైనవి చూస్తే...

- రూ.50,000 స్టాండర్డ్ డిడక్షన్
- పిల్లల ట్యూషన్ ఫీజు
- బీమా ప్రీమియం
- ప్రావిడెంట్ ఫండ్
- ట్యాక్స్ సేవింగ్ ఫండ్స్
- లీవ్ ట్రావెల్ అలవెన్స్
- 80సీసీసీ కింద చెల్లించే పెన్షన్ పథకాలు
- ఉన్నత విద్యకు తీసుకున్న రుణంపై చెల్లించే వడ్డీ
- ఇంటి అద్దె అలవెన్స్
- ఇంటి రుణంపై చెల్లించే వడ్డీ
- ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు వెచ్చించిన మొత్తం,
- గుర్తింపు పొందిన సంస్థలకు ఇచ్చే విరాళాలు
- ఎంపీ, ఎమ్మెల్యేలు పొందే కొన్ని అలవెన్సులు
- ఉద్యోగ సంస్థలు ఇచ్చే ఆహార కూపన్లు

### వివాద్ సే విశ్వాస్

ఆదాయపు పన్ను చెల్లింపులకు సంబంధించి వివిధ న్యాయస్థానాల్లో ఉన్న లక్షలాది కేసులను పరిష్కరించడానికి 'వివాద్ సే విశ్వాస్' పేరుతో ప్రత్యేక ప్రథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆర్థికమంత్రి ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఆదాయ పన్నుకు సంబంధించి 4.83 లక్షల కేసులు వివాదాల్లో ఉన్నాయని, వీటిని పరిష్కరించుకోవాలనుకునే వారు ఈ పథకం కింద వివాదంలో ఉన్న మొత్తాన్ని చెల్లిస్తే చాలునని స్పష్టంచేశారు. ''మార్చి 31, 2020లోగా చెల్లించేవారికి పెనాల్టీలు, వడ్డీలు వంటివేమీ ఉండవు. అప్పటి నుంచి జూన్ 30, 2020లోగా చెల్లించే వారు మాత్రం కొంత మొత్తాన్ని పెనాల్టీగా చెల్లించాల్సి ఉంటుంది. ఆ తరవాత మాత్రం ఈ పథకం అమల్లో ఉండదు''అని మంత్రి స్పష్టం చేశారు. గతేడాది బడ్జెట్‌లో పరోక్ష పన్నుల విధానంలో ఉన్న వివాదాలను పరిష్కరించడానికి సబ్‌కా వికాస్ పేరుతో ప్రవేశపెట్టిన పథకం ద్వారా 1.89 లక్షల కేసులు పరిష్కారమయ్యాయని, వీటి ద్వారా రూ.39,000 కోట్ల బకాయిలను వసూలు చేశామని వివరించారు.

### ఈ-కామర్స్ లావాదేవీలపై 1% టీడీఎస్

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ లావాదేవీలపై కొత్తగా 1 శాతం టీడీఎస్ (ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్) విధిస్తూ కేంద్రం బడ్జెట్‌లో ప్రతిపాదన చేసింది. దీని ప్రకారం డిజిటల్ ప్లాట్‌ఫాంను నిర్వహించే ఈ-కామర్స్ ఆపరేటరు.. విక్రేతల స్థూల అమ్మకాలకు సంబంధించి 1 శాతం టీడీఎస్ మినహాయించాల్సి ఉంటుంది. అయితే, ఈ-కామర్స్ ప్లాట్‌ఫాంపై అంతక్రితం ఏడాది సదరు విక్రేత అమ్మకాలు రూ. 5 లక్షలకన్నా తక్కువ ఉండటంతో పాటు పాన్ ఆధార్ నంబరు ధృవీకరణ ఉన్న పక్షంలో ఈ నిబంధన వర్తించదు. దీన్ని అధ్యయనం చేస్తున్నట్లు ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ వెల్లడించగా .. ఫ్లిప్‌కార్ట్, స్నాప్‌డీల్ స్పందించలేదు.

### భగవద్గీతలోనూ ఎకన'మిక్స్' ఎన్నో!



''తానేదో గొప్పగా ఎకనమిక్స్ చదువుకున్నానని చెప్పుకునే చంద్రబాబు ఓ దినపత్రికలో భగవద్గీతను చూస్తాడు. కానీ నిజంగా స్థితప్రజ్ఞుడు మాత్రం భగవద్గీతలోనూ ఎకనామిక్స్ చూస్తాడు''

''అదెలా?''

''గీతలో కృష్ణభగవానుడేమన్నాడు. నీ పని నువ్వు చేసుకుంటూ పో. కర్మ ఫలం గురించి ఆలోచించకు. ఓనాటికి నీకు దక్కాల్సింది దక్కుతుంది అని చెప్పాడా, లేదా''

''చెప్పాడు... కానీ ఆ మాటనూ ఎకనమిక్సునూ ఎలా మిక్సు చేస్తావ్?''

''ఒరేయ్ నాయనా.. ఇది మన బతుక్కూ, రోజువారీ లెక్కలకూ పనిచేస్తుంది. నీ జీతంలో కొంత ఎల్ఐసీల కోసం, మరికొంత ప్రావిడెంట్‌ఫండ్ కోసం, ఇంకొంత ఇల్లో మరో లోన్ కోసమో కటింగ్ పెడతావు. ఎంత కట్టవుతోందో చూసుకున్నావనుకో... గుండె గుభేలుమంటుంది. టెన్షనే మిగులుతుంది. కానీ అవేమీ ఆలోచించకుండా 'జీతంలో కోత పడేదేదో పడనీ' అనుకున్నావనుకో. ఓనాటికి పాలసీ మెచ్యూరై ఫలం దొరుకుతుంది. రిటైరవ్వగానే పీఎఫ్ దండిగా చేతికందుతుంది. లోను పూర్తయి ఇల్లు మిగులుతుంది.కర్మణ్యేవాధికారస్తే... అన్న శ్లోకాన్ని ఇలా అన్వయించుకోవచ్చు''

''ఇలా నేనెప్పుడూ ఆలోచించలా''


''ఇంకా ఉంది. దుష్టులు పుట్టినప్పుడల్లా, దుర్మార్గాలు పెచ్చరిల్లినప్పుడల్లా నేను ఉద్భవించి పాపప్రక్షాళన చేస్తా.. అన్న శ్లోకం ఉంది కదా. అది కూడా ఎకనమిక్సే''

''ఇదెలా?''

''ఇప్పుడు దుర్మార్గాలూ... పాపాలు అంటే అప్పులన్నమాట. అందుకే 'ఆ అప్పు పాపం పెరిగినట్టు పెరిగిపోయింది' అనే ఓ వాడుక మాట కూడా మన దగ్గర ఉంది. అలా దుర్మార్గుల్లా అప్పులు పెరిగిపోయినప్పుడల్లా... ఉన్న పనికి తోడు మరో పనో, ఇంకో వ్యవహారమో చేయాలి. అంటే.. 'అలా చేసే పని' భగవంతుడెత్తే మరో అవతారం లాంటిదన్నమాట. ఆ పనితో అదనంగా సంపాదించడమంటే ఒక ధర్మయుద్ధం చేయడం లాంటిదన్నమాట. ఇక ఇక్కడ దుష్టశిక్షణ అంటే... ఆ మరో పనితో వచ్చే అదనపు ఆదాయంతో అప్పులు తీర్చేయడమన్నమాట. ఇప్పుడు చెప్పు. పనికిరానివాడికి పనికిరాని పేపరు భగవద్గీత అయితే పని తీసుకోగలిగినవాడికీ, పనికి వచ్చేవాడికి భగవద్గీత కూడా మహా ఎకనమిక్స్ గ్రంథం.. అవునా! కాదా?''

### ఊదా రంగులో ఎందుకుంది?

బడ్జెట్ సమర్పించడానికి నిర్మలా సీతారామన్ శనివారం మోసుకొచ్చిన బడ్జెట్ బ్యాగు ఈ ఏడాది కూడా ఎర్రటి కుంకుమ రంగులో ఉంటే.. ముందు రోజు ఆర్థిక మంత్రిత్వ శాఖ సమర్పించిన 'ఆర్థిక సర్వే' పుస్తకం కవరు ఊదారంగులో ఉంది! ఎరుపు భారతీయ సంస్కృతికి ఒక చిహ్నం అనుకున్నా.. ఈ ఊదా రంగు దేనికి చిహ్నం? ఆర్థిక సర్వే అన్నది పూర్వపు ఏడాది ఆర్థిక స్థితిగతులతో భవిష్యత్తును, సమకాలీన, ప్రాచీన ఆలోచనా విధానాలను సమన్వయం చేసుకుంటూ తయారయ్యే అవలోకన సారాంశం. ఈ ఏడాది ఆర్థిక సర్వే ఇతివృత్తం 'సంపద సృష్టి'. ఈ రెండు విషయాలను చెబుతూ కేంద్ర ముఖ్య ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రహ్మణ్యన్.. మోదీ ప్రభుత్వం తెచ్చిన కొత్త వంద నోటు రంగునే ఆర్థిక సర్వే పుస్తకం కవరు పేజీకి వేసినట్టు తెలిపారు. సంపద వృద్ధికి సంకేతంగా.




## కొత్త విధానంలో పన్ను తగ్గుదల ఉత్తుత్తిదేనా..?

- భారీగా పెరగనున్న పన్ను భారం
- దీర్ఘకాలిక పొదుపు అలవాటుపై ప్రతికూల ప్రభావం
- ఆర్థిక మంత్రి చర్యలను తప్పుపడుతున్న ట్యాక్స్ నిపుణులు

సాక్షి, అమరావతి: కొత్త పన్నుల విధానంలో పన్ను రేట్లు తగ్గించడం వల్ల పన్ను భారం భారీగా తగ్గుతుందని, దీనివల్ల కేంద్ర ప్రభుత్వం రూ.40,000 కోట్ల ఆదాయం కోల్పోతుందన్న మాటల్లో వాస్తవం లేదని ట్యాక్సేషన్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కీలకమైన పన్ను మినహాయింపులను ఎత్తివేయడం వల్ల ప్రజల్లో పొదుపు అలవాటుపై తీవ్ర ప్రభావం చూపుతుందంటున్నారు. పన్ను భారం తగ్గించుకోవడానికి చాలామంది బీమా, పీపీఎఫ్, గృహ రుణాలు వంటివి తీసుకుంటున్నారని, ఇప్పుడు వీటిని తొలగించడం వల్ల ఈ పథకాలకు ఆసక్తి తగ్గిపోయే ప్రమాదం ఉందని ట్యాక్స్ నిపుణులు ఎంఎస్ శాస్త్రి స్పష్టం చేస్తున్నారు. వృద్ధిరేటును పెంచడం కోసం పొదుపు శక్తిని తగ్గించడం ద్వారా కొనుగోలు శక్తిని పెంచాలని ఆర్థికమంత్రి ఆలోచన కింద ఉన్నట్లు కనిపిస్తోందని, కానీ ఇది దీర్ఘకాలంలో మన ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందన్నారు. ఏ విధంగా చూసినా కొత్త విధానం కంటే పాత విధానమే భారం తక్కువగా ఉంటుందని ట్యాక్స్ నిపుణురాలు కె.వి.ఎల్.ఎన్ లావణ్య స్పష్టం చేస్తున్నారు.పన్ను రేటు సగానికి సగం తగ్గినా మినహాయింపులు ఎత్తివేయడం వల్ల పాత విధానం కంటే కొత్త విధానంలో పన్ను చెల్లించాల్సి వస్తోందన్నారు. ప్రస్తుత విధానంలో రూ.7.5 లక్షల ఆదాయం ఉన్న వారి వరకు మినహాయింపులను వినియోగించుకోవడం ద్వారా ఎటువంటి పన్ను చెల్లించనవసరం లేదని, అదే కొత్త విధానంలో అయితే ఏకంగా రూ.37,500 పన్ను చెల్లించాల్సి వస్తోందన్నారు.




### అస్మిత ఐటీ ఉద్యోగిని — వార్షిక ఆదాయం రూ.7.5 లక్షలు

| వివరం | పాత విధానం | కొత్త విధానం |
|---|---|---|
| బేసిక్ | 4.0 లక్షలు | 4.0 లక్షలు |
| హెచ్ఆర్ఏ | 2.5 లక్షలు | 2.5 లక్షలు |
| అలవెన్స్ | 1.0 లక్షలు | 1.0 లక్షలు |
| మొత్తం జీతం | 7.5 లక్షలు | 7.5 లక్షలు |
| పన్ను ఆదాయం | | |
| బేసిక్ | 4.0 లక్షలు | 4.0 లక్షలు |
| హెచ్ఆర్ఏ | 1.5 లక్షలు | 2.5 లక్షలు |
| అలవెన్సు | 1.0 లక్షలు | 1.0 లక్షలు |
| పన్ను ఆదాయం | 6.5 లక్షలు | 7.5 లక్షలు |
| మినహాయింపులు | | |
| స్టాండర్డ్ డిడక్షన్ | 50 వేలు | -- |
| సెక్షన్ 80సీ | 1.0 లక్షలు | -- |
| నికరపన్ను ఆదాయం | 5 లక్షలు | 7.5 లక్షలు |
| చెల్లించాల్సిన పన్ను | -- | 37,500 |

### శ్రీకాంత్‌రెడ్డి బ్యాంక్ మేనేజర్ — వార్షిక ఆదాయం రూ.10 లక్షలు

| వివరం | పాత విధానం | కొత్త విధానం |
|---|---|---|
| బేసిక్ | 5.0 లక్షలు | 5.0 లక్షలు |
| హెచ్ఆర్ఏ | 3.0 లక్షలు | 3.0లక్షలు |
| అలవెన్స్ | 2.0 లక్షలు | 2.0 లక్షలు |
| మొత్తం జీతం | 10 లక్షలు | 10 లక్షలు |
| పన్ను ఆదాయం | | |
| బేసిక్ | 5.0 లక్షలు | 5.0 లక్షలు |
| హెచ్ఆర్ఏ | 1.5 లక్షలు | 3.0 లక్షలు |
| అలవెన్సు | 2.0 లక్షలు | 2.0 లక్షలు |
| పన్ను ఆదాయం | 8.5 లక్షలు | 10.0 లక్షలు |
| మినహాయింపులు | | |
| స్టాండర్డ్ డిడక్షన్ | 50 వేలు | -- |
| సెక్షన్ 80సీ | 1.5 లక్షలు | -- |
| నికరపన్ను ఆదాయం | 6.5 లక్షలు | 10 లక్షలు |
| చెల్లించాల్సిన పన్ను | 42,500 | 75,000 |

### అనూరాధ సీనియర్ సైంటిస్ట్ — వార్షిక ఆదాయం రూ.15 లక్షలు

| వివరం | పాత విధానం | కొత్త విధానం |
|---|---|---|
| బేసిక్ | 9.0 లక్షలు | 9.0 లక్షలు |
| హెచ్ఆర్ఏ | 4.0 లక్షలు | 4.0లక్షలు |
| అలవెన్స్ | 2.0 లక్షలు | 2.0 లక్షలు |
| మొత్తం జీతం | 15 లక్షలు | 15 లక్షలు |
| పన్ను ఆదాయం | | |
| బేసిక్ | 9.0 లక్షలు | 9.0 లక్షలు |
| హెచ్ఆర్ఏ | 2 లక్షలు | 4.0 లక్షలు |
| అలవెన్సు | 2.0 లక్షలు | 2.0 లక్షలు |
| పన్ను ఆదాయం | 13 లక్షలు | 15 లక్షలు |
| మినహాయింపులు | | |
| స్టాండర్డ్ డిడక్షన్ | 50 వేలు | -- |
| సెక్షన్ 80సీ | 1.5 లక్షలు | -- |
| నికరపన్ను ఆదాయం | 11 లక్షలు | 15 లక్షలు |
| చెల్లించాల్సిన పన్ను | 1,42,500 | 1,87,500 |

కేవీఎల్ఎన్ లావణ్య, ట్యాక్సేషన్ నిపుణురాలు

### ఎన్ఆర్ఐ నిబంధనల సవరణ


న్యూఢిల్లీ: విదేశాలలో పన్నులు చెల్లించని ఎన్ఆర్ఐలు ఇకపై ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దేశీయంగా పౌరసత్వం కలిగి ఉండి విదేశాల్లో 240 రోజుల పాటు నివాసముండటం ద్వారా ఎన్ఆర్ఐ కేటగిరీలోకి వస్తారని, వారు ఏ దేశంలోనూ పన్నులు చెల్లించకపోతే ఇకపై దేశీయంగా పన్ను చెల్లించాల్సి ఉంటుందని కేంద్రం పేర్కొంది. ఇందుకు తాజా బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేపట్టారు.

# అందుబాటు తప్ప.. అందినదేమీ లేదు!

- రూ.1.5 లక్షల వడ్డీ రాయితీ గడువు మరొక ఏడాది పొడిగింపు
- అఫడబుల్ డెవలపర్లకు లాభాల మీద పన్నుకు కూడా..
- కొత్త ఎయిర్‌పోర్ట్స్, లాజిస్టిక్ పాలసీలతో కమర్షియల్ రియల్టీకి డిమాండ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మళ్లీ పాత పాటే పడింది. జీఎస్‌టీ తగ్గింపు, మౌలిక రంగ హోదా, ఇన్వెంటరీ గృహాలకు పన్ను మినహాయింపు, డెవలపర్స్ సబ్‌వెన్షన్, కొనుగోలుదారుల ఫిర్యాదు కోసం రెరా సింగిల్ బాడీ ఏర్పాటు వంటి వాటితో రియల్టీలో జోష్ నింపుతుందనుకున్న బడ్జెట్ నీరుగార్చింది. అందుబాటు గృహ కొనుగోలుదారులు, వాటి నిర్మాణదారులకు మినహా రియల్టీ రంగానికి ప్రత్యక్షంగా ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదు. లాజిస్టిక్ పాలసీ, కొత్త యూనివర్సిటీలు, విమానాశ్రయాలు, స్మార్ట్ సిటీలు, డేటా సెంటర్లతో కమర్షియల్ రియల్ ఎస్టేట్ వ్యాపార అవకాశాలను కల్పించారు. రవాణా, మౌలిక రంగ వసతుల కేటాయింపులతో దీర్ఘకాలంలో గృహ విభాగానికి డిమాండ్ వస్తుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.



### అందుబాటు గృహాల మీదే ఫోకస్..

తొలిసారి ఇల్లు కొనే వారికి అందించే రూ.1.5 లక్షల వడ్డీ రాయితీ గడువును మరొక ఏడాది పొడిగించారు. అంటే అఫోర్డబుల్ హౌజింగ్ వడ్డీ రాయితీని 2021 మార్చి వరకు పొందే వీలుందన్నమాట. అందుబాటు గృహాల నిర్మాణదారులకు లాభాల మీద 100 శాతం పన్ను మినహాయింపులను మరో ఏడాది పొడిగించింది. పెరిగిన ఏడాది పన్ను మినహాయింపు లాభాలను పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు కొనుగోలుదారులు, డెవలపర్లు ముందుకొస్తారు కాబట్టి అఫోర్డబుల్ హౌజింగ్స్‌కు డిమాండ్ పెరుగుతుందని నరెడ్కో నేషనల్ ప్రెసిడెంట్ నిరంజన్ హిరనందానీ అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత ఆదాయపన్ను శాతాన్ని 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించారు. ఇది ఆయా పన్ను చెల్లింపుదారులకు రియల్టీ పెట్టుబడులకు అవకాశమిస్తుందని టాటా రియల్టీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండీ అండ్ సీఈఓ సంజయ్ దత్ తెలిపారు.

### రియల్టీకి కొత్త ఇన్వెస్ట్‌మెంట్ దారులు..

డేటా సెంటర్లు, కొత్త విమానాశ్రయాలు, స్మార్ట్ సిటీలతో కమర్షియల్ రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు అవకాశాలు మెరుగవుతాయని జేఎల్ఎల్ ఇండియా సీఈఓ రమేష్ నాయర్ అన్నారు. ఢిల్లీ–ముంబై, బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్‌వేస్, బెంగళూరు సబర్బన్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్రాజెక్ట్‌లతో మౌలిక రంగంలో స్కిల్ డెవలప్‌మెంట్ పెరగడంతో పాటూ ఆయా మార్కెట్లలో డెవలపర్లకు కొత్త పెట్టుబడులకు అవకాశాలు ఏర్పడతాయి. కొత్తగా వంద విమానాశ్రయాలు, ఐదు స్మార్ట్ సిటీలు, డేటా సెంటర్లతో కమర్షియల్ రియల్టీకి అవకాశాలు వస్తాయని తెలిపారు. 2024 నాటికి పరిశ్రమ ఆదాయం 3.2 బిలియన్ డాలర్లకు చేరుతుందని పేర్కొంది.

### లాజిస్టిక్ బూస్ట్..

నేషనల్ లాజిస్టిక్ పాలసీ ప్రకటనతో వేర్‌హౌజ్, లాజిస్టిక్ రంగంలో సరఫరా పెరుగుతుంది. గతేడాది దేశంలో 21.1 కోట్ల చ.అ.లుగా ఉన్న వేర్‌హౌజ్ సప్లయి 2023 ముగింపు నాటికి 37.9 కోట్ల చ.అ.లకు చేరుతుందని అనరాక్ కన్సల్టెన్సీ అంచనా వేసింది. సింగిల్ విండో క్లియరెన్స్‌తో వేర్‌హౌజ్ అనుమతుల సమయం 6 నెలలకు తగ్గిపోతుంది. 2019లో దేశంలోని ప్రధాన నగరాల్లో 3.6 కోట్ల చ.అ. వేర్‌హౌజ్ నికర లావాదేవీలు జరిగాయి. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీస్ ఇంట్రెస్ట్ యాక్ట్ (సర్ఫాసీ చట్టం) కింద బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల అసెట్స్ నిర్వహణను రూ.500 కోట్ల నుంచి రూ.100 కోట్లకు తగ్గించారు. దీంతో మధ్యలోనే ఆగిపోయిన రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌ల నిధులను రికవర్ చేయడానికి మరింత అవకాశం ఉంటుంది. ఆగిపోయిన ప్రాజెక్ట్‌ల్లో పెట్టుబడులు పెట్టడానికి అవకాశం కల్పించాలి.





## ఢిల్లీపై సవతి ప్రేమ


కేజ్రీవాల్

బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం ఈసారి కూడా ఢిల్లీపై సవతి తల్లి ప్రేమ చూపించింది. ఈ బడ్జెట్‌పై ఢిల్లీ ఎన్నో ఆశలు పెట్టుకుంది. అయితే, ప్రభుత్వం వాటన్నింటినీ నీరు గార్చింది. బీజేపీ సర్కారు ఢిల్లీకి ప్రాధాన్యం ఇవ్వనప్పుడు దానికెందుకు ఓటెయ్యాలి అని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందే బీజేపీ ప్రభుత్వం దేశ రాజధానిని నిరాశ పరిస్తే రేపు ఎన్నికలయ్యాక ఇచ్చిన హామీలను ఏం తీరుస్తుందని ఆప్ జాతీయ కన్వీనర్ కూడా దుయ్యబట్టారు.

## కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేసింది


పి. చిదంబరం

దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందనే విషయాన్ని ఒప్పుకొనే స్థితిలో మోదీ ప్రభుత్వం లేదు. పైగా ఆర్థిక వ్యవస్థలో పునరుత్తేజం తీసుకురాలేక, ఉద్యోగ కల్పన చేసే విషయంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం దుయ్యబట్టారు. '2020–21లో దేశ ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతుందనే నమ్మకం కలిగించేందుకు ఒక్కటంటే ఒక్క విషయం కూడా బడ్జెట్‌లో లేదు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6 నుంచి 6.5 శాతానికి పెరుగుతుందని చెప్పడం బాధ్యతారాహిత్యం. ఆర్థిక సర్వేలో ఇచ్చిన ప్రతి సంస్కరణను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పూర్తిగా పెడచెవిన పెట్టారు. దీన్ని బట్టి కేంద్రం సంస్కరణలు అంటేనే భయపడుతోందనే విషయం స్పష్టం అవుతోంది'అని విమర్శించారు. పాత బట్టలను ఇస్త్రీ చేసినట్లు.. పాత పథకాలనే మళ్లీ చెప్పారు తప్ప.. కొత్తగా కేంద్రం చెప్పిందేమీ లేదని పెదవి విరిచారు.

## సమ్మిళిత వృద్ధి కారకం



జేపీ నడ్డా

కేంద్రం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి దోహదపడేలా ఉంది. దూరదృష్టితో, అభివృద్ధి ప్రాధాన్యతగా రూపొందించిన అందమైన బడ్జెట్. మొదటి సారి ఇల్లు కొనుక్కునే వారికి సబ్సిడీ ఇవ్వడం, ఆదాయ పన్నులో రాయితీలు ప్రకటించడం ద్వారా ఈ బడ్జెట్ మధ్యతరగతి వేతన జీవుల ఆశలు నెరవేరుస్తుందని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా హర్షం వ్యక్తం చేశారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్ స్ఫూర్తితో నవ భారతానికి పునాదులు వేస్తుందన్నారు.

సాక్షి

# చిన్నపరిశ్రమ ఆశలకు గండి

విశ్లేషణ


లక్ష్మణ వెంకట్ కూచి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రెండో బడ్జెట్‌ని మొదటిసారి పరికిస్తే, ఆర్థిక వ్యవస్థ అనే వృషభాన్ని లొంగదీసుకుని ఇప్పుడున్న ఆర్థిక మందగమనాన్ని నిలువరించి, దాన్ని వెనక్కి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని అర్థమవుతోంది. దీర్ఘకాలం ఆర్థికమాంద్యం కొనసాగితే అది మరింత పెద్ద సంక్షోభానికి దారితీస్తుంది. ఆదాయ పన్ను రేటును తగ్గించడం, భారీ పెట్టుబడులు అవసరమయ్యే ప్రాజెక్టులను పునరుద్ధరించడానికి ప్రయత్నించడం, రైతులపై దృష్టిపెట్టి, రైతుల ఆదాయాన్ని వచ్చే రెండేళ్లలో రెట్టింపు చేస్తామని నొక్కి చెప్పడం వంటి చర్యల ద్వారా ప్రజలకు మరింతగా నగదును అందజేయడం ద్వారా వినియోగాన్ని ప్రోత్సహించడానికి ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ప్రయత్నించారు. ఆమె చేసిన ప్రతిపాదనలను ఎవరూ తప్పుపట్టలేరు.

ఇటీవలి కాలం వరకు దేశంలో ఆర్థిక సంక్షోభం ఉందని అంగీకరించడానికి కూడా కేంద్రప్రభుత్వం సిద్ధపడలేదు. అయితే గత కొద్దినెలలుగా ఆర్థిక వ్యవస్థ సజావుగా లేదని నెమ్మదిగా అర్థం చేసుకోవడంతో తాజా బడ్జెట్‌ను ప్రభుత్వం సరైన దిశలో తీసుకొచ్చిందనే చెప్పాలి. ఆర్థిక వ్యవస్థ స్వస్థతను పునరుద్ధరించడం కోసం ఆమె పూనుకున్న చికిత్సకు వివిధ దృక్పథాలకు చెందిన ఆర్థికవేత్తల సూచనలే ప్రాతిపదిక అని అర్థమవుతోంది.

కానీ సంక్షోభం పరిమాణం, దాని లోతు బట్టి చూస్తే ఆర్థిక మంత్రి ప్రయత్నం ఫలితాలను ఇవ్వనుందా అనే ప్రశ్న తలెత్తుతుంది. తాజా బడ్జెట్ వృద్ధికి ప్రోత్సాహకంగా ఉంటున్నప్పటికీ, స్టాక్ మార్కెట్ కుప్పగూలడాన్ని చూస్తే నిర్మల బడ్జెట్ అంచనాలను అందుకోలేదని తెలుస్తుంది. వివిధ వాణిజ్యమండళ్లు, లాబీ గ్రూపులు ఈ బడ్జెట్‌ని స్వాగతించినా, వాటి సభ్యులు మాత్రం అంతర్గతంగా విచారిస్తున్నట్లు సమాచారం. ఈ బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా లేదన్నది వారి అభిప్రాయం.

గత సంవత్సరం సెప్టెంబర్‌లో కార్పొరేట్ పన్ను రేటును




భారీగా తగ్గించడంతో బడ్జెట్‌కు ముందే తాము కోరుకున్నది పొందామని బడా పరిశ్రమ వర్గాలు సంతృప్తి చెందాయి. కానీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఈ బడ్జెట్‌వల్ల బాగా ఆశాభంగం చెందాయి. కార్పొరేట్ వర్గాలకు మల్లే తమకు కూడా కార్పొరేట్ పన్నును మినహాయిస్తారని వీరు ఆశలు పెంచుకున్నారు కానీ వారి ఆశలు నిరాశలయ్యాయి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు దేశం స్థూల ఆదాయంలో 32 శాతం వరకు దోహదపడుతున్నాయి. ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ 11 కోట్ల 10 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. దేశ ఎగుమతుల్లో దాదాపు సగభాగం వీటి నుంచే జరుగుతున్నాయి.

ఆర్థిక వ్యవస్థ సమగ్ర సంక్షేమానికి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పునరుద్ధరణ కీలకమైనదని మనకు సులభంగా అర్థమవుతుంది. ప్రత్యేకించి 2016లో పెద్ద నోట్ల రద్దు, 2017లో జీఎస్టీ కలిగించిన ప్రకంపనలతో ఈ రంగానికి ఊపిరాడటం లేదు. తాము కోల్పోయిన వైభవాన్ని ఇవి ఇంకా సాధించడం లేదు. ఆనాటి నుంచి వందలాది చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయి కూడా. పన్ను వివాదాలు, వివాదాస్పదంగా మారిన పన్ను చెల్లింపు మొత్తాలకు సంబంధించి ప్రభుత్వ సహాయాన్ని చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కోరుకుంటూ ఎదురు చూస్తున్నాయి. ఆర్థిక మంత్రి పన్ను వివాద పరిష్కార పథకాన్ని ప్రారంభించారు కానీ 2020 మార్చి 31లోగా చెల్లించని బకాయిలపై అపరాధరుసుం, వడ్డీరేటును తగ్గిస్తానని హామీ ఇవ్వడం తప్పితే మరే ఇతర రాయితీలనూ ఇవ్వడానికి తిరస్కరించారు. ఈ సంవత్సరం మార్చి 31 తర్వాత చెల్లించే బకాయిలకు ఈ రంగం యథాప్రకారం అపరాధరుసుం, వడ్డీరేటును చెల్లించాల్సి ఉంటుంది. ఈ సదుపాయం కూడా జూన్ 30 వరకే అందుబాటులో ఉంటుంది. అందుకే చిన్న మధ్యతరహా పరిశ్రమలు ఈ షరతుపట్ల తీవ్రంగా ఆశాభంగం చెందిఉన్నాయి. చిన్నతరహా పరిశ్రమలకు జీఎస్టీ వివాదాలు మరొక శిరోభారంగా మారాయి. రాబడి ఫైలింగ్ వ్యవధిని మరో సంవత్సరం పాటు ప్రభుత్వం పొడిగించిందంటే, ప్రారంభించి రెండున్నర సంవత్సరాలు పూర్తయినప్పటికీ నూతన పన్ను వ్యవస్థ ఇంకా సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని స్పష్టమవుతోంది. ఈ ఏప్రిల్ నుంచి ఆదాయ రిటర్నులను మరింత సరళీకరిస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. అంటే జీఎస్టీ వ్యవస్థలో తలెత్తిన పలు సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదనే అర్థం. పన్ను చెల్లింపుదారులు తమ రీఫండ్‌లను సకాలంలో పొందనట్లయితే అది నిరుపయోగమే అవుతుంది. పన్నుల రూపంలోని ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించడం స్వాగతించదగినదే. పన్ను వసూళ్ల రంగంలోని పాలనాధికారులను ఆమె కట్టడి చేసినట్లయితే దేశం మొత్తానికి పెద్ద సేవ చేసినవారవుతారు.

జీఎస్టీ రేటు హేతుబద్ధీకరణ పూర్తిగా జీఎస్టీ కౌన్సిల్‌కి సంబంధించిందే అయినప్పటికీ బడ్జెట్‌లో పేర్కొన్నట్లుగా దాని హేతుబద్ధీకరణ సాధ్యం కావడంలేదు. పాత, కొత్త పన్నుల వ్యవస్థ పక్కపక్కనే కొనసాగించడం వల్ల మరింత గందరగోళం పెరిగి కల్లోలానికి దారి తీస్తోంది. ఆదాయపన్ను శ్లాబ్‌లు నాలుగు నుంచి ఏడుకు పెంచడం, 0 నుంచి 2.50 లక్షల వరకు ఎలాంటి ఆదాయ పన్ను లేదనీ, 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు 5 శాతం పన్ను చెల్లించాలని, రూ. 5–7 లక్షల వార్షిక ఆదాయంపై పన్ను 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గింపు ఉంటుందని, రూ. 7.5 లక్షల నుంచి రూ 10 లక్షల వరకూ పన్ను 20 నుంచి 15 శాతానికి తగ్గింపు ఉంటుందని, రూ. 10 నుంచి రూ 12.5 లక్షల వార్షికాదాయంపై 20 శాతం పన్ను, రూ. 12.5 లక్షల నుంచి రూ 15 లక్షల వార్షికాదాయంపై 25 శాతం పన్ను, రూ. 15 లక్షల పైబడి ఆదాయంపై 30 శాతం పన్ను చెల్లించాలని ఆదాయపన్నులో మినహాయింపు ఇవ్వడం కాస్త ఊరటనిచ్చేదే. పైగా ఆర్థిక వ్యవస్థలో డిమాండును ఇది ప్రోత్సహిస్తుంది కూడా.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం
ఉత్తరాయణం, శిశిర ఋతువు
మాఘ మాసం, తిథి శు.అష్టమి
సా.4.10 వరకు, తదుపరి నవమి
నక్షత్రం భరణి రా.7.54 వరకు
తదుపరి కృత్తిక, వర్జ్యం ..లేదు,
దుర్ముహూర్తం సా.4.22 నుంచి 5.07
వరకు, అమృతఘడియలు... ప.2.40
నుంచి 3.44 వరకు.

**సూర్యోదయం** : 6.35
**సూర్యాస్తమయం** : 5.52
**రాహుకాలం** : సా.4.30 నుంచి 6.00 వరకు
**యమగండం** : ప.12.00 నుంచి 1.30 వరకు

## ప్రభుత్వ సంస్థల నాశనానికి కుట్ర


మమతా బెనర్జీ


జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)లో కొంత వాటాను విక్రయించాలన్న ప్రతిపాదనతో కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేసేందుకు కుట్ర చేస్తోంది. ఎల్ఐసీలో ఉన్న ప్రభుత్వ షేర్లలో కొన్నింటిని ప్రజలకు విక్రయించాలన్న కేంద్రం ప్రతిపాదన నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా తెరమరుగు చేసేందుకే కేంద్రం ఈ పని చేస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ శనివారం పార్లమెంటుకు సమర్పించిన వార్షిక బడ్జెట్‌పై స్పందిస్తూ ప్రభుత్వ సంస్థలపై ప్రజలకున్న భద్రతా భావాన్ని అంతం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు.

## ఉద్యోగాలిచ్చే బడ్జెట్


యోగి ఆదిత్యనాథ్

కేంద్ర బడ్జెట్ అభివృద్ధికి ఊతమిచ్చేలా ఉందని, ఇది ఉద్యోగ కల్పనకు ఎంతో ఉపయోగపడుతుంది' అని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కొనియాడారు. 'ఈ బడ్జెట్.. ఉద్యోగ కల్పన చేస్తుంది. రైతుల పక్షపాతిగా ఉంది. నిరంతర అభివృద్ధికి దోహదపడుతుంది. దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ బడ్జెట్ ఓ మైలు రాయి. ఆరోగ్య సౌకర్యాలు కల్పిస్తుంది' అని ప్రశంసించారు. దేశ ఆర్థిక వ్యవస్థను శక్తిమంతం చేస్తుందని, దేశ ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఈ బడ్జెట్ ఉందని పేర్కొన్నారు.


## పన్ను చెల్లింపుదారులకు ఊరట


అమిత్ షా

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పన్ను చెల్లింపుదారులకు ఎనలేని ఊరట కలిగించింది, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న మోదీ ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చేలా ఉంది'అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసించారు. బడ్జెట్‌లో కేటాయించిన 100 లక్షల కోట్లతో దేశంలో రహదారులు, రైల్వేలు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు. బడ్జెట్‌పై స్పందిస్తూ శనివారం ఆయన పలు ట్వీట్లు చేశారు. పన్ను వ్యవస్థను హేతుబద్ధం చేయడానికి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి, బ్యాంకింగ్ రంగం బలోపేతం కావడానికి, పెట్టుబడులను ప్రోత్సహించడం, వ్యాపారాన్ని సులభతరం చేయడం కోసం మోదీ ప్రభుత్వం పటిష్టమైన చర్యలనేకం తీసుకుందన్నారు. తద్వారా భారత దేశాన్ని ఐదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న మోదీ సర్కారు లక్ష్యం నెరవేరేందుకు మార్గం సుగమమయిందన్నారు. సాగు నిబంధనల రూపకల్పన, పప్పుధాన్యాల నిల్వ కేంద్రాల ఏర్పాటు ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయనుందని అమిత్ షా కొనియాడారు. పన్ను చెల్లింపుదారులు, ముఖ్యంగా మధ్య తరగతి, ఉద్యోగ వర్గాలకు పన్ను గణనీయంగా తగ్గుతుందన్నారు. దేశం నలుమూలలా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని విస్తరింపచేయడం కోసం ప్రైవేటు–ప్రభుత్వ భాగస్వామ్యంలో ఆస్పత్రులు నెలకొల్పడం ద్వారా ఆరోగ్య భారతాన్ని మోదీ ఆవిష్కరించనున్నారన్నారు. కిసాన్ రైల్, కిసాన్ ఉడాన్ యోజనల ద్వారా పళ్లు, కూరగాయల రైతులు తమ ఉత్పత్తులను దేశ, విదేశాల్లో విక్రయించుకోవడానికి అవకాశం కలుగుతుందని అమిత్ షా అన్నారు. బడ్జెట్‌లో ఎస్సీలకు 85 వేల కోట్లు, ఎస్టీలకు 53,700 కోట్లు కేటాయించడం సమాజంలో నిర్లక్ష్యానికి గురయిన వర్గాలను ప్రధాన జీవన స్రవంతిలోకి తేవాలన్నమోదీ సర్కారు నిబద్ధతకు అద్దం పడుతోందని హోం మంత్రి అన్నారు.

# ద్రవ్యలోటు లోగుట్టు కీలకం!

సందర్భం


ఎ.కె. భట్టాచార్య

పెట్టుబడుల ఉపసంహరణ పట్ల అత్యాశ, పన్నేతర రాబడుల వృద్ధి, రక్షణ రంగంతో సహా సబ్సిడీలపై గట్టి నియంత్రణ వంటి అంశాలపై స్వారీ చేస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. ఆర్థికరంగ పటిష్టీకరణ పథకాన్ని మళ్లీ పట్టాలమీదికి ఎక్కిస్తానంటూ శనివారం పార్లమెంటులో హామీ ఇచ్చారు. 2020–21 కేంద్ర బడ్జెట్‌ను సమర్పిస్తూ, స్థూల దేశీయోత్పత్తిలో ప్రస్తుత సంవత్సరం ద్రవ్యలోటు 3.8కి దిగజారిపోయిందని అంగీకరించారు. వచ్చే సంవత్సరానికి ద్రవ్యలోటును జీడీపీలో 3.5 శాతానికి తగ్గిస్తానని ఆర్థికమంత్రి హామీ ఇచ్చారు. అలాగే ద్రవ్యలోటును 3.3 శాతానికి తగ్గించడానికి సవరించిన ద్రవ్యపటిష్టీకరణ పథకం అమలు చేస్తామని కూడా మంత్రి చెప్పారు. ద్రవ్యలోటు 2021–22లో 3.3 శాతానికి 2022–23లో 3.1కి పడిపోతుందని సెలవిచ్చారు.

అయితే ఇవి ద్రవ్యలోటుకు సంబంధించి పైకి కనిపించే లెక్కలు మాత్రమే కానీ ప్రభుత్వం చేస్తున్న అదనపు బడ్జెట్ రుణాల పూర్తి ప్రభావాన్ని ఇది బయటపెట్టడం లేదు. 2019–20 ఆర్థిక సంవత్సరంలో మొత్తం అదనపు బడ్జెట్ రుణాలు (ప్రభుత్వం బాధ్యతపడే బాండ్ల జారీ ద్వారా కూడగట్టినవి, జాతీయ చిన్నమొత్తాల పొదుపుల నిధి నుంచి తీసుకున్న రుణాలకు కూడా ఆర్థిక మద్దతు లభించినవి) మొత్తం రూ. 1.73 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఈ తరహా రుణాలు 8 శాతం పెరిగి రూ. 1.86 లక్షల కోట్లకు చేరుకుంటాయని అంచనా. ఈ బడ్జెట్‌కు అవతల చేసే రుణాలు కేంద్రం మొత్తం రుణాల్లో కలిపేటట్లయితే, జీడీపీలో వాస్తవ ద్రవ్య లోటు 2019–20లో 4.5 శాతానికి, 2020–21లో 4.36 శాతానికి చేరుతుంది.

ఆర్థికమంత్రి ఇలాంటి అద్భుతాన్ని సాధిస్తానని ఎలా సూచించారు అనేది ప్రశ్న. అయితే మొదటగా, 2019–20లో ద్రవ్యలోటును 3.3 శాతంకి తగ్గిస్తామని వాగ్దానం చేసిన ఆర్థిక మంత్రి కేవలం 0.5 శాతం తేడాతో దాన్ని 3.8 శాతానికి ఎలా నిర్వహించారు? ఈ క్రమంలో నికర పన్ను రాబడిలో రూ. 1.45 లక్షల కోట్లు తగ్గిందనీ, పెట్టుబడుల ఉపసంహరణ అంచనాలు దాదాపు రూ. 40 వేల కోట్లమేరకు తగ్గిపోయాయన్న విషయాన్ని ఆమె అంగీకరించాల్సి వచ్చింది. దీంతో బడ్జెట్ ముందస్తు అంచనాలో ఆమె ప్రతిపాదించిన మొత్తంలో రూ. 1.85 లక్షల కోట్ల రాబడి తగ్గిపోయింది. అదేక్రమంలో ఆర్థిక మంత్రి ప్రభుత్వ వ్యయాన్ని రూ. 88,000 కోట్ల మేరకు కుదించేశారు. దీంట్లో నాలుగింట ఒకవంతు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని కుదించడం ద్వారా వచ్చిందేనని గుర్తుంచుకోవాలి. అలాగే ఆర్బీఐ నుంచి అదనపు మూలధనం బదిలీ కూడా ప్రభుత్వానికి కాస్త దోహదపడింది. ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో రూ. 36,000 కోట్లు వచ్చింది. దీంతో మొత్తం ప్రభుత్వ వ్యయంలో తగ్గుదల రూ. 61,000కు పరిమితం అయింది.

బడ్జెట్ లోటుకు సంబంధించి 2020–21 సంవత్సరంలో అతిపెద్ద అద్భుతం చోటు చేసుకుందనే చెప్పాలి. తాజా బడ్జెట్‌లో రూ. 1,20,000 కోట్ల మేరకు పెట్టుబడుల ఉపసంహరణను ప్రతిపాదించారు. అయితే గత సంవత్సరం బడ్జెట్‌లో అంచనా వేసుకున్న రూ.1,05,000 కోట్లనే ప్రభుత్వం సేకరించలేకపోయింది. తాజా బడ్జెట్‌లో రూ. 1,20,000 కోట్ల విలువైన పెట్టుబడుల ఉపసంహరణ చేపడుతున్నట్లు మంత్రి ప్రకటించడం అత్యాశే కావచ్చు. ప్రభుత్వ రంగంలోని భారీ సంస్థలలో ప్రైవేటీకరణను పూర్తి చేయడంలో వైఫల్యం కారణంగానే పెట్టుబడుల ఉపసంహరణలో అంచనాలు తప్పాయి. దీనికి మించి ప్రభుత్వరంగ బ్యాంకులు, ద్రవ్య సంస్థలలో కేంద్రప్రభుత్వానికి ఉన్న ఈక్విటీ మొత్తంలో అదనంగా రూ. 90,000 కోట్ల పెట్టుబడులను ఉపసంహరిస్తానంటూ ప్రభుత్వం మరొక అత్యాశతో కూడిన ప్రకటన చేసింది. ఇక వ్యయం విషయానికి వస్తే 2020–21 బడ్జెట్‌లో ఆహారం, ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులపై వ్యయాన్ని భారీగా అంటే రూ. 2.28 ట్రిలియన్ల మేరకు తగ్గించనున్నట్లు ఆర్థికమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుత సంవత్సరంలో ఈ విభాగాల కింద రూ. 2.27 లక్షల కోట్ల మేరకు సబ్సిడీలను అందిస్తున్నారు. అయితే ఈ సబ్సిడీలను ఎలా ఎంతమేరకు కుదిస్తారన్నది బడ్జెట్ స్పష్టం చేయలేదు. ఎరువులపై సబ్సిడీలు నిజానికి తగ్గుముఖం పట్టాయి. సబ్సిడీల హేతుబద్ధీకరణ పథకం ఏదైనా ఉంటే వచ్చే సంవత్సరం దాన్ని అమలు పర్చవచ్చు.




రక్షణరంగ వ్యయంలో రెండు శాతం పెంచడంద్వారా రక్షణ బడ్జెట్ రూ.3.23 లక్షల కోట్లకు చేరుతుంది. ఇది ద్రవ్యలోటును అడ్డుకోవడంలో తోడ్పడుతుంది కానీ పెరుగుతున్న దేశ రక్షణ అవసరాలను ఇది తీర్చలేదు. చాలా సంవత్సరాలుగా రక్షణ రంగ వ్యయాన్ని అతి తక్కువగా మాత్రమే పెంచుతూ వస్తున్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద దేశంలోని ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ. 6,000 కోట్లు ఇస్తున్నారు. 2019–20లో ఈ పథకంలో భాగంగా రూ. 57,370 కోట్లు వెచ్చించగా ఈ సంవత్సరం దీన్ని రూ. 75,000లకు పెంచుతున్నట్లు ఆర్థికమంత్రి ప్రకటించారు.

('ది వైర్' సౌజన్యంతో)

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

# అంచనాలు అందుకోగలమా?

తాజా బడ్జెట్‌లో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పుకోదగ్గ భారీ చర్యలేమీ ప్రకటించలేదు. అందుకు బదులు వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులను కొత్త విధానంతో బుజ్జగించే పనికి పూనుకున్నారు. అయితే ఈ విధానం ఆచరణలో ఎలావుంటుందో, దీనివల్ల కలిగే మేలేమిటో ఇంకా చూడాల్సేవుంది. మరోపక్క భారీయెత్తున పెట్టుబడుల్ని ఉపసంహరించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుని ద్రవ్య లోటును అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ వసూళ్ల మందగించిన పర్యవసానంగా ఏర్పడ్డ లోటును సహేతుకమైన 3.8 శాతానికి కట్టడి చేయడంలో ప్రభుత్వం విజయం సాధించింది. నిరుటి బడ్జెట్‌లో పెట్టుకున్న లక్ష్యంకన్నా ఇది 0.5 శాతం మాత్రమే ఎక్కువ. కానీ ఇది ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుకోవడం వల్ల (పీఎం కిసాన్ యోజన, మరికొన్ని ఇతర కార్యక్రమాల్లో నిధులు ఖర్చు చేయకపోవడంద్వారా), రిజర్వ్ బ్యాంకు తన దగ్గరున్న 'మిగులు నిధులు' బదిలీ చేయడం, జాతీయ పొదుపు నిధులనుంచి రూ. 2.4 లక్షల కోట్లు రుణం తీసుకోవడం వల్ల మాత్రమే సాధ్యమైంది. దీంతో మొత్తంగా గత సంవత్సరం స్థూల రుణాలు రూ. 7.4 లక్షల కోట్లకు పరిమితం చేయడం సాధ్యమైంది. 2020–21 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధిరేటు 10 శాతం వరకూ ఉండొచ్చని అంచనా వేశారు. కానీ పన్ను వసూళ్ల ఆదాయం ప్రాతిపదికగా ఈ అంచనా వేయడం కొత్త ప్రశ్నలను రేకెత్తిస్తోంది. ఉదాహరణకు రాగల సంవత్సరంలో స్థూలంగా పన్ను ఆదాయం రూ. 24.23 లక్షల కోట్లు ఉండొచ్చని కేంద్రం ఆశలు పెట్టుకుంది. గడిచిన సంవత్సరం ఆదాయంతో పోలిస్తే ఇది 12 శాతం అధికం. చూడటానికిది సహేతుకంగానే కనిపిస్తుంది. నిరుడు పెట్టుకున్న లక్ష్యం 18 శాతాన్ని చేరడం కష్ట మైన నేపథ్యంలో, వచ్చే ఏడాది 12 శాతం పెంపుదల లక్ష్యాన్ని అందుకోవడం కూడా కష్టమే. దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనాన్ని సరిచేయడానికి ఈ బడ్జెట్‌లో తీసుకున్న అతి పెద్ద చర్య పన్నులు తగ్గే అవకాశంవున్న నూతన ఆదాయం పన్ను వ్యవస్థను ప్రకటించడమే. ఈ కొత్త విధానం వల్ల రూ. 40,000 కోట్ల మేర ఆదాయం కోల్పోవచ్చునని ఆర్థిక మంత్రి అంచనా వేశారు. ఈ మిగులును వినియోగదారులు ఖర్చు చేస్తే డిమాండ్ పునరుద్ధరణ సాధ్యమవుతుందన్న విశ్వాసం ప్రభుత్వానికి ఉన్నట్టుంది. కానీ అలాగే జరగొచ్చునని చెప్పడం తొందరపాటవుతుంది. వివిధ మంత్రిత్వ శాఖలకు చేసిన కేటాయింపులు చెప్పుకోదగ్గ స్థాయిలో లేవు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి కూడా కలిసివున్న గ్రామీణ రంగానికి రూ. 2.83 లక్షల కోట్లు కేటాయించారు. ఇది ముగుస్తున్న సంవత్సరం కన్నా 5.5 శాతం అధికం. అలాగే విద్యా శాఖ కేటాయింపులు కూడా ఇతోధికంగా పెరిగాయి. కానీ ఇచ్చిన సొమ్మును ఖర్చు చేయకపోవడంలో ఆ శాఖ ఆరితేరింది. ఈసారి ద్రవ్య లోటు లక్ష్యం 3.5 శాతం సందేహాస్పదమైనదే. కొత్త ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం అత్యాశలా కనబడుతోంది. ప్రధానమైన ప్రభుత్వ రంగ సంస్థల్లో తన వాటాను అమ్మడం ద్వారా రూ. 2.1 లక్షల కోట్లు రాబట్టవచ్చునని సర్కారు ఆశిస్తోంది. ఇందులో రూ. 90,000 కోట్లు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా లభిస్తాయని అంచనా. అయితే ఎల్ఐసీలో పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయం రాజకీయంగా సవాళ్లను ఎదుర్కొనక తప్పదు. పన్నేతర వసూళ్ల ద్వారా వచ్చే ఆదాయం 2.16 లక్షల కోట్లకు పెరుగుతుందని నిర్మలా సీతారామన్ అంచనా వేశారు. నిజానికి నిరుడు టెలికాం సంస్థల నుంచి రూ. 59,000 కోట్లు ఆదాయం రాగా, ఈసారి అది రూ. 1,33,000 కోట్లు ఉండొచ్చన్నది అంచనా. ఇంత భారీ మొత్తం అదనంగా వస్తుందని ప్రభుత్వం భావించడానికి కారణం ఉంది. సవరించిన స్థూల రెవెన్యూ బకాయిలు చెల్లించాల్సిందేనని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల వచ్చిపడే ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ అంచనాకొచ్చినట్టు కనబడుతోంది. కానీ అలా చెల్లించాల్సివస్తే అది తమకు చావు బాజా మోగించినట్టేనని టెలికాం సంస్థల నిర్వాహకులు చెబుతున్నారు. గత సెప్టెంబర్‌లో ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇవ్వడం పేరిట ప్రభుత్వం కార్పొరేట్ పన్ను రేటును భారీగా తగ్గించింది. దీంతో కార్పొరేట్ సంస్థలకు కలిసొచ్చిన మొత్తం రూ. 1,50,000 కోట్లు. కానీ వృద్ధి రేటుకు తోడ్పడిందేమీ లేదు. బడ్జెట్ ముగింపులో ఆమె వినియోగ, పారిశ్రామిక వస్తువులపై పన్నుల మోత మోగించారు (మొత్తం 22 వస్తువులపై 2.5 నుంచి 70 శాతం వరకూ ఈ పెంపుదలలున్నాయి). వీటన్నిటి ద్వారా ఎక్సైజ్ సుంకాల రూపంలో ప్రభుత్వానికి రూ. 20,000 కోట్ల ఆదాయం లభిస్తుంది. ఇది తప్పుడు సంకేతం పంపుతుందా? అదే జరిగే అవకాశంవుంది. అయితే ప్రభుత్వం లెక్క చేస్తుందా లేదా అన్నది చూడాలి. మొత్తానికి అటు ప్రైవేటు మదుపునుగానీ, ఇటు వినిమయాన్నిగానీ భారీగా పెంచే నిర్దిష్టమైన చర్యలు ఈ బడ్జెట్‌లో లేవు. ఏతావాతా దేశ ఆర్థిక వ్యవస్థ మదుపు భారాన్ని తానే మోసే పాత్రను ప్రభుత్వం కొనసాగించకతప్పదని దీన్ని చూస్తే అర్థమవుతుంది.

అభిప్రాయం


అనూజ్ శ్రీనివాస్

('ది వైర్' సౌజన్యంతో)

వ్యాసకర్త ఆర్థిక వ్యవహారాల నిపుణుడు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా

### నవ భారత్



"ఈ కొత్త దశాబ్దంలో భారత్.. నవ భారత్‌గా మారడానికి ఈ బడ్జెట్ పునాది వేసింది. కిసాన్ రైలు, కృషి ఉడాన్ వంటివి రైతుల అభివృద్ధికి దోహదపడతాయి"

– దేవేంద్ర ఫడ్నవీస్, బీజేపీ నేత

### కోత



"ఆహార సబ్సిడీలో ఇంత కోతా? 2019-20లో రూ.1.84లక్షల కోట్లు కేటాయించగా, రూ.1.08లక్షల కోట్లు ఖర్చు చేశారు. 2020-21 బడ్జెట్‌లో కేవలం రూ.1.15లక్షల కోట్లు మాత్రమే కేటాయించారు. ఏం జరుగుతోంది? ఎఫ్‌సీఐకి ఏమవుతుంది? ప్రజా పంపిణీ వ్యవస్థ భవిష్యత్తేంటి?'

– దీపా సిన్హా, ప్రొఫెసర్

### పన్ను



"వ్యక్తిగత ఆదాయ పన్ను మూడు దశాబ్దాల్లో లేనంతగా 42.7శాతం పెంచారు. డివిడెండ్లపై సైతం 42.7శాతం వరకూ ఇప్పుడు పన్ను పెంచారు. మన దేశపు పన్ను విధానం ఇంత సంక్లిష్టంగా, గందరగోళంగా ఎప్పుడూ లేదు"

– పారింజు వెలియత్, పోర్ట్ ఫోలియో మేనేజర్


### ప్రింట్



"న్యూస్ ప్రింట్ మీద దిగుమతి సుంకాన్ని 10 నుంచి 5శాతానికి తగ్గించారు. ప్రింట్ మీడియా సంక్షోభంలో ఉన్నందునే ఈ చర్య తీసుకున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు"

– సోమేష్ ఝా, జర్నలిస్ట్


### దారు



"బడ్జెట్ సెషన్ 2020 సంగతి సరే, రెండు బాటిళ్ల డ్యూటీ ఫ్రీ మద్యంకు ఏమైంది? అది ముఖ్యమైనది"

– అతుల్ ఖత్రీ, కమెడియన్

### దీర్ఘకాలం



"అంటే, ఈ తక్కువ పన్ను రేట్లు అనేవి మనం 80సీ, 80డీ, హెచ్ఆర్ఏ మినహాయింపులను వినియోగించుకోనట్టయితేనే వర్తిస్తాయి. మరి, దీనివల్ల ఉపయోగం ఏంటి? దీర్ఘకాల ప్రయోజనం ఏమైనా ఉందా?"

– జెబా వర్సీ, జర్నలిస్ట్

### సెన్సెక్స్



"వెయ్యి పాయింట్లకు పైగా కోల్పోయింది సెన్సెక్స్. బడ్జెట్ తర్వాత స్టాక్ మార్కెట్లు ఇలా ఎప్పుడూ పతనం కాలేదు. అభివృద్ధి పునరుద్ధరణకు కేంద్ర విధానంగానీ, దృక్పథంగానీ బడ్జెట్‌లో లేదు"


– ఎం.కె.వేణు, జర్నలిస్ట్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083



## ఆ 5 చారిత్రక ప్రాంతాలు ఇకపై ప్రదర్శనశాలలు

కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెరిటేజ్, కన్జర్వే షన్'ను ఏర్పాటు చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ సంస్థకు డీమ్డ్ యూనివర్సిటీ హోదా కల్పించనున్నారు. 2020–21 బడ్జెట్‌లో కేంద్ర సాంస్కృతిక శాఖకు రూ.3,150 కోట్లు, పర్యాటక శాఖకు రూ.2,500 కోట్లు కేటాయించారు. దేశంలో కొత్తగా 8 ప్రదర్శనశాలలు(మ్యూజియమ్స్) ఏర్పాటు చేస్తామన్నారు. కొత్త మ్యూజియాలకు రూ.109 కోట్లు, ప్రస్తుతమున్నవాటి అభివృద్ధికి రూ.180 కోట్లు కేటాయించారు. దేశంలో వివిధ రాష్ట్రంలో ఉన్న ఐదు చారిత్రక ప్రదేశాలను ప్రదర్శనశాలలుగా(ఆన్‌సైట్ మ్యూజియమ్స్) అభివృద్ధి చేయనున్నారు. హరియాణాలోని రాఖీగార్హీ, ఉత్తరప్రదేశ్‌లోని హస్తినాపురం, అస్సాంలోని శివసాగర్, గుజరాత్‌లోని డోలావిరా, తమిళనాడులోని అడిచనల్లూరును అత్యుత్తమ ప్రదర్శనశాలలుగా మారుస్తామని చెప్పారు. ప్రాచీన కాలంలో భారత ఉపఖండంలో మహోజ్వలంగా వెలుగొందిన హరప్పా నాగరికతకు చెందిన ఐదు గొప్ప నగరాల్లో రాఖీగార్హీ ఒకటి. మహాభారత కాలంలో హస్తినాపురం ఒక వెలుగు వెలిగింది. 1699 నుంచి 1788 వరకూ అహోమ్ సామ్రాజ్య రాజధాని శివసాగర్. హరప్పా నాగరికతలో డోలావిరాకు ప్రముఖ స్థానం ఉంది. దక్షిణ భారతదేశంలో ప్రాచీన కాలంలో అచినల్లూరులో గొప్ప నాగరికత విలసిల్లింది. ఇక్కడ నిర్వహించిన తవ్వకాల్లో ఇనుప ఆయుధాలు, బంగారం, ఇత్తడి నగలు, రాళ్లతో చేసిన పూసలు వెలుగు చూశాయి.





# అంతా బాగుండాలి.. అందులో మీరూ ఉండాలి!

## బడ్జెట్ 'రచ్చ'బండలో సీతారామన్ బాణాలు

అదిగో... అదిగో..! అందరూ వచ్చేశారా!! ప్రతిసారీ ఈ రోజున మనం ఎక్కడో ఓ చోట కలుసుకుంటూనే ఉన్నాం. ఈసారి ఈ రచ్చబండ దగ్గర!!. ఎన్నో కోరికలు కోరి... అవి తీరుతాయన్న ఆశతో మీరిలా రావటం... అన్నీ సాధ్యం కాకున్నా కొన్నిటినైనా నెరవేర్చడానికి నేను ప్రయత్నించటం కొత్తేమీ కాదుగా!!. ఈసారి మన ఊరి పరిస్థితులు అంత బాగాలేవు. ఆదాయానికి, ఖర్చులకు మధ్య లంకె కుదరటం లేదు. ధరలు పెరుగుతున్నాయి. వాటి మాదిరే అప్పులు కూడా!!. అలాగని ఖర్చులు మానుకోలేం కదా? మీరంతా బాగుండాలని నా ప్రయత్నమైతే నేను చేశా.. ఇదిగో చెబుతా వినండి!!.





### రైతన్నా... నేనున్నా

నీకు విత్తులేసే నాటికి చేతిలో పైకం ఉండాలి. బ్యాంకులకు చెప్పాంలే!! దండిగా రుణాలివ్వమని. ఓ రెండేళ్లలో నీ చేతిలోకి రెండింతల సొమ్ము వచ్చేలా చేయాలన్నదే నా కల. అందుకోసమే ఇదంతా!!. మీరు సోలార్ పంపుసెట్టు పెట్టుకోండి. దానిక్కాస్త డబ్బులిస్తాం. అంతేకాదు!! పంటతో పాటు కరెంటూ పండించండి!!. ఆ కరెంటును మేం కొని డబ్బులిస్తాం. నీటి కష్టాలు లేకుండా చేస్తాం. మరి మీరు కూడా నీళ్లు, ఎరువులు తక్కువ వాడాలి సుమా!. మీరు పండించే వస్తువులు పాడైపోకుండా రవాణా చెయ్యటానికి కోల్డ్ స్టోరేజీ రైళ్లు మరిన్ని తేవటానికి ప్రయత్నిస్తాం. మీ రైతాంగానికిచ్చే నిధులు కూడా భారీగానే పెంచాంలే!!.

### నేను సీతయితే... నువ్వు లక్ష్మి మరి



స్వయం సహాయక సంఘాల్లోని మహిళలంటే ధన లక్ష్ములే కాదు! ధాన్య లక్ష్ములూ కావాలి!!. అందుకే విత్తనాలు నిల్వ చేయండి. స్టోరేజీలకు కావాల్సిన అప్పులు మేం ఇప్పిస్తాం. గిడ్డంగులూ మేమే కట్టిస్తాం. మీ పంట ఉత్పత్తుల్ని ఇతర ప్రాంతాలకే కాదు... విదేశాలకూ పంపించొచ్చు. ఆడపిల్లల పెళ్లికి కనీస వయసు పెంచాలని ఉంది. దానికోసం ఓ టాస్క్‌ఫోర్స్ పెడతాం. అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లు కూడా ఇస్తున్నాం.



### పన్ను తగ్గింపు కావాలా.. నాయనా!!

మీ ఉద్యోగులెప్పుడూ ఇంతే! పన్ను రేట్లు తగ్గించండని అడుగుతూనే ఉంటారు!!. అదెలా కుదురుతుంది? మీరు పన్నులు కడితేనేగా ఊరికి ఆదాయం వచ్చేది. అయినా సరే... మీరు అడుగుతున్నారు కనక ఏదోకటి చేశాలే!!. మీలో కొందరేమో పొదుపరులు. కొందరేమో వచ్చింది వచ్చినట్లే ఖర్చుపెట్టేస్తారు. అందుకే.. మీ ఇద్దరినీ వేరు చేసి మీకు తగ్గ పన్ను విధానాలు తెచ్చాను. మీరు పొదుపు చేసుకుంటే మీకు మునుపటిలానే పన్ను ఎలాగూ కాస్త మినహాయిస్తాం. ఖర్చు పెట్టేవాళ్లకు మినహాయింపులుండవు కనక పన్ను రేట్లు తగ్గించాం. ఇది ఎవరికి లాభమని మాత్రం నన్ను అడక్కండి. మాక్కూడా లాభం ఉండాలిగా!!.

### సురక్షితంగా దాచుకోండి... బ్యాంకుల్లో



పాపం! బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తారు కానీ మీ భయం మీకుంటుంది!!. ఏ బ్యాంకు ఎప్పుడు బిచాణా ఎత్తేస్తుందో తెలీదు. అందుకే... ఇకపై మీరు చేసే డిపాజిట్లకు రూ.5 లక్షలవరకూ బీమా ఉండేలా చూస్తాం. ఇప్పటిదాకా ఇది లక్ష రూపాయలే కదా!!. అలాగని మీరు చేసే డిపాజిట్లన్నిటికీ 5 లక్షల చొప్పున గ్యారంటీ ఉంటుందనుకోకండి. మీరు ఎన్ని బ్యాంకుల్లో ఎన్ని డిపాజిట్లు చేసినా... ఒక మనిషికి రూ.5 లక్షల వరకే బీమా ఉంటుంది. అది కాస్తా చూసుకోండి!!.

### చిన్న కంపెనీకి... చింతలుండవు

మరీ పెద్ద కంపెనీలు కాదుగానీ... సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీలన్నిటికీ ఇది మంచి వార్తే లెండి!!. మీ టర్నోవర్ రూ.5 కోట్ల లోపుంటే మీకు ఆడిటింగ్ అవసరం లేదు. ఇపుడు కోటిదాటితే ఆడిట్ చేయాల్సి వస్తోంది కదా? దీన్ని సవరించాం. ఎందుకంటే ఎకానమీ బాగుండాలంటే మీరే ముందుండి నడిపించాలి. మీకు తక్కువ వడ్డీ రేటుండే రుణాలివ్వటానికి (సబార్డినేట్) కూడా మరో పథకం తెస్తున్నాం. మీకు రుణ పునరుద్ధరణ సదుపాయ విండోను 2021 మార్చి వరకు కొనసాగించాలని ఆర్‌బీఐని అడిగాం. రేపో మాపో ఊ కొడుతుంది లెండి!!.

### విద్యార్థులూ... టూరిస్టులూ



రవాణా ఎంత ముఖ్యమో మీకు తెలుసు? కొత్త హైస్పీడ్ రైళ్లు... 100 కొత్త ఎయిర్‌పోర్ట్‌లూ తెస్తాం. ఢిల్లీ–ముంబై ఎక్స్‌ప్రెస్ వే పూర్తి చేస్తాం. హరియాణా, గుజరాత్, తమిళనాడు, అసోం సహా ఐదు చారిత్రక ప్రాంతాలతో పాటు రాంచీలో ట్రైబల్ మ్యూజియం, అహ్మదాబాద్‌లో మ్యారిటైమ్ మ్యూజియం కడతాం. ఎంచక్కా మీరు వెళ్లి చూడొచ్చు. విద్యారంగంలో విదేశీ పెట్టుబడులొస్తాయి. 150 యూనివర్సిటీల్లో కొత్త స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు పెడతాం. జిల్లా ఆసుపత్రులన్నీ మెడికల్ కాలేజీలుగా మారుస్తాం.

### కార్పొరేట్లూ... ఇంకా ఎంత తగ్గిస్తాం?

బడ్జెట్ కోసం మీరు ఎదురు చూడటమే సరికాదు. ఎందుకంటే మొన్నేగా మీ పన్ను తగ్గించింది!!. అసలు ప్రపంచం మొత్తమ్మీద కంపెనీలకు తక్కువ పన్నులున్నది ఇక్కడే తెలుసా? ఇంకా ఎంత తగ్గిస్తాం చెప్పండి!!. మీరిప్పుడు డివిడెండ్లు ఇస్తూ... వాటిపైనా పన్ను చెల్లించాల్సి వస్తోంది కదా? దాన్ని... అదే డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ పన్ను తీసేస్తున్నాం లెండి. కాకపోతే ఇకమీదట డివిడెండ్ తీసుకునే వాళ్ళు పన్ను కడతారు. ఇద్దరూ కట్టకపోతే ఎలా చెప్పండి?



### ఎగుమతిదారులూ.. మీకో పథకం

ఎగుమతులు తగ్గాయని మీకూ తెలుసు!. డిసెంబర్ దాకా ఐదునెలలు వరసగా తగ్గుతూనే వచ్చాయి. డిసెంబర్‌లో 1.8 శాతం తగ్గి 27.36 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అందుకే మీరు చెల్లించే సుంకాలు, పన్నుల్ని రీయింబర్స్ చెయ్యడానికి ఒక పథకం తెస్తున్నాం. వ్యాట్, విద్యుత్ సుంకాలు, రవాణా ఇంధనాల వ్యయాలు రీయింబర్స్ చేస్తాం. ప్రతి జిల్లానూ ఎగుమతి హబ్‌గా చేసేందుకు కేంద్రం, రాష్ట్రాలు కలిసి పని చేస్తున్నాయి.




### అన్ని కంపెనీలకూ అంతో ఇంతో...



రవాణా మౌలిక సదుపాయాలకు రూ.1.7 లక్షల కోట్లు కేటాయించాం. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, సెమీ కండక్టర్ల తయారీని ప్రోత్సహించాలని భావిస్తున్నాం. భారత్ నెట్‌ను మరింత అభివృద్ధి చేసి గ్రామాలకు బ్రాడ్ బ్యాండ్‌ను అందుబాటులోకి తెస్తాం. విద్యకు రూ.99,300 కోట్లు కేటాయించాం. ఆన్‌లైన్ విద్యను ప్రోత్సహిస్తాం. డేటా సెంటర్ పార్కుల ఏర్పాటుకు ప్రైవేటు రంగాన్ని అనుమతిస్తాం. జాతీయ గ్యాస్ గ్రిడ్‌ను 16,200 కి.మీ. నుంచి 27,000 కిలోమీటర్లకు విస్తరిస్తాం. ఇవన్నీ చిన్న విషయాలా? ఈ రంగాల్లోని కంపెనీల చరిత్రే మారిపోతుంది. చూస్తూ ఉండండి!!.



## ఇదీ బడ్జెట్ సమగ్ర స్వరూపం (అంకెలు రూ.కోట్లలో)

బడ్జెట్ 2020

| | 2018-2019 వాస్తవ కేటాయింపులు | 2019-2020 బడ్జెట్ అంచనాలు | 2019-2020 సవరించిన అంచనాలు | 2020-2021 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| 1. రెవెన్యూ వసూళ్లు(2+3) | 15,52,916 | 19,62,761 | 18,50,101 | 20,20,926 |
| 2. పన్ను ఆదాయం | 13,17,211 | 16,49,582 | 15,04,587 | 16,35,909 |
| 3. పన్నేతర ఆదాయం | 2,35,705 | 3,13,179 | 3,45,514 | 3,85,017 |
| 4. మూలధన వసూళ్లు (5+6+7) | 7,62,197 | 8,23,588 | 8,48,451 | 10,21,304 |
| 5. రుణాల రికవరీ | 18,052 | 14,828 | 16,605 | 14,967 |
| 6. ఇతర వసూళ్లు | 94,727 | 1,05,000 | 65,000 | 2,10,000 |
| 7. అప్పులు, ఇతరత్రా వసూళ్లు | 6,49,418 | 7,03,760 | 7,66,846 | 7,96,337 |
| 8. మొత్తం వసూళ్లు (1+4) | 23,15,113 | 27,86,349 | 26,98,552 | 30,42,230 |
| 9. పథకాలుకాక ఇతర వ్యయం (10+13) | 23,15,113 | 27,86,349 | 26,98,552 | 30,42,230 |
| 10. రెవెన్యూ ఖాతా | 20,07,399 | 24,47,780 | 23,49,645 | 26,30,145 |
| 11. వడ్డీ చెల్లింపులు | 5,82,648 | 6,60,471 | 6,25,105 | 7,08,203 |
| 12. మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంట్లు | 1,91,781 | 2,07,333 | 1,91,737 | 2,06,500 |
| 13. మూలధన ఖాతా | 3,07,714 | 3,38,569 | 3,48,907 | 4,12,085 |
| 14. రెవెన్యూ లోటు (10–1) | 4,54,483 | 4,85,019 | 4,99,544 | 6,09,219 |
| 15. నికర రెవెన్యూలోటు (14–12) | 2,62,702 | 2,77,686 | 3,07,807 | 4,02,719 |
| 16. ద్రవ్య లోటు {9–(1+5+6)} | 6,49,418 | 7,03,760 | 7,66,846 | 7,96,337 |
| 17. ప్రాథమిక లోటు (16–11) | 66,770 | 43,289 | 1,41,741 | 88,134 |

## కాలుష్యకారక థర్మల్ ప్లాంట్ల మూత

- స్వచ్ఛమైన గాలికోసం రూ. 4,400 కోట్ల కేటాయింపు
- రైతులు సోలార్ విద్యుత్ అమ్మే విధంగా కొత్త ప్రతిపాదన



**న్యూఢిల్లీ:** వాయు కాలుష్యాన్ని నివారించేందుకు, గాలిలో స్వచ్ఛతను కాపాడేందుకు బడ్జెట్‌లో పర్యావరణ మంత్రిత్వ శాఖకు రూ. 4,400 కోట్లను కేంద్రం కేటాయించింది. దీనిలో భాగంగా పాతబడిన, కర్బన ఉద్గారాల నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా ఉండని థర్మల్ విద్యుదుత్పత్తి ప్లాంట్లను మూసేయనున్నట్లు నిర్మలా సీతారామన్ చెప్పారు. ఆ ప్లాంట్ల భూమిని వేరే అవసరాలకు వాడనున్నారు. డీజిల్, కిరోసిన్‌తో పనిలేని వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి, రైతులు సౌర విద్యుత్‌వైపు మొగ్గుచూపడానికి 'పీఎం కుసుమ్' పథకాన్ని విస్తరిస్తున్నట్లు చెప్పారు. దేశంలో రైతులు 35 లక్షల సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామన్నారు. దీనిలో 20 లక్షల మంది రైతులు సొంతంగా సోలార్ పంప్‌లను ఏర్పాటు చేసుకునేందుకు, మరో 15 లక్షల మందిని గ్రిడ్‌కు అనుసంధానం చేసేందుకు సహాయం చేస్తామన్నారు. తమ నిరుపయోగ భూమిలో రైతులు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి, గ్రిడ్‌కు అమ్మే పథకాన్ని మంత్రి ప్రతిపాదించారు.

### కొత్త విద్యుత్ ప్రాజెక్టులకు ఊతం


పవర్, పునరుత్పాదక ఇంధన రంగానికి ఈ బడ్జెట్‌లో రూ. 22,000 కోట్లు కేటాయించారు. కొత్త విద్యుత్ ప్రాజెక్టులకు కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు రూపంలో ప్రోత్సాహకాన్ని సమకూర్చుతామన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన దేశీయ ఉత్పత్తి సంస్థలకు 15 శాతం కార్పొరేట్ ట్యాక్స్ మినహాయింపు ఇచ్చే నిబంధనలను గత సెప్టెంబర్‌లో తెచ్చామని, దీనిని కొత్త విద్యుత్ ప్లాంట్లకు విస్తరిస్తున్నామన్నారు. '10 లక్షలు దాటిన జనాభా ఉన్న పెద్ద పట్టణాల్లో స్వచ్ఛమైన గాలి లభ్యత కష్టం. పెద్ద పట్టణాల్లో వాయు కాలుష్యాన్ని నివారించేందుకు ప్రణాళికలు రూపొందించే రాష్ట్రాలను ప్రోత్సహించాలని కేంద్రం భావిస్తోంది. దీనికి సంబంధించిన ప్రమాణాలను ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్స్, క్లైమేట్ చేంజ్ మంత్రిత్వ శాఖ రూపొందిస్తుంది' అని నిర్మల తెలిపారు.

### స్మార్ట్ విద్యుత్ మీటర్లు

సంప్రదాయ విద్యుత్ మీటర్లను ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లుగా వచ్చే మూడేళ్లలో మార్చాలని రాష్ట్రాలను నిర్మల కోరారు. దీనివల్ల తమకు నచ్చిన సరఫరాదారును, రేట్లను నిర్ణయించుకునే స్వేచ్ఛ వినియోగదారులకు వస్తుందని ఆమె తెలిపారు.

## పెరిగేవి.. తగ్గేవి!

ఎక్సైజ్ డ్యూటీని పెంచడంతో సిగరెట్లు, హుక్కా, జర్దా తదితర పొగాకు ఉత్పత్తులు ఖరీదు కానున్నాయి. ఈ బాటలో సుంకాలు పెంచడంతో విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వంట నూనెలు, ఫ్యాన్లు, టేబుళ్లు, ఫుట్‌వేర్, ఎలక్ట్రిక్ వాహనాలు, టేబుల్‌వేర్, కిచెన్ వేర్, బొమ్మలు, ఫర్నిచర్ తదితర ఇంపోర్టెడ్ వస్తువుల ధరలు పెరగనున్నాయి. ఈ జాబితాలో దిగుమతి చేసుకునే బటర్ నెయ్యి, పీనట్ బటర్, చ్యూయింగ్ గమ్, షెల్‌తో ఉన్న వాల్‌నట్స్, సోయా ప్రొటీన్ చేరాయి. దిగుమతయ్యే ఫుట్‌వేర్, షేవర్స్, వాటర్ ఫిల్టర్,



గ్లాస్‌వేర్, పింగాణీ పాత్రలు, జెమ్ స్టోన్స్, వాటర్ హీటర్లు, హెయిర్ డయ్యర్స్, ఎలక్ట్రిక్ ఐరన్స్, ఒవెన్స్, కుకర్స్, గ్రైండర్స్, కాఫీ, టీ మేకర్స్ ధరలు పెరగనున్నాయి. దిగుమతి చేసుకునే పీసీబీలు, మొబైల్ ఫోన్లు, డిస్‌ప్లే ప్యానళ్లు, మొబైల్స్‌లో వినియోగించే ఫింగర్‌ప్రింట్ రీడర్లు, ల్యాంపులు, లైటింగ్ ఫిట్టింగ్స్, స్టేషనరీ వస్తువుల ధరలు సైతం పెరగనున్నాయి. బడ్జెట్‌లో కస్టమ్స్ డ్యూటీ తగ్గించడంతో దిగుమతి చేసుకునే న్యూస్‌ప్రింట్, క్రీడా పరికరాలు, మైక్రోఫోన్, ఎలక్ట్రిక్ వాహనాల ధరలు చౌక కానున్నాయి.






## సంపద సృష్టికర్తలకు సముచిత గౌరవం



**న్యూఢిల్లీ:** సంపద సృష్టికర్తలకు దేశంలో కచ్చితంగా సముచిత గౌరవం దక్కుతుందని, ఈ దిశగానే చర్యలు తీసుకుంటున్నామని నిర్మలా సీతారామన్ చెప్పారు. పన్ను చెల్లింపుదారులు, పాలనా వ్యవస్థకు మధ్య విశ్వాసాన్ని నెలకొల్పేలా కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు ప్రత్యేకంగా ట్యాక్స్‌పేయర్ చార్టర్‌ను పాటిస్తుందన్నారు. ఈ దిశగా ఆదాయ పన్ను చట్టానికి సవరణలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులు వేధింపులు ఎదుర్కొనే పరిస్థితి లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ట్యాక్స్‌పేయర్ల హక్కుల గురించి స్పష్టత ఉంటేనే వారికి, పాలనా వ్యవస్థకు మధ్య నమ్మకం ఉంటుందన్నారు.

## పీఎం సెక్యూరిటీ @ రూ. 600 కోట్లు

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీకి భద్రత కల్పించే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) బడ్జెట్ రూ.600 కోట్లకు చేరుకుంది. 2020–21లో ఈ మేరకు కేటాయింపులు జరిపారు. గత సంవత్సరం ఈ బడ్జెట్ రూ.540 కోట్లుగా, అంతకుముందు రూ.420 కోట్లుగా ఉంది. ప్రస్తుతం దేశంలో దాదాపు 3000లకుపైగా స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) సభ్యులతో రక్షణపొందుతున్న వ్యక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక్కరే. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకా, రాబర్ట్ వాద్రాలకు గత నవంబరులో కేంద్రం ఎస్పీజీ భద్రతను ఉపసంహరించిన విషయం తెలిసిందే. ఆగస్టులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు అంతకుముందు మాజీ ప్రధానులు హెచ్.డి. దేవేగౌడ, వీపీసింగ్‌లకు కేంద్రం ఎస్పీజీ సెక్యూరిటీని ప్రభుత్వం తొలగించింది.






# చేనుకు పోదాం.. చలో!

టీవీ సెట్టు... అసెట్టా... లైబిలిటీయా?



"మనింట్లో టీవీ ఉంది. అది అసెట్టా, లైబిలిటీయా" అడిగాడు యుగంధర్.

ద ఫేమస్ డిటెక్టివ్ యుగంధర్‌లాగా మనవాడిదీ చాలా లాజికల్ బ్రెయిన్ కాబట్టి మొదట కాస్తంత కన్ఫ్యూజ్ అయినా టీవీ అనేది మన ఆస్తి. మనకు జమ అయిన సంపత్తి. కాబట్టి అసెట్టే" అని జవాబిచ్చా.

"తప్పు"

"మరి?"

"అందులో నువ్వు ఏ ప్రోగ్రామ్ చూస్తావనేదానిపై ఆ విషయం ఆధారపడి ఉంటుంది"

"అదెలా?" అడిగా.

"మన బడ్జెటు సీజన్‌లో నీకు ఎకన మిక్స్ భాషలో చెబుతా విను. మన అసెట్టు అనుకున్న అయిన టీవీలో నరాలను ఉత్కంఠపరిచే ప్రోగ్రాములూ, బీపీని పెంచేసే పొలిటికల్ డిబేట్లూ చూశావనుకో. నెలలో కనీసం రూ.వెయ్యి బీపీ మందులు కొనుక్కోవాలి. అంటే... మనం కట్టే కేబుల్ బిల్‌కు ఈ రూ. వెయ్యి జీఎస్టీ అన్న మాట. ఇంకో ఉదాహరణ చెబుతా విను. మన జేబులో సిగరెట్ పెట్టెలాంటిదే నట్టింట్లో టీవీ డబ్బా. మనం డబ్బు పెట్టి కొనుక్కున్న మన ఆస్తి అయిన సిగరెట్లు కాల్చగానే మన ఆరోగం కూడా తగలడిపోతుంది. అందుకే మనమెప్పుడూ ఎలాంటి ప్రోగ్రాములు చూడాలంటే... అవి చూడగానే మనం హాయిగా నవ్వుకోవాలి. దాంతో బీపీలాంటివి తగ్గిపోతాయి. నీకు మరీ అంతగా పొలిటికల్ ప్రోగ్రాములే చూడాలనిపించిందనుకో. అప్పుడు ఏ లోకేశ్ పొలిటికల్ స్పీచులో చూడొచ్చు. అంతగా కావాలంటే బాలకృష్ణ ప్రెస్‌మీట్లూ స్ట్రెస్ బస్టర్‌లా పనిచేస్తాయి. కాబట్టి నువ్వు ఆస్తి అనుకున్న టీవీ నిజంగానే నీకు అసెట్టులాగే పనిచేయాలంటే...అందులోని ప్రోగ్రామ్ మీద ఆధారపడి ఉంటుంది. మన బడ్జెట్‌లో 'రూపాయ రాక... రూపాయి పోక' అనే పట్టిక ఉంటుంది చూశావా... అచ్చం అలాగే మన టీవీ వల్ల 'ఆరోగ్యం రాక... ఆరోగ్యం పోక' అనేదానిపై మన హెల్త్ బ్యాలన్స్‌షీట్ ఆధారపడి ఉంటుందన్నమాట"

"నిజంగానే నువ్వు యుగంధర్ అంతటివాడివిరా. కాకపోతే... ఆయన డిటెక్టివ్. నువ్వు డిఫెక్టివ్. మరీ మాట్లాడితే... మాటలతో మోసపుచ్చే డిసెప్టివ్" మెచ్చుకోలుగా కితాబిచ్చాను నేను.

## రెస్టారెంట్ కష్టమే



**బ**డ్జెట్‌కు ముందు రోజు 'ఆర్థిక సర్వే' వస్తుంది. బడ్జెట్ ఎలా ఉండబోతోందో ఊహించడానికి ఒక అంచనాకు ఆ సర్వే పనికొస్తుంది. కొన్ని ఆసక్తికరమైన సంగతులు కూడా తెలుస్తాయి. అలాంటిదే ఈ సంగతి కూడా. చైనా, సింగపూర్ వంటి దేశాలలో ఒక రెస్టారెంట్ పెట్టాలంటే నాలుగు అనుమతి పత్రాలు ఉంటే చాలు. అదే ఇండియాలో కనీసం 26 పత్రాలు కావాలి. ఢిల్లీలో అయితే వీటితో పాటు అదనంగా 'పోలీస్ ఈటింగ్ హౌస్ లైసెన్స్' ఉండాలి. ఈ లైసెన్స్ పొందడానికి మళ్లీ 45 చోట్లకు తిరిగి సంతకాలు చేయించుకోవాలి. దీనికన్నా తుపాకీ లైసెన్స్ సంపాదించడం తేలిక. ఓ 19 పత్రాలు పూర్తి చేసి ఇస్తే చేతికి గన్ వచ్చేస్తుంది. ఆర్థిక సర్వే చేసిన ఆ వ్యాఖ్యానంలో.. 'ఎవరైనా రెస్టారెంట్ పెట్టాలని ఉత్సాహపడుతుంటే వాళ్ల ప్రయత్నాలను మీ పత్రాలతో అడ్డుకోకండి' అని చెప్పడం అసలు ఉద్దేశం కావచ్చు.



**అన్నదాతలకు 2022 నాటికి రెట్టింపు ఆదాయం**

**2020-21 బడ్జెట్‌లో సాగుకు కేటాయింపులు రూ.1.6 లక్షల కోట్లు**

**న్యూఢిల్లీ:** రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేసేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధన కోసం 16 అంశాలతో కూడిన ప్రణాళికలను సిద్ధం చేశామని, రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు చూపడం, ఉత్పత్తులను అమ్ముకునేందుకు వీలుగా తగిన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్నది తమ ఉద్దేశమని వెల్లడించారు. 2020–21 ఆర్థిక సంవత్సరానికి గాను వ్యవసాయం కోసం బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల ద్వారా రూ.15 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. అందులో వ్యవసాయ రంగానికి రూ.1.6 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గతేడాది రుణ పరిమితి రూ.12 లక్షల కోట్లు మాత్రమే కాగా.. ఈ ఏడాది లక్ష్యం రూ.13.5 లక్షల కోట్లు. వ్యవసాయ, అనుబంధ, సాగునీటి వ్యవస్థల కోసం ఈ మొత్తాన్ని వినియోగిస్తారని, గ్రామీణాభివృద్ధి కోసం మరో రూ.1.23 లక్షల కోట్లు కేటాయిస్తున్నామని మంత్రి వివరించారు.

## పీఎం-కిసాన్ యోజనకు తగ్గిన కేటాయింపులు

రైతులకు ఏటా మూడు దశలుగా మొత్తం రూ.6 వేలు చెల్లించేందుకు ఉద్దేశించిన పీఎం కిసాన్ పథకానికి ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గాయి. గతేడాది ఈ పథకం కోసం దాదాపు రూ.75 వేల కోట్లు కేటాయించారు. అయితే ఈ పథకం అమల్లో కొన్ని రాష్ట్రాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తాజా బడ్జెట్‌లో రూ.54,300 కోట్లు మాత్రమే కేటాయించారు. అయితే కేటాయింపులు తగ్గినా రానున్న ఆర్థిక సంవత్సరపు అంచనాలను మాత్రం రూ.75 వేల కోట్లుగానే పెట్టడం గమనార్హం. గతేడాది ప్రవేశపెట్టిన ఈ పథకం కింద ఇప్పటివరకు సుమారు 8 కోట్ల మంది రైతులకు రూ.43,000 కోట్లు పంపిణీ చేయగా.. పశ్చిమ బెంగాల్‌లో ఈ పథకాన్ని అమలు చేయలేదు. కొన్ని ఇతర రాష్ట్రాల్లో రైతులకు సంబంధించి సరైన సమాచారం లేదని, ఫలితంగా ఈ ఏడాది ఈ పథకం సవరించిన అంచనాలను కూడా కేంద్రం తగ్గించింది. ఈ పథకం లబ్ధిదారుల సంఖ్య గతంలో 14.5 కోట్లు కాగా.. తాజా అంచనాల ప్రకారం 14 కోట్ల మందికి మాత్రమే లబ్ధి చేకూరనుంది.

## మత్స్య ఉత్పత్తులపైనా ప్రత్యేక శ్రద్ధ..



2020 – 23 మధ్యకాలంలో మత్స్య ఉత్పత్తులను 200 లక్షల టన్నులకు పెంచేందుకు, 2024–25 నాటికి రూ.లక్ష కోట్ల విలువైన మత్స్య సంపదను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. నీలి ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడంలో భాగంగా నాచు, సముద్రపు కలుపు, ప్రత్యేక నిర్మాణాల్లో చేపల పెంపకాలకూ ఊతమిస్తామని చెప్పారు. దేశవ్యాప్తంగా 3,477 మంది సాగర్ మిత్రలు, 500 ఫిష్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్లను ఏర్పాటు చేస్తామని, తద్వారా సముద్ర, జల ఉత్పత్తుల సమర్థ మార్కెటింగ్, గ్రామీణ యువతకు ఉపాధికల్పన సాధ్యమవుతుందని వివరించారు. సముద్ర మత్స్య సంపదను వృద్ధి చేసేందుకు, పరిరక్షించేందుకు, నియంత్రించేందుకు కేంద్రం కొన్ని నిబంధనలను సిద్ధం చేస్తోందని తెలిపారు. పాడిపశువులకు వచ్చే గాలికుంటుతో పాటు గొర్రెలు, మేకలకు వచ్చే పీపీఆర్ వంటి వ్యాధులను 2025కల్లా దేశంలో లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పశుగ్రాసం పెంపకం పనులకూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

## ప్రత్యామ్నాయ మార్గాలివీ..

'రైతులను విద్యుదుత్పత్తిదారులుగా మార్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుమ్) కార్యక్రమం కింద 20 లక్షల మంది రైతులు సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేసుకునేందుకు సాయం అందిస్తాం. మరో 15 లక్షల మంది రైతులు ఏర్పాటు చేసుకునే సోలార్ పంపుసెట్ల నుంచి నెట్‌మీటరింగ్ పద్ధతి ద్వారా జాతీయ గ్రిడ్‌కు విద్యుత్తు సరఫరా చేసేందుకు అవకాశం కల్పిస్తాం. తద్వారా రైతులు కొంత అదనపు ఆదాయం సంపాదించుకునే అవకాశం ఏర్పడుతుంది. అంతేకాకుండా.. బీడు భూముల్లో, వ్యవసాయ యోగ్యం కాని భూముల్లో సోలార్ విద్యుదుత్పత్తి చేసుకునేందుకూ రైతులకు అవకాశం కల్పిస్తాం' అని నిర్మలా సీతారామన్ తెలిపారు. వ్యవసాయ భూమి లీజింగ్, మార్కెటింగ్, కాంట్రాక్ట్ ఫార్మింగ్ విషయాల్లో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాలను అమలు చేసే రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. దేశవ్యాప్తంగా సాగునీటి లభ్యతపై ఒత్తిడి ఉన్న వంద జిల్లాలను గుర్తించి సమస్య పరిష్కారానికి సమగ్రమైన ప్రణాళికను అమలు చేస్తామని తెలిపారు. సాగుకు తక్కువ నీరు, ఎరువులు, రసాయనాలను వాడేలా రైతులను ప్రోత్సహిస్తామని తద్వారా రాయితీల కోసం విచ్చలవిడిగా కృత్రిమ రసాయనాలను వాడే పరిస్థితి తొలగుతుందని మంత్రి చెప్పారు.

## మహిళా సంఘాలకు 'ధాన్యలక్ష్మి'

గ్రామీణ స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులు, విత్తనాల నిల్వకు మహిళా స్వయం సహాయక సంఘాలకు అవకాశం కల్పిస్తామని, తద్వారా మహిళలను ధనలక్ష్ములుగా మాత్రమే కాకుండా ధాన్యలక్ష్ములుగానూ గుర్తిస్తామని నిర్మలా సీతారామన్ తెలిపారు. ముద్రా, నాబార్డ్ సంస్థల ద్వారా శీతల గిడ్డంగుల ఏర్పాటుకు రుణాలు అందజేస్తామని తెలిపారు. జాతీయ గిడ్డంగుల సంస్థ, ఫుడ్ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉన్న భూముల్లో గిడ్డంగుల నిర్మాణం చేపడతామని, నాబార్డ్‌తో 162 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గిడ్డంగులను గుర్తించి జియో ట్యాగింగ్ చేస్తామని వెల్లడించారు. విమానాల ద్వారా పంట ఉత్పత్తులను దూర ప్రాంతాలకు చేరవేసేందుకు 'కృషి ఉడాన్'పథకాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. దీంతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో శీతలీకరణ వ్యవస్థలున్న 'కిసాన్ రైళ్ల'ను నిర్మించి తొందరగా పాడైపోయే ఉత్పత్తులను దేశంలోని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు వివరించారు. ఉద్యానవన పంటల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకూ ప్రయత్నిస్తున్నామని, ఇందుకోసం రాష్ట్రాల్లో 'ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి'అన్న భావనను పెంపొందించేందుకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. సేంద్రియ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

## తగినంత వ్యవ'సాయం'

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి, గ్రామీణాభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయించారని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ వ్యాఖ్యానించారు. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం నాటి తన బడ్జెట్ ప్రసంగంలో వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.1.6 లక్షల కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. మధ్యతరగతి మహిళలకు ఈ బడ్జెట్ ఊరటనిస్తుందని, ఆరోగ్యం, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై బడ్జెట్ దృష్టి సారించిందని తోమర్ తెలిపారు. వ్యవసాయానికి, గ్రామీణాభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయించినందుకు ప్రధానికి, ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళల ప్రగతి.. శిశువుల వికాసం

**స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు రూ. 30,007 కోట్లు**

**2019-20 ఆర్థిక సంవత్సరం కంటే 14 శాతం అధికంగా నిధులు**



**న్యూఢిల్లీ:** మహిళల అభ్యున్నతి, శిశువుల వికాసానికి 2020–21 బడ్జెట్‌లో కేంద్రం నిధుల కేటాయింపులను పెంచింది. గత ఏడాది కంటే ఈ పెంపు ఏకంగా 14 శాతం అధికం. 2019–20లో కేటాయింపులు రూ.26,184.50 కోట్లు కాగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.30,007.10 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇందులో రూ.20,532.38 కోట్లను అంగన్‌వాడీ సేవలకే వినియోగించనున్నారు.

- నేషనల్ న్యూట్రిషన్ మిషన్‌కు(పోషణ్ అభియాన్) కేటాయింపులను రూ.3,400 కోట్ల నుంచి రూ.3,700 కోట్లకు పెంచారు. పోషణ్ అభియాన్ పథకంలో భాగంగా.. ఎదుగుదల లోపాలతో బాధపడుతున్న ఆరేళ్ల లోపు చిన్నారుల సంఖ్యను 2022 నాటికి 38.4 శాతం నుంచి 25 శాతానికి తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.
- లైంగిక వేధింపులు, హింస బారినపడే బాధిత మహిళలకు వైద్య సహాయం, న్యాయ, పోలీసు సహాయం, కౌన్సెలింగ్ అందించేందుకు ఉద్దేశించిన 'వన్ స్టాప్ సెంటర్'కు కేటాయింపులను రూ.204 కోట్ల నుంచి రూ.385 కోట్లకు పెంచారు.
- ప్రధానమంత్రి మాతృ వందన యోజన(పీఎంఎంవీవై) పథకానికి 2019–20లో రూ.2,300 కోట్లు కేటాయించగా, 2020–21లో రూ.2,500 కోట్లు కేటాయించారు. ఈ పథకం కింద గర్భిణికి/పాలిచ్చే తల్లికి రూ.6,000 అందజేస్తారు.
- సమగ్ర శిశు అభివృద్ధి పథకంలో(ఐసీడీఎస్) భాగంగా శిశువుల రక్షణకు నిధుల కేటాయింపులను రూ.1,350 కోట్ల నుంచి రూ.1,500 కోట్లకు పెంచారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మానస పుత్రిక 'బేటీ బచావో.. బేటీ పడావో'కార్యక్రమానికి రూ.220 కోట్లు కేటాయించారు.
- మహిళా శక్తి కేంద్రాలకు రూ.100 కోట్లు ఇచ్చారు. గత ఏడాది ఇచ్చింది రూ.50 కోట్లే. అంటే కేటాయింపులను ఈసారి రెట్టింపు చేశారు.
- వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల పథకానికి నిధుల కేటాయింపులను రూ.45 కోట్ల నుంచి ఏకంగా రూ.150 కోట్లకు పెంచేశారు.
- మహిళల అక్రమ రవాణా నియంత్రణ, సహాయ పునరావాసానికి ఉద్దేశించిన ఉజ్వల పథకానికి కేటాయింపులను రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్లకు పెంచారు.
- మహిళ రక్షణ, సాధికారత మిషన్‌కు గత ఏడాది రూ.961 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.1,163 కోట్లు కేటాయించారు.
- నేషనల్ క్రెష్ స్కీమ్‌కు కేటాయింపులను రూ.50 కోట్ల నుంచి రూ.75 కోట్లకు పెంచారు. ఈ పథకం కింద.. ఉద్యోగులైన మహిళలు పని వేళల్లో తమ పిల్లలను శిశు సంరక్షణ కేంద్రాల్లో చేర్పించవచ్చు.

**న్యూఢిల్లీ**

**కేం**ద్రంలో పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తి అవుతున్న వేళ నరేంద్రమోదీ ప్రభుత్వం సమాజ సంక్షేమానికి 2020–21 బడ్జెట్లో పెద్ద పీట వేసింది. ఇందులో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమానికి, షెడ్యూల్ తెగలు, కులాలు, మైనార్టీల శాఖలకు నిధుల కేటాయింపులు పెరిగాయి. సామాజిక సంక్షేమాన్ని మూడు విభాగాలుగా విభజిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వివరించారు. స్త్రీ, శిశు సాంఘిక సంక్షేమం, సంస్కృతి మరియు పర్యాటకం, పర్యావరణం మరియు వాతావరణ మార్పు అనే మూడు విభాగాలుగా సమాజ సంక్షేమాన్ని విభాగిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు థీమ్స్‌కు అనుగుణంగా బడ్జెట్లో పలు ప్రతిపాదనలు చేశారు. మహిళల వివాహానికి కనీస వయసును పునఃసమీక్షించేందుకు ఒక టాస్క్‌ఫోర్స్‌ను నియమిస్తున్నామని, ఈ టాస్క్‌ఫోర్స్ ఆరునెలల్లో నివేదిక అందిస్తుందని నిర్మలా సీతారామన్ తెలిపారు. బలహీన వర్గాలు, స్త్రీ, శిశు సంక్షేమంపై తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. సంక్షేమానికి గతంతో పోలిస్తే నిధులు పెంచామని తెలిపారు.

# పెళ్లీడు పెరుగుతుందా?



## మహిళల కనీస వివాహ వయస్సు పెంపుపై టాస్క్‌ఫోర్స్

**స్త్రీ, శిశు.. సాంఘిక సంక్షేమం**

**బే**టీ బచావో్– బేటీ పడావో్ పథకం బాగా విజయవంతమైందని బడ్జెట్ ప్రసంగంలో నిర్మల చెప్పారు. ప్రస్తుతం పాఠశాలల్లో స్థూల బాలికల నమోదు గణాంకాలు(94.32 శాతం) బాలుర గణాంకాల(89. 28 శాతం)కన్నా మెరుగయ్యాయని చెప్పారు. పసిపిల్లలు, గర్భిణులు, బాలింతల పౌష్టికత మెరుగుదలకు ప్రారంభించిన పోషన్ అభియాన్ కింద ఆరు లక్షల అంగన్‌వాడీలకు స్మార్ట్‌ఫోన్స్ అందించామని, వీటితో దాదాపు 10 కోట్ల కుటుంబాలకు పౌష్టికత అప్‌డేట్స్ అంది స్తున్నామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి, మాన్యువల్ స్కావెంజింగ్ అరికట్టేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ విషయంలో సాంకేతికతను వినియోగిస్తామని వివరించారు.

**బడ్జెట్లో సంక్షేమ కేటాయింపులు..**

- పౌష్టికాహార కార్యక్రమాల కోసం రూ. 35,600 కోట్లు, స్త్రీ సంక్షేమ పథకాలకు రూ. 28,600 కోట్లు కేటాయించారు.
- షెడ్యూల్ కులాల సంక్షేమం, ఓబీసీల సంక్షేమానికి రూ. 85 వేల కోట్లను, షెడ్యూల్ తెగల కోసం రూ. 53700 కోట్లను కేటాయించారు.
- దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి రూ. 9,500 కోట్లు అందించనున్నారు.
- సాంఘిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు రూ. 10,103.57 కోట్లను కేటాయించారు. గత బడ్జెట్లో ఈ మొత్తం రూ. 8,885 కోట్లు.
- మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు రూ. 5 వేల కోట్లు కేటాయించారు.
- బాలల కోసం కేటాయింపులు గత బడ్జెట్‌తో పోలిస్తే 0.13 శాతం తగ్గాయి.

## ఉపాధి హామీకి రూ. 61,500 కోట్లు

**ఈ** దఫా బడ్జెట్లో గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం రూ. 1.20 లక్షల కోట్లను కేటాయించింది. ఇందులో సింహభాగం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(ఎంజీఎన్ఆర్ఈజీఏ)కు దక్కనుంది. గత బడ్జెట్లో గ్రామీణాభివృద్ధికి రూ. 1.22 కోట్లను కేటాయించారు. 2020–21కి ఉపాధి హామీకి రూ. 61,500 కోట్లను కేటాయించారు. ఇది గత బడ్జెట్ అంచనా(రూ.60 వేల కోట్లు) కన్నా అధికం, కానీ గత బడ్జెట్ సవరించిన అంచనా(రూ. 71 వేల కోట్లు) కన్నా తక్కువ. బడ్జెట్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్‌కు రూ. 19,500 కోట్లను కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ఉద్దేశించిన ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజనపథకానికి సైతం ఇంతే మొత్తంలో నిధులు కేటాయించారు. ఆరోగ్యరంగానికి ఈ బడ్జెట్లో రూ. 69వేల కోట్లను కేటాయించారు. ఇందులో రూ.6,400 కోట్లు ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన(ఆయుష్మాన్ భారత్)కు అందిస్తారు. ఎల్‌పీజీ సిలిండర్లను పేదలకు అందించే ఉజ్వలా పథకం బడ్జెట్లో రూ.1,118కోట్లు పొందింది.

## సంస్కృతి, పర్యావరణం

పర్యాటకాన్ని వృద్ధి చేసేందుకు, ఐఐహెచ్‌సీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెరిటేజ్ అండ్ కన్జర్వేషన్) ఏర్పాటు చేసి దానికి డీమ్డ్ యూనివర్సిటీ హోదా కల్పిస్తామని నిర్మల తెలిపారు. దేశంలో ఐదు చోట్ల పురావస్తు సైట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కోల్‌కతాలోని ఇండియన్ మ్యూజియంతో సహా నాలుగు ఇతర మ్యూజియంలను రిక్యూరేట్ చేస్తామని తెలిపారు. జార్ఖండ్‌లో ట్రైబల్ మ్యూజియం, లోథాల్‌లో మారిటైమ్ మ్యూజియంను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది జనవరి నుంచి వాతావరణ మార్పుపై పారిస్ సదస్సులో తీసుకున్న నిర్ణయాల అమలును చేపడతామని తెలిపారు. వాతవరణ కాలుష్య నివారణకు, పదిలక్షల జనాభా దాటిన నగరాల్లో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పేందుకు రూ. 4400 కోట్లను కేటాయిస్తున్నట్లు చెప్పారు.

epaper.sakshi.com




## రాజ్యాధినేతకు రాలని నిధులు



**న్యూఢిల్లీ:** 2020–21 వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రపతి కార్యాలయ నిర్వహణ, ఉద్యోగులు, అలవెన్సుల కోసం రూ. 80.98 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. గత బడ్జెట్‌లో ఇందుకోసం తొలుత రూ. 76.33 కోట్లు కేటాయించినప్పటికీ తర్వాత దాన్ని రూ. 74.42 కోట్లకు సవరించారు. ఈసారి బడ్జెట్‌లో నిరుటితో పోలిస్తే 8.81 శాతం అధికంగా కేటాయించారు. ఈ నిధుల్లో రూ. 60 లక్షలు రాష్ట్రపతి వేతనానికి, రూ. 32.78 కోట్లు మౌలిక వసతులు, అనుబంధ ఖర్చులు, రూ. 47.60 కోట్లను సిబ్బంది జీతాలు, కార్యాలయ నిర్వహణ తదితరాలకు కేటాయించారు.

## డేటా సెంటర్ల నిర్మాణానికి విధానం

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా డేటా సెంటర్ల నిర్మాణానికి తగిన విధానాన్ని సిద్ధం చేస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించారు. లోక్‌సభలో శనివారం బడ్జెట్ ప్రసంగంలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. డిజిటల్ రంగానికి ఊతమిచ్చేందుకు పలు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. భారత్ నెట్ కార్యక్రమం కింద దేశంలోని లక్ష గ్రామ పంచాయతీలను అనుసంధానించేందుకు రూ.6 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామ పంచాయతీ స్థాయిలోని అన్ని ప్రభుత్వ సంస్థలను డిజిటల్ పద్ధతిలో అనుసంధానిస్తామని తెలిపారు. క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ విస్తృత వాడకం కోసం రానున్న ఐదేళ్లలో రూ.8 వేల కోట్లు ఖర్చు పెడతామని తెలిపారు. 'కంప్యూటింగ్ రంగంలో క్వాంటం టెక్నాలజీ కొత్త అవకాశాలను సృష్టిస్తోంది.




## 2025కల్లా టీబీని తరిమేస్తాం..

**న్యూఢిల్లీ:** 2025 కల్లా టీబీని తరిమేయడమే లక్ష్యంగా ప్రచార కార్యక్రమం ప్రారంభిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. తక్కువ ధరలకే మందులు అమ్మేందుకు దేశంలోని ప్రతి జిల్లాలో జన ఔషధి కేంద్రాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. వైద్య పరికరాలపై పన్ను తగ్గిస్తామని దీని వల్ల కొత్త హాస్పిటల్స్ పెరుగుతాయని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ కింద అన్ని జిల్లాల్లో ఆస్పత్రులు నిర్మించేందుకు నిధులు సమకూరుస్తామన్నారు. పంటల కోసం గిడ్డంగులను నిర్మిస్తామని చెప్పారు. మూరుమూల ప్రాంతాల అభివృద్ధి, పంచాయతీ రాజ్ కోసం రూ. 1.23లక్షల కోట్లు, వ్యవసాయ సంబంధిత పనుల కోసం రూ.1.6లక్షల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జంతువుల కృత్రిమ గర్భధారణను ప్రస్తుతమున్న 30 శాతం నుంచి 70శాతానికి పెంచుతామన్నారు. చేపల ఉత్పత్తి 2022 కల్లా 200లక్షల టన్నులకు చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## దిగుమతి వైద్య పరికరాలపై 'ఆరోగ్య పన్ను'

**న్యూఢిల్లీ:** దేశీయంగానే వైద్య పరికరాల ఉత్పత్తిని మరింత పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వైద్య పరికరాలపై ఆరోగ్య పన్ను(హెల్త్ సెస్) విధిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. దిగుమతులను నిరుత్సాహపర్చి, స్వదేశంలో పరికరాల తయారీని పెంచడానికే ఈ పన్ను అని వెల్లడించారు. హెల్త్ సెస్ ద్వారా వచ్చే సొమ్మును ఆరోగ్య సేవల రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు వెచ్చిస్తామన్నారు. వైద్య పరికరాల విషయంలో కొన్నేళ్ల క్రితం వరకూ మన దేశం దిగుమతులపై ఆధారపడేదని, ప్రస్తుతం ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగిందని గుర్తుచేశారు. ఈ రంగానికి మరింత ఉద్దీపన అవసరమని అన్నారు. దేశ ప్రజలందరికీ ఆరోగ్య సేవలు అందించడానికి తమ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం ఇందుకు ఎంతగానో దోహదపడుతోందని నిర్మలా సీతారామన్ తెలిపారు.

## అధికారుల శిక్షణకు రూ.238 కోట్లు

**న్యూఢిల్లీ:** బ్యూరోక్రాట్ల దేశీ, విదేశీ శిక్షణ, కోసం దాదాపు రూ. 238 కోట్లను కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది. దీంట్లో 83.45 కోట్ల రూపాయలు ఢిల్లీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియట్ ట్రెనింగ్ అండ్ మేనేజ్‌మెంట్ (ఐఎస్‌టీఎం), ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఓల్‌బీఎస్ ఎన్‌ఏఏ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ కేంద్రాలకు కేటాయించారు. ఐఎస్‌టీఎం, ఎల్‌బీఎస్‌ఎన్‌ఏఏ సంయుక్తంగా ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ (ఐఏఎస్)లకూ, వివిధ స్థాయిల్లోని ప్రభుత్వాధికారులకు పాలనా వ్యవహారాలూ, విధివిధానాలపై ప్రతియేటా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తారు. ప్రభుత్వోద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటైన సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) కోసం రూ.124.92 కోట్ల రూపాయలు అవసరమౌతాయని కేంద్రం భావించింది.

## పీఎఫ్‌ఆర్డీఏ చట్టంలో సవరణలకు ప్రతిపాదనలు

**న్యూఢిల్లీ:** పింఛన్ నిధి నియంత్రణ సంస్థ పాత్రను బలోపేతం చేసేందుకు పెన్షన్ నిధి నియంత్రణ, అభివృద్ధి అథారిటీ ఆఫ్ ఇండియా (పీఎఫ్‌ఆర్డీఏఐ) చట్టంలో పలు మార్పులు చేయాలని శనివారం నాటి బడ్జెట్‌లో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. ప్రభుత్వ ఉద్యోగులకు తప్పనిసరైన జాతీయ పెన్షన్ పథకం(ఎన్పీఎస్) ట్రస్టును పీఎప్‌ఆర్డీఏ ట్రస్టు నుంచి వేరు చేయాలని అన్నారు. అలాగే పింఛన్ ట్రస్టులను ప్రభుత్వం తరపున కాకుండా.. ఉద్యోగుల ఆధ్వర్యంలో ప్రైవేటుగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పీఎఫ్‌ఆర్డీఏ బిల్లు సెప్టెంబర్ 2013లో పార్లమెంట్‌లో ఆమోదం పొందగా.. 2014 ఫిబ్రవరి నుంచి అమల్లోకి వచ్చింది.

# హెల్త్‌కు వెల్త్

**న్యూఢిల్లీ:** ''ఆరోగ్య రంగానికి మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. పౌరుల్ని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సాగుతున్నాం'' అని బడ్జెట్ ప్రసంగం సందర్భంగా చెప్పిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆరోగ్య రంగాన్ని మరింత మెరుగుపరచడానికే ప్రాధాన్యం ఇచ్చారు. ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాల ఆధునీకరణపై దృష్టి సారించారు. ఇందుకోసం ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఆసుపత్రుల సంఖ్యను పెంచనున్నారు. ఆరోగ్యం అంటే వ్యాధులు సోకితే ఆస్పత్రుల్లో చికిత్స చేయడమే కాదు, ప్రజలు రోగాల బారిన పడకుండా పూర్తి ఫిట్‌గా ఉండేలా చూడడం కూడా. ఇందుకోసం ఈ సారి ప్రజారోగ్యమే అంతిమ లక్ష్యంగా కేంద్రం కొనసాగిస్తున్న ఎన్నో పథకాలను విస్తరించాల్సిన అవసరం గురించి సీతారామన్ వివరించారు. గత బడ్జెట్‌తో పోల్చి చూస్తే ఆరోగ్య రంగ నిధుల్ని 8శాతం పెంచారు.



**పథకాల కేటాయింపులు**

| ఆయుష్మాన్ భారత్ | స్వచ్ఛ భారత్ మిషన్ |
|---|---|
| రూ.6, 400 కోట్లు | రూ.12,300 కోట్లు |

జల్‌జీవన్ మిషన్: రూ.11,500 కోట్లు

### ఆయుష్మాన్ భారత్ విస్తరణ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలల పథకం ఆయుష్మాన్ భారత్–ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (ఏబీ–పీఎంజేఏవై) విస్తరించడానికి కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేసింది. మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ, ప్రైవేటు (పీపీపీ) భాగస్వామ్యంతో ఆయుష్మాన్ భారత్ పథకం కింద మరిన్ని ఆస్పత్రులను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఈ ఆస్పత్రుల ఏర్పాటు ప్రైవేటు వ్యక్తులకి లాభదాయం కాకపోతే వయబిలిటీ గ్యాప్ కింద ప్రభుత్వమే నిధుల్ని సమకూరుస్తుంది. దీని కోసం దేశవ్యాప్తంగా 112 జిల్లాలను ఎంపిక చేస్తారు. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ పరిధిలోకి వచ్చే ఆస్పత్రులు లేని చోట కొత్త ఆస్పత్రుల్ని ఏర్పాటు చేస్తారు. తద్వారా యువతకు ఎన్నో కొత్త ఉద్యోగాల కల్పన జరుగుతుందని మంత్రి చెప్పారు. ఆయుష్మాన్ భారత్‌కి గత బడ్జెట్‌లో రూ.6,400 కోట్లు కేటాయిస్తే, ఈ సారీ అంతే మొత్తాన్ని కేటాయించారు. 2018లో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టారు. భారత్ జనాభాలో దాదాపుగా 40శాతం మందికి లబ్ధి చేకూరేలా, నిరుపేద కుటుంబాలకు ఏడాదికి రూ.5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ ఇవ్వడమే ఈ పథకం లక్ష్యం. 10.74 కోట్ల కుటుంబాలకు చెందిన దాదాపుగా 50 కోట్ల మంది ఈ పథకం లబ్ధిదారులుగా ఉన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2019, నవంబర్ 25 నాటికి ఆయుష్మాన్ భారత్ కింద 11.4 కోట్ల మందికి ఇ–కార్డుల్ని జారీ చేశారు.

### ముఖ్యాంశాలు..

- మిషన్ ఇంద్ర ధనుష్ (ప్రభుత్వ వాక్సినేషన్ కార్యక్రమం) కింద అయిదు వైరస్‌లు సహా 12 కొత్త తరహా వ్యాధుల్ని తీసుకువచ్చారు.
- ప్రజల జీవన విధానంలో వచ్చే మార్పుల కారణంగా వచ్చే ఆరోగ్య సమస్యల నివారణ కోసం ఫిట్ ఇండియా ఉద్యమం, అందరికీ సురక్షిత మంచినీరు అందించడం కోసం జలజీవన్ మిషన్ , దేశంలో పారిశుద్ధ్య వ్యవస్థని మెరుగుపరిచి పరిశుభ్రంగా ఉండడం కోసం స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా నిరుపేదలకు వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకుంటున్నారు.
- ఆయుష్మాన్ భారత్ కిందకి వచ్చే ఆసుపత్రుల సంఖ్యను టైర్ 2, టైర్ 3 నగరాల్లో పెంచాలని నిర్ణయం. ప్రస్తుతం ఈ పథకం కింద 20 వేలకుపైగా ఆసుపత్రులు ఉన్నాయి. మరో వెయ్యి ఆస్పత్రులు పెంచడానికి చర్యలు
- ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో జిల్లా స్థాయిలో మెడికల్ కాలేజీల్లో నాణ్యతా ప్రమాణాలను పెంచడం.
- ప్రజలకు అందుబాటు ధరల్లో మందులు దొరికేలా అన్ని జిల్లాల్లో జన్ ఔషధి కేంద్రాల ఏర్పాటు. జనరిక్ మెడిసిన్స్‌ని విక్రయించే ఈ దుకాణాలను నాలుగేళ్లలో అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయడానికి సన్నాహాలు.
- వైద్య పరికరాల దిగుమతులు, విక్రయం ద్వారా వచ్చే పన్నుల్ని ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగం. కొన్ని నిర్దిష్ట వైద్య పరికరాల దిగుమతులపై 5శాతం ఆరోగ్య సెస్ విధింపు . ప్రస్తుతం భారత వైద్య పరికరాల రంగం 80 నుంచి 90 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడింది. ఈ నిర్ణయంతో రెండు రకాలుగా ప్రయోజనాలున్నాయని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మెడికల్ డివైస్ ఇండస్ట్రీకి చెందిన సమన్వయకర్త రాజీవ్ నాథ్ అన్నారు. వైద్య పరికరాల రంగం మేకిన్ ఇండియాకు ఊతమిస్తుందని, మౌలిక సదుపాయాలకు ఈ నిధుల్ని వినియోగించడం వల్ల జాతీయ ఆరోగ్య రంగ భద్రతపై నెలకొన్న ఆందోళనలు తొలగిపోయే అవకాశాలున్నాయని అన్నారు.
- ఆరోగ్య రంగ అధికారులు మిషన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వ్యాధులపై పోరాటం చేయాలి.
- క్షయ ఓడిపోతుంది దేశం గెలుస్తుంది అన్న నినాదంతో ట్యూబర్ కొలాసిస్ (టీబీ)పై పోరుబాట. 2025 నాటికి క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా కేంద్రం అడుగులు.

### ప్రతీ జిల్లాలో ఓ మెడికల్ కాలేజ్

దేశంలోని ప్రతీ జిల్లాలోనూ ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసేందుకు కేంద్రం కసరత్తు చేస్తోందని పార్లమెంటులో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో వైద్యుల కొరత ఉందని, దీన్ని అధిగమించడానికి ప్రైవేటు–ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రతీ జిల్లా కేంద్రంలో ఉన్న ఆసుపత్రికి మెడికల్ కాలేజీని అనుబంధంగా ఏర్పాటు చేస్తామన్నారు. భూమి, మౌలిక సదుపాయాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చే రాష్ట్రాల్లో వీటికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. రోగులు– వైద్యుల నిష్పత్తిలో వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ఉద్దేశించిన ఈ పథకం వివరాలు త్వరలోనే ప్రకటిస్తామన్నారు. సరిపడినంత స్థాయిలో రెసిడెంట్ డాక్టర్స్ డిప్లొమా/ ఫెలో బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ కోర్సులను ఆఫర్ చేసే ఆసుపత్రులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు.

**న్యూఢిల్లీ:** బడ్జెట్ ప్రసంగం ప్రారంభంలో దేశ భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని చెప్పిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రక్షణ రంగానికి రూ. 3.37 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. పొరుగు దేశాల హెచ్చరికల నేపథ్యంలో దేశ రక్షణ రంగం అధిక ఆర్థిక కేటాయింపుల కోసం ఎదురుచూస్తుండగా గత యేడాదికంటే రక్షణ బడ్జెట్ కేటాయింపులను కేంద్రం ఆరుశాతం కూడా పెంచకపోవడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరం రక్షణ రంగానికి రూ.3.18 లక్షలకోట్లు కేటాయించింది. కొత్త ఆయుధాల కొనుగోలు, యుద్ధ విమానాలూ, యుద్ధనౌకలు, ఇతర సైనిక పరికరాలు కొనుగోలు చేయడానికి మూలధన వ్యయం కోసం రూ. 1.13 లక్షల కోట్లు కేటాయించారు. 2019–20 సవరించిన రూ. 3.31 లక్షల కోట్ల అంచనా ప్రకారం అయితే ఈ పెంపుదల కేవలం 1.8 శాతం మాత్రమే. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇది చైనా–భారత్ యుద్ధం1962 తరువాత రక్షణ రంగానికి జరిపిన అతితక్కువ బడ్జెట్ కేటాయింపులు. ఉద్యోగుల వేతనాలూ, నిర్వహణకు రూ.2.09 లక్షల కోట్లు అవుతుంది. రక్షణ రంగ ఉద్యోగులకు పెన్షన్లకు నిధులు సరిపోక పోయినప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థని పరిగణనలోనికి తీసుకోవాల్సి ఉంటుంది. అని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అండ్ ఎనాలసిస్ కి చెందిన డాక్టర్ లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. గత ఏడాది పెట్టుబడి వ్యయం రూ.1,03,394 కోట్లను రూ.1,13,734 కోట్లకు పెంచారు. ఇది గతం కంటే 10,340 కోట్ల రూపాయలు అధికం. ఇక ఉద్యోగుల వేతనాలూ, నిర్వహణ విభాగాలను కలిపితే రూ.2,09,319 కోట్ల రూపాయలవుతుంది. అయితే గత ఆర్థిక సంవత్సరం 2019–20లో వేతనాలూ, తదితరాలకు 2,01,901 కోట్ల రూపాయలు కేటాయించారు.

గత పదేళ్లలో రక్షణ రంగ కేటాయింపులు పెరుగుతూ వస్తున్నాయి. ప్రతియేటా సుమారు రక్షణ రంగం నుంచి దాదాపు 60,000 మంది పదవీ విరమణ చేస్తున్నందున ఈ రంగంలో పెన్షన్లకు కేటాయించే నిధుల శాతం పెరుగుతున్నట్టు 2019లో స్టాండింగ్ కమిటీ పేర్కొన్నది. దీంతో సాయుధ దళాల ఆధునీకరణకు నిధులు తగ్గుతున్నాయి. గత పదేళ్ళలో రక్షణరంగంలోని ఉద్యోగుల పెన్షన్లకు ఖర్చు చేస్తున్న మొత్తం 12 శాతానికి పెరిగింది. ప్రభుత్వం పెన్షన్ బిల్లును, కొన్ని ఇతర పెన్షన్ పథకాలను ప్రవేశపెట్టడం ద్వారా లేదా ముందస్తు పదవీ విరమణ ద్వారా ప్రభుత్వం పెన్షన్ బిల్లుని తగ్గిస్తుందని స్టాండింగ్ కమిటీ పేర్కొంది.

**రక్షణ రంగ నిధులు.. దేనికెంత?**

2019–20 బడ్జెట్ కేటాయింపుల్లో పెన్షన్లు, వేతనాలకు కలిపి మొత్తం 51 శాతం ఖర్చు చేస్తున్నారు. అంటే గత బడ్జెట్‌లో 2,20,541 కోట్లరూపాయలు కేవలం పెన్షన్లు, వేతనాలకు సంబంధించినవి.

రక్షణ రంగబడ్జెట్ కేటాయింపుల్లో వేతనాలకు 25%

| పెన్షన్లు | స్టోర్స్ | ఇతరములు |
|---|---|---|
| 26% | 11% | 14% |

క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ 24%




# రక్షణకు అరకొరే..

## డిఫెన్స్‌కు 3.37 లక్షల కోట్లు కేటాయింపు

### గతం కంటే 5.8 శాతమే పెరుగుదల


కేటాయించిన రూ.1.33 కోట్లు కలుపుకుంటే ఈ మొత్తం కేటాయింపులు 4.71 లక్షల కోట్ల రూపాయలకు చేరతాయి.

చైనా తన రక్షణ వ్యవస్థని మరింత పటిష్టం చేసుకుంటున్న నేపథ్యంలోనూ, మారుతున్న దేశభద్రత రీత్యా, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో రక్షణ రంగ ఆధునీకీకరణకు ఇంకా ఎక్కువ నిధులు అవసరమవుతాయి. గత ఏడాది బాలకోట్ దాడుల అనంతరం బడ్జెట్ కేటాయింపులు పెరుగుతాయన్న ఆశాభావం వ్యక్తం అయ్యింది. అయితే ఊహించిన దానికంటే భిన్నంగా తక్కువ నిధులే కేటాయించారు.అవసరాలను అనుగుణంగా కేటాయింపులు లేకపోయినప్పటికీ దేశ ఆర్థిక పరిస్థితిని పరిగణనలోనికి తీసుకుంటే ఈ కేటాయింపులు సంతృప్తికరంగానే ఉన్నాయన్న వాదన కూడా వినిపిస్తోంది.

''రక్షణ రంగానికి కేటాయించిన

**గత పదేళ్ళలో రక్షణ రంగానికి కేటాయింపులు** (కోట్లలో)

| ఏడాది | రక్షణ రంగ కేటాయింపులు | క్యాపిటల్ వ్యయం | శాతంలో |
|---|---|---|---|
| 2009–10 | 1,80,018 | 51,112 | 28 శాతం |
| 2010–11 | 1,94,606 | 62,056 | 32 శాతం |
| 2011–12 | 2,13,673 | 67,092 | 32 శాతం |
| 2012–13 | 2,30,642 | 70,499 | 31 శాతం |
| 2013–14 | 2,54,133 | 79.125 | 31 శాతం |
| 2014–15 | 2,85,005 | 73,401 | 26 శాతం |
| 2015–16 | 2,93,920 | 71,675 | 24 శాతం |
| 2016–17 | 3,51,550 | 86,375 | 25 శాతం |
| 2017–18 | 3,79,704 | 90,438 | 24 శాతం |
| 2018–19 | 4,05,199 | 93,982 | 23 శాతం |
| 2019–20 | 4,31,011 | 1,03,394 | 24 శాతం |




# పేద విద్యార్థులకు ఆన్‌లైన్ డిగ్రీ

## దేశంలోని 100 అగ్ర విద్యాసంస్థల్లో అమలు

- త్వరలో నూతన విద్యా విధానం ప్రారంభం
- విద్యారంగానికి రూ.99,300 కోట్లు నిధులు
- నైపుణ్యాభివృద్ధికి మరో రూ.3000 కోట్లు
- విదేశీ విద్యార్థులకు ఇండ్–సాట్ పరీక్ష

**న్యూఢిల్లీ:** త్వరలో ప్రారంభించనున్న నూతన విద్యావిధానంలోని పలు అంశాలను నిర్మలా సీతారామన్ వివరించారు. ఉన్నతవిద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచేందుకు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రుణాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించనున్నారు. పబ్లిక్‌ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో జాతీయ పోలీస్ యూనివర్సిటీ, జాతీయ ఫోరెన్సిక్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తారు. వాటిని జిల్లా మెడికల్ కాలేజీలతో అనసంధానిస్తారు. అలాగే పేదవిద్యార్థులకు ఆన్‌లైన్‌లో డిగ్రీ కోర్సులను అందుబాటులోకి తెస్తారు, ఇండియాలో చదివేందుకు ఆసక్తి చూపే ఆసియా–ఆఫ్రికా విద్యార్థులకు ఇండ్–సాట్ పేరిట ప్రత్యేక పరీక్ష నిర్వహించి, ప్రతిభావంతులకు ఉపకార వేతనం కూడా అందించనున్నారు.




### ముఖ్యాంశాలు..

1. ఉన్నత విద్య అందుబాటులో లేని బలహీన, ఆర్థికంగా వెనకబడిన తరగతులకు చెందిన విద్యార్థులకు ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులను అందుబాటులోకి రానున్నాయి. దేశంలో టాప్ 100 విద్యాసంస్థల ద్వారా ఈ ప్రోగ్రాం అందుబాటులోకి తీసుకురానున్నట్లు సీతారామన్ ప్రకటించారు.
2. 2020–21 బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టిన సందర్భంగా విద్యారంగంలో ప్రవేశపెట్టబోయే నూతన విధానాలపై ఆమె ప్రసంగించారు. త్వరలో నూతన విద్యా విధానం తీసుకురాబోతున్నామని వెల్లడించారు. ఇందుకోసం రూ.99,300 కోట్లు విద్యారంగానికి నిధులు కేటాయించబోతున్నామని ఆమె పేర్కొన్నారు.
3. ప్రత్యేకంగా మరో రూ.3000 కోట్లు నైపుణ్యాభివృద్ధికి వెచ్చిస్తారు. కేంద్ర ఆరోగ్య, నైపుణ్యాభివృద్ధి మరియు ఎంట్రప్రెన్యూర్ షిప్ శాఖల సహకారంతో స్కిల్ ఇండియా మిషన్ కార్యక్రమం చేపడతారు. తద్వారా దేశవ్యాప్తంగా నైపుణ్య వాతావరణం సృష్టించి పౌరుల నైపుణ్యాలను మరింతగా మెరుగుపరుస్తారు.
4. ఉన్నత విద్యాభ్యాసానికి భారత్ కేంద్రంగా మారాలన్న తలంపుతో 'స్టడీ ఇన్ ఇండియా' ను రూపొందించారు. ఇందులో భాగంగా ఐఎన్‌డీ– ఎస్‌ఏటీ పరీక్షను నిర్వహిస్తారు. ఆసియా, ఆఫ్రికా దేశాలకు చెందిన ప్రతిభ గలిగిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తారు.
5. కొత్త విద్యా విధానంపై అన్ని రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు, ఇతర భాగస్వాములతో చర్చించామని తెలిపారు. దీనిపై రెండు లక్షలకుపైగా సలహాలు, సూచనలు స్వీకరించామన్నారు. త్వరలోనే నూతన విద్యా విధానాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు. ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలు, మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించే దిశగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు.
6. విద్య అనంతరం ఉద్యోగ అవకాశాలు పెరగాలంటూ డిమాండ్లు పెరుగుతున్న దరిమిలా.. 2021 మార్చి నెలనాటికి 150 ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో అప్రెంటిష్‌షిప్‌తో కూడిన డిగ్రీ, డిప్లొమా కోర్సులను కూడా ప్రవేశపెట్టబోతున్నారని ప్రకటించారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని సంబంధిత స్థానిక సంస్థల్లో ఏడాదిపాటు అప్రెంటిస్‌షిప్‌కి వీలు కల్పించేందుకు ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టబోతోందని తెలిపారు. ఆర్థికంగా వెనకబడి, బలహీన వర్గాలకు ఉన్నత విద్య అందించేందుకు డిగ్రీ స్థాయిలో పూర్తిస్థాయి ఆన్‌లైన్ విద్యా విధానాన్ని అమలు చేయబోతున్నట్లు ప్రకటించారు.
7. జాతీయ పోలీసు యూనివర్సిటీ, జాతీయ ఫోరెన్సిక్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయనున్నారు. పబ్లిక్‌ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపట్టే ఈ కార్యక్రమంలో ఈ యూనివర్శిటీలను భతజిల్లా మెడికల్ కాలేజీలతో అనసంధానిస్తామని, దీనివల్ల మెరుగైన వైద్యసేవలు లభిస్తాయి.